


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
visit us @ http://epaper.suryaa.com
సోమవారం | 30 సెప్టెంబర్ 2024 | హైదరాబాద్
సంపుటి 17 | సంచిక 300
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...

APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - వర్ష ఋతువు, భాద్రపద మాసం బ. త్రయోదశి రా.6.58 వరకు, మఖ ఉ.7.44, వర్జ్యం సా.4.27 నుంచి 6.11 వరకు
రాహుకాలం ఉ.7.30 నుంచి 9.00 వరకు దుర్ముహూర్తం మ.12.21 నుంచి 1.10 వరకు తిరిగి మ.2.46 నుంచి 3.35 వరకు

## క్రియేట్ ఇన్ ఇండియాలో
# భాగస్వాములు కండి

- నూతన ఉత్పత్తుల తయారీదారులకు ప్రధాని మోడీ పిలుపు
- మన్‌కీ బాత్ 114వ ఎపిసోడ్‌లో మోడీ భావోద్వేగం
- ఈ కార్యక్రమం సామూహిక శక్తిని ప్రదర్శించే ప్రత్యేక వేదికగా మారింది
- భారత్ 20 వేల భాషలకు పుట్టిల్లు.. పరిరక్షణకు చర్యలు : మోడీ

మనసులో మాట పేరుతో ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే మన్‌కీ బాత్ కార్యక్రమం 114వ ఎపిసోడ్‌లో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రజల ప్రయత్నాలు, స్ఫూర్తిదాయకమైన కథనాలను మన్‌కీబాత్ చూపిస్తోందన్నారు. కార్యక్రమం ప్రారంభించి పదేళ్లు పూర్తిచేసుకోనున్న నేపథ్యంలో ఈ ఎపిసోడ్ తనకు భావోద్వేగమైనదని అన్నారు. సామూహిక శక్తిని ప్రదర్శించే ప్రత్యేక వేదికగా ఈ కార్యక్రమం మారిందన్నారు. మన్‌కీ బాత్ ద్వారా తన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మీడియాకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. సాధారణంగా మసాలాలేని కంటెంట్‌ను ప్రజలు పట్టించుకోరనే అభిప్రాయం ఉండేదని.. ఈ కార్యక్రమం ఆ అభిప్రాయాన్ని మార్చేసిందన్నారు.

6లో



## ఏఐసీసీ చీఫ్ ఖర్గేకు
# అస్వస్థత



6లో

- వేదికపై ప్రసంగిస్తూ స్పృహ తప్పిపడబోతున్న ఖర్గే
- మంచినీరు తాగిన తర్వాత ప్రసంగాన్ని కొనసాగించిన మల్లికార్జున ఖర్గే
- మోడీని గద్దె దించే వరకు చనిపోనని శపథం

## కబ్జాలను నిర్మూలిస్తేనే
# హైదరాబాద్ సేఫ్
### లేకపోతే విజయవాడ పరిస్థితే

- పేదోళ్లను అడ్డంపెట్టి... బిల్డర్లు వ్యాపారం చేస్తున్నారు
- అమెరికాలో స్థిరపడిన తెలుగు వారు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి తోడ్పడండి
- అభివృద్ధి, స్వేచ్ఛ ప్రధాన లక్ష్యంగా ముందుకెళదాం
- లేక్స్ కబ్జాలతో పార్కులు కనుమరుగు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపు



3లో

## పుణె మెట్రో సెక్షన్‌ను
# ప్రారంభించిన మోడీ

- జిల్లా కోర్టు, స్వర్‌గేట్ మధ్య భూగర్భ మార్గం
- అర్బన్ ట్రాన్స్‌పోర్టేషన్ గణనీయంగా పెరుగుతుందని అంచనా
- రూ.11,200 కోట్ల విలువ చేసే ప్రాజెక్టుల శంకుస్థాపన, జాతికి అంకితం చేసిన మోడీ

పధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారంనాడు న్యూ పుణె మెట్రో సెక్షన్‌ను ప్రారంభించారు. జిల్లా కోర్టు, స్వర్‌గేట్ మధ్య నడిచే ఈ భూగర్భ మార్గంతో పుణెలోని అర్బన్ ట్రాన్స్‌పోర్టేషన్ గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.



6లో


సూర్య వెబ్‌సైట్


సూర్య ఈ - పేపర్

## అమిత్ షాతో
# రామ్మోహన్ నాయుడు భేటీ

- విమానయాన రంగం పురోగతిపై సమీక్ష
- ఎయిర్ పోర్టుల్లో మౌలిక సదుపాయాలు కల్పనపై చర్చలు
- విమానాశ్రయాల అభివృద్ధికి ఎన్డీయే సర్కార్ కట్టుబడి ఉంది
- అన్ని రాష్ట్రాలకు కనెక్టివిటీ పెంచేందుకు కృషి చేస్తున్నాం : రామ్మోహన్ నాయుడు

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ఢిల్లీలో ఆదివారం భేటీ అయ్యారు. భారత విమానయాన రంగం పురోగతిపై సమీక్షించడంతోపాటు ఎయిర్ పోర్టుల్లో మౌలిక సదుపాయాలు కల్పనపై అమిత్ షాతో చర్చించారు.



6లో

## అంగుళం భూమి కూడా
# కబ్జా కానివ్వొద్దు



3లో

- సామాన్యులకు మేలు జరిగేలా రెవెన్యూ వ్యవస్థలో ప్రక్షాళన
- 33 జిల్లాల తహశీల్దార్లతో ముఖాముఖి
- రెవెన్యూ ఉద్యోగులకు ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

# హర్యానాలో కొత్త ట్రెండ్



6లో

- కాంగ్రెస్ సభల్లో పాకిస్థాన్ అనుకూల నినాదాలు
- బుజ్జగింపు రాజకీయాలతో కాంగ్రెస్‌కు కంటిమీద కునుకులేకుండా పోయింది
- మరో మూడు తరాలు మారినా ఆర్టికల్ 370 వెనక్కి తీసుకురాలేరు
- హర్యానాలోని బాద్షాపూర్ ర్యాలీలో అమిత్ షా

## అంతా ఇంతే!




వర్షం మరింత గట్టిగా పడితే కూల్చివేతలు అవసరం లేదు

## రూ.32,237 కోట్లతో హైదరాబాద్
# మెట్రో రైలు రెండో దశ

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ పనులను రూ.32,237 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. రెండో దశలో... కొత్తగా ఏర్పాటవుతున్న ఫ్యూచర్ సిటీకి మెట్రో రైలు పరుగులు తీయనుంది.



7లో

## నెయ్యిలో కల్తీ జరిగింది అప్పుడేనా?



2లో

- సిట్ విచారణలో సంచలన విషయాలు
- ఏఆర్ డెయిరీని ఎందుకు ఎంపిక చేశారు?
- పలు అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించిన సిట్ అధికారులు

# సిరియాపై అమెరికా దాడి

- వైమానిక దాడుల్లో 37 మంది టెర్రరిస్టులు హతం
- అల్‌ఖైదా అనుబంధ సంస్థలకు చెందినవారేనని వెల్లడి
- ఐసిస్ గ్రూప్ మళ్లీ పడగ విప్పకుండా భారీ బలగాలు మోహరించిన అమెరికా
- తాజా దాడులతో ఐసిస్ శక్తిసామర్థ్యాలు దెబ్బతిన్నట్లు అమెరికా ప్రకటన

లెబనాన్లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ వరుస దాడులు తదితర పరిణామాలతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికంగా యుద్ధ విస్తరణ భయాల నడుమ.. అటు సిరియాలో అమెరికా బలగాలు విరుచుకుపడ్డాయి.



6లో

## అక్టోబర్ 2న ప్రశాంత్ కిశోర్ కొత్త పార్టీ



6లో

- కొత్త పార్టీకి నాయకుడుని నేను కాదు
- ప్రజలే నాయకత్వ బాధ్యతలు స్వీకరించాల్సిన సమయం వచ్చింది
- రాజకీయాలతో సంబంధం లేకుండా యాత్ర కొనసాగుతుందన్న పీకే

## తమిళనాడు డిప్యూటీ సీఎంగా ఉదయనిధి



6లో

- మంత్రివర్గాన్ని పునర్‌వ్యవస్థీకరించిన సీఎం స్టాలిన్
- నలుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం
- జైలు నుంచి బెయిల్‌పై వచ్చి మంత్రిగా ప్రమాణం చేసిన సెంథిల్ బాలాజీ

## పాక్‌కు ఐఎంఎఫ్ కంటే
# పెద్ద సాయం చేసేవాళ్లం



వివరాలు-6లో

- కశ్మీర్‌లో ప్రజాస్వామ్యం నెలకొనడం పాక్‌కు ఇష్టం లేదు
- అంతర్జాతీయ వేదికలపై పాకిస్తాన్ ఒంటరిగా మారింది
- కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్

## విశాఖ స్టీలుపై ఎంపీ కీలక వ్యాఖ్యలు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : విశాఖ ఉక్కు పరిశ్రమలో పెట్టుబడుల ఉపసంహరణపై ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నామని, ప్లాంట్ నష్టాలను భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం పదే పదే ప్యాకేజీలు ఇవ్వలేదని కేంద్ర ఉక్కు,భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తేల్చి చెప్పారు. సెయిల్‌లో విలీనానికి కొన్ని సాంకేతిక సమస్యలు అడ్డంకిగా ఉన్నాయన్న ఆయన.. అయినా ముందుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

## భువనమ్మకు మంత్రి సవిత ధన్యవాదాలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : చేనేత కార్మికులకు అండగా నిలిచిన సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరికి రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత ధన్యవాదాలు తెలిపారు. రాబోయే పండగల నేపథ్యంలో చేనేత వస్త్రాలు ధరించాలని, నేతన్న కళాకారులకు అండగా నిలవాలని నారా భువనేశ్వరి పిలువునివ్వడంపై మంత్రి హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. నిజం గెలవాలి పర్యటన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికుల కష్టాలను నారా భువనేశ్వరి స్వయంగా చూశారన్నారు. యాసిడ్, బ్లీచింగ్ మధ్య నిల్చొని ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా రేయింబవళ్లు ప్రజల కోసం వస్త్రాలు రూపొందిస్తున్న చేనేతలకు అండగా నిలవాలని, రాబోయే దసరా, దీపావళి పండలకు చేనేత వస్త్రాలు కొనుగోలు చేద్దామని ఆమె పిలువు నివ్వడం సంతోషదగ్గ విషయమన్నారు. చేనేత కార్మికులను ఆదుకోడానికి సీఎం చంద్రబాబు ఇప్పటికే కార్యాచరణ చేపట్టారన్నారు. నేతన్నల అభివృద్ధికి 2014-19లో అమలు చేసిన పథకాలన్నింటినీ మరోసారి అమలు చేయనున్నామని మంత్రి వెల్లడించారు. ఇటీవల నిర్వహించిన చేనేత, జౌళి శాఖ సమీక్షలోనూ సీఎం చంద్రబాబునాయుడు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారన్నారు.

# ఏపీలో వరద సాయం..
# ఇప్పటి వరకు రూ.569 కోట్లు జమ

● క్రియాశీలంగా లేని ఖాతాదారులకు పరిహారం ● సాయం అందించేందుకు కానరాని సిబ్బంది ● అనర్హులకు రూ. 25 వేలు నగదు బ్యాంక్ అకౌంట్లలో జమైనట్లు ఆరోపణలు ● పేర్లు జాబితాలో లేకుంటే ఫిర్యాదు చేయవచ్చన్న ప్రభుత్వం ● సచివాలయాలను ప్రక్షాళన చేయకుంటే బాధితుల పరిస్థితి మరింత ఘోరం




అమరావతి: విజయవాడ సహా ఏపీలో భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రజలకు ఇటీవల పరిహారం విడుదలైంది. ఆస్తి, పంట నష్టం కింద సుమారు 4 లక్షల మందికి రూ.602 కోట్లు విడుదల చేశారు. ఇప్పటి వరకు ప్రజల ఖాతాల్లో రూ.569 కోట్ల సాయం జమ అయింది. క్రియాశీలంగా లేని ఖాతాదారులకు పరిహారం సోమవారం చెల్లించనున్నారు. మరోవైపు వరద సాయంలో భాగస్వాములైన వారితో సీఎం చంద్రబాబు సోమవారం విజయవాడ కలెక్టరేట్‌లో భేటీ కానున్నారు. వారికి ధన్యవాదాలు తెలపనున్నారు. కాగా ఆంధ్రప్రదేశ్‌లో వరద నష్టం అంచనా, వరద సహాయక చర్యల పర్యవేక్షణ కోసం విధివిధానాలను రూపొందించడానికి ప్రభుత్వం నలుగురు మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీని నియమించింది. కేబినెట్ సబ్‌కమిటీ కన్వీనర్‌గా రెవెన్యూ శాఖ ప్రత్యేక సీఎస్‌ను నియమించారు. వరద నష్టం అంచనాలపై విధివిధానాలు రూపొందించి వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సిఫార్సులు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. కాగా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ సంఘంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నారాయణ, వంగలపూడి అనిత, సత్యప్రసాద్ ఉన్నారు.

**పారిశుద్ధ్య పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి..**

మరోవైపు విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణకు ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమించింది. ఐఏఎస్ హరినారాయణన్ స్థానంలో ఐఏఎస్ కన్నబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడ వరదల్లో మునిగిన ఇళ్ల వారందరికీ ఒక్కో ఇంటికి రూ. 25వేలు ఇస్తామని ప్రకటించారు. అయితే అది ప్రచారార్భాటమే కాని బాధితుల్లో చాలా మందికి సాయం అందలేదనిసమాచారం . వార్డు సచివాలయాల వద్ద సిబ్బంది ఉండటం లేదు. వాలంటీర్లు ఫోన్ లు కూడా ఎత్తడం లేదు. ఎక్కడ వున్నారో తెలియడం లేదన్న ఆరోపణలున్నాయి. మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా కొన్న సచివాలయాలు తెరవడం లేదు. ఇదేమిటంటే వారి నుంచి సమాధానం లేదు. ఉన్నతాధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. కొందరు అనర్హులకు రూ. 25లు నగదు బ్యాంక్ అకౌంట్లలో జమైనట్లు బాధితులు వాపోతున్నారు. విజయవాడ రామలింగేశ్వర నగర్ లోని ఆళ్ల చెల్లారావు రోడ్డులో ఉన్న 71వ సచివాలయం శనివారం 11 గంటలకు కూడా తాళం వేసి ఉంది. వారు ఎక్కడికి వెళ్లారో ఎప్పుడు వస్తారో కూడా కనీసం బోర్డు కూడా లేదు. ఫెడరల్ ప్రతినిధి కూడా బాధితుడే కావడంతో సచివాలయం వద్దకు వెళ్లాడు. అక్కడ రోడ్డు గేట్లో ఇద్దరు, లోపల తాళం వేసిన గేటు వద్ద ఇద్దరు బాధితులు కూర్చున్నారు. ఒక్కరొక్కరుగా బాధితులు వస్తున్నారు. సచివాలయం వద్దకు వచ్చిన ఓ యువతి మా పై అంతస్తు వారికి డబ్బులు వేశారు. మా ఇల్లు పూర్తిగా మునిగి పోయింది. మాకు డబ్బులు రాలేదని బాధపడుతూ చెప్పారు. మీపేరేంటని అడిగితే మా పేరెందులెండి అంటూ వెళ్లిపోయారు. సచివాలయం వద్ద బెనిఫిషరీ జాబితా ఉందని, బాధితులై ఉండి పేర్లు జాబితాలో లేకుంటే ఫిర్యాదు చేయవ్చని ప్రభుత్వం చెబుతోంది. సచివాలయం వద్ద బెనిఫిషరీ జాబితానే పెట్టలేదు. అలాంటప్పుడు నా పేరు ఉందో లేదో ఎలా తెలుస్తుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. సచివాలయం చుట్టుపక్కల ఉండే వారి పేర్లు కూడా లబ్ధిదారుల జాబితాలో లేవు. ఇదీ వదర బాధితుల పరిస్థితి. సచివాలయాలను ప్రక్షాళన చేయకుంటే స్థానికులకు న్యాయం జరిగే అవకాశాలు కూడా కనిపించడం లేదు.

## స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం, సీఐఐ భాగస్వామ్యంతో కన్సల్టేటివ్ ఫోరం ఏర్పాటు చేసింది. ఈ మేరకు పరిశ్రమల శాఖ జీవోను విడుదల చేసింది. ఫోరం ఛైర్మన్‌గా మంత్రి నారా లోకేశ్ వ్యవహరించనున్నారు.రెండేళ్ల కాలపరిమితితో ఇది పనిచేయనుంది. పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ప్రభుత్వం, పారిశ్రామికవేత్తల మధ్య అనుసంధానకర్తగా ఈ ఫోరం పనిచేయనుంది. ప్రభుత్వ శాఖలను ఆర్టీజీఎస్ శాఖ సమన్వయం చేయనుంది.

## సిట్ విచారణ ప్రారంభం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీపై లోతైన విచారణ చేస్తామని సిట్ చీఫ్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. తిరుపతి తూర్పు పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసు సిట్‌కు బదిలీ అయిందని చెప్పారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై రెండో రోజు సిట్ విచారణ సాగుతోంది. తిరుపతి పోలీసు అతిథి గృహంలో నేడు మరోసారి సిట్ సభ్యులు భేటీ అయ్యారు. మూడు బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ , నెయ్యి సరఫరా చేసిన ఏఆర్ డెయిరీపై విచారణ చేస్తామని పేర్కొన్నారు. సిట్ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు నిర్వహిస్తున్నారని వివరించారు. కల్తీ నెయ్యికి బాధ్యులైన అందరినీ విచారిస్తామన్నారు. నివేదిక సమర్పించడానికి కాలపరిమితి లేదని తెలిపారు.టి టి డి ప్రొక్యూర్‌మెంట్ జీఎం ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలను సిట్ బృందం పరిశీలిస్తోంది. డీఐజీ గోపీనాథ్ జెట్టీ, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, అదనపు ఎస్పీ వెంకటరావు నేతృత్వంలో దర్యాప్తు చేస్తున్నారు
టి టీ ద్ బోర్డు దగ్గర నుంచి అధికారులు, సిబ్బంది పాత్ర వరకు అన్ని అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు. నేడు ఈవో శ్యామలరావును వారు కలవనున్నారు. ఆయన్ను అడిగి పూర్తి వివరాలు తెలుసుకోనున్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ సభ్యులు పలు ప్రాంతాలకు వెళ్లి విచారణ చేపట్టనున్నారు. దుండిగల్‌లో ఏఆర్ డెయిరీ ఫుడ్స్ సంస్థను పరిశీలించనున్నారు. తమిళనాడుకూ వెళ్లనున్నారు. తిరుమలలో లడ్డూపోటు, విక్రయ కేంద్రాలను మరో బృందం పరిశీలించనుంది. లడ్డూ తయారీ ముడి సరుకులపై ఆరా తీయనున్నారు. తయారీలో పాల్గొంటున్న శ్రీవైష్ణవులను ప్రశ్నించనున్నారు.

# నెయ్యిలో కల్తీ జరిగింది అప్పుడేనా?



● సిట్ విచారణలో సంచలన విషయాలు ● ఏఆర్ డెయిరీని ఎందుకు ఎంపిక చేశారు?
● పలు అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించిన సిట్ అధికారులు

తిరు పతి : తిరుమల లడ్డూ వ్యవహారంపై విచారణను సిట్ వేగవంతం చేసింది. సిట్ అధికారులు మూడు బృందాలుగా విడిపోయి విచారణ చేస్తున్నారు. డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, అడినల్ ఎస్పీ వెంకట్రావు నేతృత్వంలో విచారణ కొనసాగుతోంది. తిరుమలలో లడ్డూ తయారీ నుంచి ప్యాకింగ్ వరకు ఓ బృందం పరిశీలిస్తోంది. లడ్డూ తయారీలో పాల్గొంటున్న శ్రీవైష్ణవులనూ సిట్ ప్రశ్నించనుంది సిట్. మరో బృందం నెయ్యి కొనుగోలు, ఒప్పందాలు, నెయ్యి సరఫరా, టీటీడీ, ఏఆర్ డైయిరీ మధ్య జరిగిన ఒప్పందాలను పరిశీలిస్తోంది. టీటీడీ ప్రొక్యూర్మెంట్ జీఎం మురళీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై కూడా సిట్ విచారణ చేస్తోంది. టీటీడీ బోర్డు అధికారుల నుంచి సిబ్బంది పాత్ర వరకు దర్యాప్తు చేస్తోంది సిట్. తొలుత టీటీడీ ఈఓ శ్యామలరావును కలిసి కల్తీ నెయ్యి వ్యవహారంపై పూర్తి వివరాలు తెలుసుకోనుంది. శనివారం తిరుపతికి వచ్చిన సిట్ బృందం నెయ్యి కొనుగోలు టెండర్లు, సప్లైకి సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించింది. తిరుమలకు ఎప్పుడెప్పుడు ఎన్ని లారీల నెయ్యి వచ్చింది.. ఆ లారీల నంబర్లు తదితర వివరాలను పరిశీలిచింది. రివర్స్ టెండరింగ్ ఎందుకు చేయాల్సి వచ్చింది? ఏ ఏ కంపెనీలు బిడ్ లు దాఖలు చేశాయి? అన్న వివరాలను సిట్ సేకరించింది. ముఖ్యంగా లడ్డూలు తయారు చేసే వారిని సైతం సిట్ ప్రశ్నించనుందని తెలుస్తోంది. నాణ్యతలో తేడాను ఎప్పుడైనా గుర్తించారా? ఆ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారా? ఏఆర్ డెయిరీ నెయ్యి, మిగతా నెయ్యికి మధ్య తేడాను ఏమైనా గమనించారా? అన్న ప్రశ్నలను అడిగి వివరాలను సేకరించనున్నట్లు తెలుస్తోంది.

## నానిపై చీటింగ్ కేసు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మాజీ మంత్రి ఆళ్ల నానిపై ఏలూరు త్రీ-టౌన్ పీఎస్‌లో చీటింగ్ కేసు నమోదైంది. ఎన్నికల ప్రచార సమయంలో నాగమణి అనే ఓ మహిళా నాయకురాలు గాయపడింది. వైద్య ఖర్చులు భరిస్తామని అప్పుడు హామీ ఇచ్చిన ఆయన ఆ తర్వాత పట్టించుకోలేదని ఆమె కోర్టును ఆశ్రయించింది. కోర్టు ఆదేశాలతో నాని సహా ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ఆయన ఇటీవలే పార్టీని వీడారు.

# విభజన కంటే జగన్ వల్ల అధికంగా నష్టం జరిగింది

● మంత్రి నిమ్మల రామానాయుడు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్ర విభజన కంటే జగన్ పాలన వల్ల ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. 2014-19 ఐదేళ్ల వైసీపీ పాలనలో పేదల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. ఇవాళ(ఆదివారం) పశ్చిమగోదావరి జిల్లాలో టిడ్కో ఇళ్లను మంత్రులు నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ...పేదల కల నెరవేరాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రంగులు వేశారు : టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లను పూర్తి చేయకుండా.. వైసీపీ ప్రభుత్వంలో ఆ ఇళ్లకు రంగులు వేశారని విమర్శించారు. ఐదేళ్ల పాటు జగన్ పాలనలో ప్రజా సమస్యలపై ఎన్నో ఉద్యమాలు చేశామని అన్నారు. టిడ్కో ఇళ్లకు పూర్వ వైభవం తీసుకురావడం కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. ఇళ్ల లబ్ధిదారులను బలవంతంగా రుణగ్రస్తులను చేశారని చెప్పారు. పది శాతం పెండింగ్ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అతి త్వరలో ఇళ్లను అందజేస్తామని తెలిపారు. ఒక్క పాలకొల్లులోనే రూ.150 కోట్లు ఇళ్లను తాకట్టుపెట్టి ఆ నిధులను మాజీ సీఎం జగన్ పక్క దారి పట్టించారని విమర్శించారు. ప్రపంచ స్థాయిలో మళ్లీ అమరావతిని తిరిగి నిలబెట్టేందుకు మంత్రి నారాయణ కృషి చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

## 9 లక్షల గృహాలు మంజూరు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ప్రపంచ దేశాల్లోని ఆయిదు ఉత్తమ రాజధానుల్లో అమరావతిని నిలపలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. 2014లో టీడీపీ హయాంలో 9 లక్షల గృహాలు మంజూరు చేశామని... ఇది దేశంలోనే రికార్డు అని తెలిపారు. టిడ్కో గృహాలను నిర్మించిన కాంట్రాక్టర్లకు జగనన్న ప్రభుత్వం డబ్బులు చెల్లించలేదని అన్నారు. ఆ కాంట్రాక్టర్లు ఇప్పుడు బిల్లుల కోసం తిరుగుతున్నారని చెప్పారు. టిడ్కో గృహాల సముదాయంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రోజుకు రెండు లక్షలకు పైగా ఐదు రూపాయలకే అన్న క్యాంటీన్ వద్ద పేదలు భోజనం చేస్తున్నారని చెప్పారు. అన్న క్యాంటీన్లను జగన్ ఎందుకు మూసివేశారో సమాధానం చెప్పాలని అన్నారు. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని.. సీఎం చంద్రబాబు తన చాకచక్యంతో సంక్షేమం, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారని మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు.

# లడ్డూ ప్రసాదం కల్తీని వ్యతిరేకిస్తూ, ఢిల్లీలో తెలుగు విద్యార్థుల నిరసన




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీని వ్యతిరేకిస్తూ ఢిల్లీలో తెలుగు విద్యార్థులు ఆదివారం నిరసన చేపట్టారు. సనాతన ధర్మ విలువల పరిరక్షణకు మద్దతుగా ఆల్ ఇండియా తెలుగు స్టూడెంట్స్ అండ్ యూత్ అసోసియేషన్ పెద్దఎత్తున ర్యాలీ చేపట్టింది. ఢిల్లీ గోల్ మార్కెట్‌లోని టీటీడీ ఆలయం నుంచి ఏపీ భవన్ వరకూ విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. వేల మంది స్టూడెంట్స్ రోడ్లపైకి వచ్చి టీటీడీ ఆలయానికి దిష్టి తీసి కొబ్బరికాయలు కొట్టారు. తెలుగు విద్యార్థుల ర్యాలీ నేపథ్యంలో టీటీడీ ఆలయం, ఏపీ భవన్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు.

**సీబీఐ విచారణ చేయాలి :** లడ్డూ ప్రసాదం కల్తీ అంశంపై సీబీఐతో దర్యాప్తు జరపాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఆలయాల పర్యవేక్షణలో ప్రభుత్వ జోక్యం ఉండరాదని, పీఠాధిపతులు, పండితులకు వాటి నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని కోరారు. ప్రసాదం కల్తీ అంశంపై జోక్యం చేసుకోవాలని ఆల్ ఇండియా తెలుగు స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్ ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి, టీటీడీ మాజీ ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి, మాజీ ఈవో ధర్మారెడ్డిపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని సురేశ్ డిమాండ్ చేశారు. ప్రసాదం కల్తీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**సుప్రీంకోర్టుకు వివాదం :** మరోవైపు తిరుమల లడ్డూ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. లడ్డూ వివాదంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని బీజేపీ నేత సుబ్రహ్మణ్యస్వామి, టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పిటిషన్లు దాఖలు చేశారు. వీరిద్దరూ వేర్వేరుగా పిల్స్ దాఖలు చేశారు. అయితే ఈనెల 30న దీనిపై సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. సోమవారం జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఈ విచారణ జరగనుంది. తిరుమల లడ్డూ వ్యవహారంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలపై విచారణ చేయాలని సుబ్రహ్మణ్యస్వామి విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని సుబ్రహ్మణ్యస్వామి కోరారు. విచారణ కోసం ఒక కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## 'జనసేన' సుదర్శన హోమం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : చిత్తశుద్ధి లేని వారిని టీటీడీ బోర్డు ఛైర్మన్లుగా నియమించడంతోనే కల్తీ లడ్డూ ఘటనలతో అపవి త్రాలు జరుగుతున్నాయని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ మండిపడ్డారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం, జనసేన అదినేత పవనకళ్యాణ్ శ్రీవారి లడ్డూ కల్తీ జరిగిందన్న నేపథ్యంలో చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మ ద్ధతుగా టీసీ వరుణ్ ఆ పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవానీరవికుమార్, రాయలసీమ ప్రాంతీయ మహిళ కన్వీనర్ పెంద్యాల శ్రీలత, నగర అధ్యక్షుడు పొదిలి బాబురావుతో కలిసి శ్రీనివాస నగర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సుదర్శన హోమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. పార్టీ ఆదేశాల మేరకు మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా అద్యక్షులు మురళీకృష్ణ, జిల్లా ప్రధానకార్యదర్శిలు పత్తి చంద్రశేఖర్, కుమ్మర నాగేంద్ర, నాయకులు కిరణ్‌కుమార్, ముప్పూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడిపై చర్యలు

## మైలవరం ఎమ్మెల్యే వసంతకు పార్టీ బాధ్యతలు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : టిడిపి ఎమ్మెల్యే పై సొంత పార్టీ నేతలే రగిలిపోతున్నారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కు వరుస ఫిర్యాదులు అందుతున్నాయి. మాకు ఎమ్మెల్యే వద్దు అంటూ పార్టీ క్యాడర్ రోడ్ ఎక్కుతుంది. వరుస ట్వీట్లతో కొలికపూడి మరింత వేడి రాజేస్తున్నారు. దీంతో, కీలక నిర్ణయం దిశగా చంద్రబాబు అడుగులు వేస్తున్నారు.
పార్టీకి సమస్యగా అనూహ్యంగా ఎమ్మెల్యే సీటు దక్కించుకున్న కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎమ్మెల్యేగా గెలిచిన సమయం నుంచి అన్నింట దూకుడుగా వ్యవహరిస్తున్న కొలికపూడి వ్యవహార శైలి ఇప్పుడు పార్టీకి సమస్యగా మారింది. నియోజకవర్గంలో మట్టి, ఇసుక అమ్ముకుంటున్నారంటూ మీడియాలో కథనాలు వచ్చాయి. వార్తలు రాసిన రిపోర్టర్ ను కొలికపూడి బెదిరింపులకు దిగటం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ విషయం పైన తాజాగా జర్నలిస్టు సంఘాల సైతం ముఖ్యమంత్రిని కలిసి ఫిర్యాదు చేశారు. కొలకపొడి పై చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీకి సమస్యగా అనూహ్యంగా ఎమ్మెల్యే సీటు దక్కించుకున్న కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎమ్మెల్యేగా గెలిచిన సమయం నుంచి అన్నింట దూకుడుగా వ్యవహరిస్తున్న కొలికపూడి వ్యవహార శైలి ఇప్పుడు పార్టీకి సమస్యగా మారింది. నియోజకవర్గంలో మట్టి, ఇసుక అమ్ముకుంటున్నారంటూ మీడియాలో కథనాలు వచ్చాయి. వార్తలు రాసిన రిపోర్టర్ ను కొలికపూడి బెదిరింపులకు దిగటం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ విషయం పైన తాజాగా జర్నలిస్టు సంఘాల సైతం ముఖ్యమంత్రిని కలిసి ఫిర్యాదు చేశారు. కొలకపొడి పై చర్యలు తీసుకోవాలని కోరారు.

అధినాయకత్వం సీరియస్ ఇక నియోజకవర్గంలోని చిట్యాల గ్రామపంచాయతీ సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావు పై ఎమ్మెల్యే కొలికవుడి చేసిన వ్యాఖ్యలకు మనస్థాపానికి గురైన సర్పంచ్ సతీమణి కవిత ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో నియోజకవర్గంలో ఎమ్మెల్యే తీరు పైన పెద్ద ఎత్తున వ్యతిరేకత మొదలైంది. సర్పంచ్ కు చిట్యాలలో పేకాట క్లబ్ కు తానే అనుమతి ఇచ్చానని తనకు డబ్బులు ఇవ్వకుండా ఎలా నిర్వహిస్తారు అంటూ ఎమ్మెల్యే అడ్డం తిరిగినట్లుగా ఫిర్యాదులు ఉన్నాయి. అదేవిధంగా కొలికవుడి వరుసగా చేస్తున్న ట్వీట్లను కూడా పార్టీ అధినాయకత్వం సీరియస్ గా పరిగణిస్తోంది. తుఫాను ముందు ప్రశాంతత ఉందంటూ పార్టీని బ్లాక్మెయిల్ చేసే విధంగానే పోస్టింగ్స్ ఉన్నాయని పార్టీ నేతలు సీరియస్ అవుతున్నారు.
మరొకరికి బాధ్యతలు సొంత పార్టీ నుంచి వ్యతిరేకత వస్తున్న క్రమంలో చంద్రబాబు తిరువూరు ఎమ్మెల్యేను పక్కనపెట్టి మరొకరికి బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్టు తెలుస్తుంది. తిరువూరు బాధ్యతలను మైలవరం ఎమ్మెల్యే వసంతకు అప్పగించారని పార్టీ నేతల సమాచారం. దీంతో సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్న మరో ఎమ్మెల్యేకు నియోజకవర్గ బాధ్యతలు ఇవ్వడం ద్వారా కొలికవూడిని తప్పించాలని చంద్రబాబు నిర్ణయించినట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. అదేవిధంగా ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ఇప్పటివరకు కొలికవూడి వ్యవహార శైలి పైన చంద్రబాబు నివేదిక కోరినట్లు సమాచారం. ఇప్పుడు కొలికవూడి ఏ విధంగా స్పందిస్తారు.. ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయి అనేది ఆసక్తికరంగా మారుతోంది.



## ఇద్దరు పిల్లలతో కాల్వలోకి దూకిన మహిళ



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : విజయవాడలోని స్క్రూ బ్రిడ్జి దగ్గర కాల్వలో ఇద్దరు పిల్లలతో సహా ఒక మహిళ కాల్వలోకి దూకింది. ఆమె ఏం ఆపద, కష్టమొచ్చిందో.. తన ఇద్దరు పిల్లలతో కలిసి కాల్వలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింద. ఈ క్రమంలో అక్కడున్న స్థానికులు గమనించి ఏడాదిన్నర వయసున్న చిన్నారిని బయటకు తీశారు. వెంటనే ఆ చిన్నారిని హాస్పటల్‌కు తరలించేలోపే చనిపోయింది. మరోవైపు.. తల్లి కుమారుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు.. మహిళ, మరో చిన్నారి కోసం కాల్వలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## పంచాయితీరాజ్‌లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతంకు పెంచాలి

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి, వార్డు మెంబర్ల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతం కు పెంచుతామని మేనిఫెస్టో లో తెలిపిన ప్రకారం మాట మీద నిలబడి పెంచాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య ఈ మేరకు లోకసభ ఫ్లోర్ లీడర్ రాహుల్ గాంధీకి లేఖ రాశారు. ప్రభుత్వం వచ్చే అక్టోబర్ నెలాఖరుకు స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు కులగణన చేయాలని నిర్ణయం తీసుకుంది. కులగణన చేసిన తర్వాత దాని ఆధారంగా రిజర్వేషన్లు పెంచాలి. ఇంకా కులగణన ప్రక్రియ ప్రారంభించలేదు. బి.సి సంఘాల ఆధ్వర్యంలో కులగణన చేయాలని 42% కు బి.సి రిజర్వేషన్ పెంచాలని 4 నెలలుగా ఉద్యమాలు చేస్తున్నాం. అయిన ప్రభుత్వం తగు విధంగా స్పందించడం లేదు. రాహుల్ గాంధీ అయిన స్పందించి చర్యలు వేగవంతం చేయాలని కోరాడు. రాష్ట్రంలో అన్నీ పార్టీ రాజకీయ పార్టీలు టిఆర్ఎస్, బిజెపి, సిపిఐ, సిపిఎం పార్టీలు, బి.సి రిజర్వేషన్లపై మద్దతు తెలుపుతారా? లేదా? విధాన ప్రకటన చేయాలని కోరారు. కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని వేగవంతంగా చర్యలు తీసుకోవడం అన్నారు. కాంగ్రెస్ పార్టీలోని బి.సి నేతలు జెండాలు మోసుకుంటూ ఉందాబాదులు కొట్టుకుంటూ బానిసబతుకులు వద్దు. ప్రభుత్వంపై వత్తిడి తేవాలని కోరారు, త్వరలో గ్రామ స్థాయిలో ఉద్యమాన్ని విస్తరింప చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్క బి.సి ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. బి.సి.లు తెగించి పోరాడి సమయం ఆసన్నమైంది. ఒకవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా బహిరంగ సభలలో ప్రతిరోజు కులగణన జరుపుతామని, దాని ప్రకారము విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు పెంచుతామని బడ్జెట్ కేటాయిస్తామని బిసి ఎజెండా ఎత్తుకొని బీసీల అభిమానం చూర గొంటుంటే ఇక్కడ బీసీలకు అన్యాయం చేయడం తగు న్యాయమా అని ప్రశ్నించారు.

# కబ్జాలు నిర్మూలిస్తేనే హైదరాబాద్ సేఫ్

## లేకపోతే విజయవాడ పరిస్థితే వస్తుంది



- పేదోళ్లను అడ్డంపెట్టి..బిల్డర్లు వ్యాపారం చేస్తున్నారు
- అమెరికాలో స్థిరపడిన తెలుగు వారు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి తోడ్పడండి
- అభివృద్ధి, స్వేచ్ఛ ప్రధాన లక్ష్యంగా ముందుకెళతాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపు

హైదరాబాద్: అభివృద్ధి, స్వేచ్ఛ ప్రధాన అంశాలుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సదరన్ కాలిఫోర్నియా తెలుగు కమ్యూనిటీ, స్థానిక కాన్సుల్ జనరల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అమెరికాలో స్థిరపడిన తెలుగు వారి మేధస్సు తెలంగాణతో పాటు, తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఉపయోగపడాలన్నారు. హైదరాబాద్ అంటేనే రాక్స్, లేక్స్, పార్కు... ఇళ్ల నిర్మాణం పేరిట రాళ్లు కనుమరుగైపోయాయి. లేక్స్ కబ్జా చేసి ఇళ్లు కట్టుకున్నారు. పార్కులు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. లేక్స్ లేకపోతే ఇటీవల విజయవాడ నగరం వరదలో చిక్కుకుపోయిన పరిస్థితులు హైదరాబాద్లోనూ ఏర్పడతాయన్నారు.
పేదవాళ్లను అడ్డంపెట్టి బిల్డర్స్ నిర్మాణాలు చేపట్టి వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ధన, ప్రాణ, ఆస్తులు కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, అందులో భాగంగా చెరువులను రక్షించి, భవిష్యత్తు తరాలకు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపటినట్లు చెప్పారు. మూసీ నదిలో మంచినీరు పారించడం, పార్కులు తయారు చేయాలనేది ప్రభుత్వం ఆలోచన అని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వనరులను గుర్తించి పద్ధతి ప్రకారం వాటిని వినియోగిస్తామన్నారు. కాలిఫోర్నియాలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు, సింగరేణి సీఎండీ బలరాం నాయక్, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగుళం భూమి కూడా కబ్జాలకు గురి కానివ్వొద్దు

- సామాన్యులకు మేలు జరిగేలా రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన
- 33 జిల్లాల తహశీల్దార్లతో ముఖాముఖి
- రెవెన్యూ ఉద్యోగులకు ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్: సామాన్యులకు మేలు జరిగేలా రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్పేటలోని నల్సార్ యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన 33 జిల్లాల తహశీల్దార్లతో ముఖాముఖి కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమి అంగుళం కూడా ఆక్రమణకు గురి కాకుండా చూడాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులకు ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తాం. తహశీల్దార్ల బదిలీలపై త్వరలో ఉద్యోగ సంఘాలతో సమీక్షిస్తాం. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు జోడెడ్లలా పనిచేసి ప్రజలకు ఉత్తమ సేవలందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి. ప్రభుత్వంలోని అన్ని శాఖలకంటే రెవెన్యూ శాఖ ప్రత్యేకమైనది. అన్ని సందర్భాల్లో రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక పాత్ర పోషిస్తారు. రాష్ట్రంలో మొత్తం 972 మంది తహశీల్దార్లు ఉన్నారు.. గ్రామ, మండల స్థాయిలో ఉండే సమస్యలు, ప్రత్యక్షంగా పరోక్షంగా మీరు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేశాం. రెవెన్యూ చట్టాల సవరణకు.. క్షేత్రస్థాయిలో ఉండే సమస్యలపై మీరు ఇచ్చే సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుంటాం అని పొంగులేటి తెలిపారు.

# 5వేల మందితో పింక్ పవర్ రన్



- బ్రెస్ట్ క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కోసం
- ఒకేసారి 3కే, 5కే, 10కే రన్
- ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ
- గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం కోసం కార్యక్రమం

హైదరాబాద్: బ్రెస్ట్ క్యాన్సర్పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన పింక్ పవర్ రన్ 2024ను మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. సుధారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన ఈ మారథాన్ను వైద్య ఆరోగ్యం మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఒకేసారి 3కే, 5కే, 10కే రన్ను నిర్వహించారు. పింక్ మారథాన్లో గెలిచినవారికి సీఎం రేవంత్ రెడ్డి మెడల్స్ పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో సుమారు ఐదు వేల మంది పాల్గొన్నారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్లో స్థానం సంపాదించేందుకు ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. క్యాన్సర్ మహమ్మారి విజృంభిస్తున్న విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా బాధితుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది.
ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడి మరణిస్తున్న వారి సంఖ్య నానాటికి అధికమవుతున్నది. క్యాన్సర్పై అవగాహన లేకపోవడం, క్యాన్సర్ను మొదట్లోనే గుర్తించకపోవడం దీనికి కారణమని అని నిపుణులు పేర్కొంటున్నారు. ముందే గుర్తిస్తే సరైన చికిత్సతో మహమ్మారితో పోరాడవచ్చని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బ్రెస్ట్ క్యాన్సర్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పింక్ పవర్ రన్ 2024ను నిర్వహిస్తున్నారు.

## కాంగ్రెస్‌లో చేరేందుకు 10 మంది ఎమ్మెల్యేలు సిద్ధం

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు 10 మంది ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారని, తమ కేసు బూచి చూపెట్టి కాంగ్రెస్లోకి రావలనుకుంటున్న ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ పెద్దలు ఆపుతున్నారని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడారు.
కాస్త ఆలస్యం అయినా మిగతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరిక పక్కాగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డిని అసభ్య పదజాలంతో బీఆర్ఎస్, బీజేపీ నేతలు తిట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గౌరవప్రదంగా ఉండే హరీష్ రావు కూడా గాడి తప్పారని, బీఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతున్నారని, ఇదే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళానని ఎమ్మెల్యే దానం నాగేందర్ చెప్పారు.

# హైడ్రాపై కలెక్టరేట్లలో హెల్ప్ డెస్క్‌లు

- అనుమానాలతో ఆందోళన పడొద్దు
- నిర్వాసితులకు న్యాయం చేసిన తర్వాతే మూసీ నది ప్రక్షాళన చేపడతాం
- మూసీపై బీఆర్ఎస్ పార్టీది మొసలి కన్నీరు
- డబ్బులిచ్చి సీఎంకు వ్యతిరేకంగా మాట్లాడిస్తున్నారు: శ్రీధర్ బాబు

హైదరాబాద్, తెలంగాణ బ్యూరో: హైడ్రా, మూసీ విషయంలో ఎటువంటి అనుమానాలు, అభద్రత భావం పెట్టుకోవద్దని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. చట్టబద్ధంగా, ప్రణాళిక యుతంగా మూసీ, హైడ్రా పైన ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఆదివారం సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. మూసీ నిర్వాసితులు ఆందోళన పడవద్దని నిర్వాసితులకు న్యాయం చేసిన తర్వాతే మూసీ ప్రక్షాళన చేస్తామన్నారు. నిర్వాసితులకు ఇండ్లతో పాటు ఉపాధి కల్పించే బాధ్యత ప్రభుత్వానిదని, ప్రభుత్వ పథకాల్లో మూసీ నిర్వాసితులకు ప్రయార్టీ ఇస్తామన్నారు. మూసీ, హైడ్రా విషయంలో అనుమానాలు ఉంటే అన్ని కలెక్టరేట్లలో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేస్తామన్నారు. అవకాశవాద రాజకీయాల కోసం ప్రతిపక్షాలు చిన్న చిన్న అంశాలతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. నిర్వాసితులందరిని కడుపులో పెట్టుకొని చూస్తామన్నారు. రివర్ బెడ్ గుర్తించే నివాసాలకు కూడా భూసేకరణ చట్టం 2013 ప్రకారం పరిహారం చెల్లిస్తామన్నారు.
బీఆర్ఎస్ మొసలి కన్నీరు: మూసీ విషయంలో బీఆర్ఎస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని మంత్రి విమర్శించారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితుల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో అందరికీ తెలుసన్నారు. మల్లారెడ్డి అనే రైతు చితిపెట్టుకొని ఆహుతయ్యాడని గుర్తు చేశారు. 2013 భూనిర్వాసితుల చట్టాన్ని అమలు చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త జీవో తీసుకువచ్చిందని. మల్లన్న సాగర్ భూనిర్వాసితులు విషయంలో హైకోర్టు అనేక సార్లు మొట్టికాయలు వేసిన సంగతి మరువద్దన్నారు. భూనిర్వాసితులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని మండిపడ్డారు. ప్రజాస్వామ్యయుతంగా మా ప్రభుత్వం వ్యవహరిస్తుంటే గులాబీ నేతలు ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. డబ్బులిచ్చి ముఖ్యమంత్రి, ప్రభుత్వంపై వ్యతిరేకంగా మాట్లాడిస్తున్నారని అరాచక శక్తులను బీఆర్ఎస్ ప్రోత్సహిస్తోందని ఇది రాజకీయం కాదని హెచ్చరించారు. మల్లన్న సాగర్ నిర్వాసితులపైకి, రైతు సోదరులపైకి బుల్డోజర్ లు పంపించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. మా హస్తం ఎప్పుడూ పేదల పక్షానే ఉంటుందన్నారు. మల్లన్న సాగర్ నిర్వాసితుల కోసం మా దామోదర రాజనర్సింహ పోరాటం చేశారన్నారు. మీ పాలనలో రేవంత్ రెడ్డి, భట్టి, ఉత్తమ్ ను మల్లన్న సాగర్ వైపు రానివ్వలేదు. కానీప్రజా పాలనలో ప్రతిపక్షం ఎక్కడికైనా వెళ్లినా అనుమతులు ఇస్తున్నామన్నారు.
బిల్డర్ల చేతిలో మోసపోయిన పేదలు, మధ్యతరగతి వారి నివాసాల విషయంలో ప్రభుత్వం తొందరపడదని శ్రీధర్ బాబు అన్నారు. ఎవరూ ఆందోళన పడవద్దని ఎవరికీ అన్యాయం జరగకూడదని ప్రభుత్వం నమ్ముతోందన్నారు. అడ్డగోలుగా అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించిన మంత్రి.. అపార్ట్ మెంట్ నిర్వాసితులకు ఏ రకంగా న్యాయం చేయాలన్నదానిపై ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నట్లు చెప్పారు. బిల్డర్ల చేతిలో మోసపోయిన వారి విషయంలో మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తామన్నారు. మూసీ ప్రక్షాళన చేస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా చెప్పి చేయకపోగా మా ప్రభుత్వం చేస్తుంటే బీఆర్ఎస్ అడ్డంకులు సృష్టిస్తోందన్నారు. హైడ్రా విషయంలో ఎవరైనా ఒక్కటేనని సీఎం రేవంత్ రెడ్డి సోదరుడికి కూడా నోటీసులు ఇచ్చిందన్నారు. ప్రపంచంలోనే బెస్ట్ సిటీగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేలా



మూసీ ప్రక్షాళన ఉండబోతున్నదని మంత్రి చెప్పారు. ఈస్ట్, వెస్ట్ కారిడార్ల నిర్మాణం, లింకు రోడ్ల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. మూసీపై ఫ్లై ఓవర్లు నిర్మిస్తామని పీపీపీ మోడల్‌లో నిర్మాణాలు ఉంటాయన్నారు. మూసీ మాస్టర్ ప్లాన్ బ్లూ ప్రింట్ తయారు చేశామని పాదర్శకంగా పనులుంటాయని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న సంస్థలనే ఆహ్వానిస్తున్నామన్నారు.

## ఐఎంఏకు స్థలం కేటాయించండి

- విజ్ఞప్తి చేసిన ఐఎంఏ ప్రతినిధులు
- సహకారం అందించాలని కోరిన భగవాన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత పీ.ఎస్.ఆర్.కే భగవాన్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: సమాజంలో సేవలు అందిస్తున్న డాక్టర్లకు సహకారం అందించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ డాక్టర్లు కోరారు. ఇందులో భాగంగా ఆదివారం భగవాన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత పి.ఎస్.ఆర్.కే. భగవాన్ సారాధ్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కూకట్ పల్లి శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి తమ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కూకట్ పల్లి శాఖకు స్థలం కేటాయించాల్సిందిగా కోరారు. ఇందులో భాగంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కూకట్ పల్లి శాఖ అధ్యక్షులు డాక్టర్ గుంటి మధుసూదన్, డాక్టర్ రవికుమార్ డాక్టర్ సంపత్ రావు డాక్టర్ మదన్మోహన్ డాక్టర్ సత్యనారాయణ డాక్టర్ రవి కృష్ణ తదితరులు ఎమ్మెల్యేను కలిసి తమ సంస్థకు స్థలం కేటాయించేందుకు సహకరించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కూకట్ పల్లి శాఖ అధ్యక్షులు డాక్టర్ గుంటి మధుసూదన్ మాట్లాడుతూ సమాజానికి సేవలు అందిస్తున్న డాక్టర్లు వారి సంక్షేమం కోసం స్థలం కేటాయించి భవన నిర్మాణానికి సహకరిస్తే సమాజానికి మరింత సేవలందించడానికి అవకాశం ఉంటుందని కోరారు దీనికి సానుకూలంగా స్పందించిన కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హామీ ఇస్తూ వైద్యం నారాయణ అన్న నినాదానికి కట్టుబడి పనిచేస్తున్న డాక్టర్లకు సహకారం అందించడానికి తాను ప్రభుత్వంతో మాట్లాడి వారికి అవసరమైన స్థలం కేటాయింపుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# ప్రతిజ్ఞ చేయిస్తూ.. మంత్రి సీతక్క భావోద్వేగం



- వృద్ధులు భారం కాదు.. మన బాధ్యత
- తల్లిదండ్రులను కన్నబిడ్డల్లా చూసుకోవాలి
- పసిపిల్లాల్లా చూసుకోవడం మన బాధ్యత : సీతక్క
- వయోవృద్ధుల సంరక్షణ, హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమాలు

హైదరాబాద్, తెలంగాణ బ్యూరో: వయోవృాఎద్ధులు భారం కాదని.. మన బాధ్యత అని.. కన్న బిడ్డలను చూసుకున్నట్లుగానే, కన్న తల్లిదండ్రులను చూసుకోవాలని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అంతర్జాతీయ వయోవృాఎద్ధుల దినోత్సవం సందర్భంగా నెక్లెస్ రోడ్లోని జలవిహార్ పార్క్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం రాష్ట్ర స్థాయి అవగాహన ర్యాలీ నిర్వహించింది. తెలంగాణ వికలాంగులు వయవృాఎద్ధులు ట్రాన్స్ జెండర్లు సాధికారత శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీకి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వృాఎద్ధులు భారం కాదు.. మన బాధ్యత అంటూ ప్లకార్డుతో ర్యాలీని సీతక్క ప్రారంభించారు. వయో వృాఎద్ధుల సంరక్షణ అందరి బాధ్యత అంటూ ప్రతిజ్ఞ చేయించారు.
ఐక్యరాజ్య సమితి పిలువు మేరకు ఏటా అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృాఎద్ధుల దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో వయోవృాఎద్ధుల సంరక్షణ, హక్కులు, చట్టాలపై ఈ నెల 25 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. అందులో భాగంగా జలవిహార్ పార్క్లో చేపట్టిన ర్యాలీని మంత్రి సీతక్క ప్రారంభించి ప్రసంగించారు. వయోవృాఎద్ధుల సంరక్షణను విస్మరించినా, వారి చట్టాలను ఉల్లఘించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి ఇబ్బందులున్నా తమ శాఖను సంప్రదించాలని కోరారు. పిల్లల్ని కనిపించి ప్రయోజకులను చేసిన వయో వృాఎద్ధులు అందరికీ ఆదర్శనీయులన్నారు. వయసు మీద పడిన వారిని వయోవృాఎద్ధులు అనడం కంటే పెద్దలు అని పిలవడమే సమంజసమన్నారు. కన్న పిల్లల యోగక్షేమాలు చూసుకున్నట్టుగానే , కన్న తల్లిదండ్రుల యోగక్షేమాల్ని చూసుకోవాలని కోరారు.
ఒకప్పుడు ఇల్లు చిన్నదైనా మూడు తరాలు ఒకే ఇంట్లో నివసించేవని గుర్తు చేసారు. కానీ ఇప్పుడు పెద్ద భవనాలు, విశాల ఫార్మ్ హౌస్ ల్లోకి నివాసాలు మారినా.. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగువుతున్నాయని తెలిపారు. ఇండ్లు విశాలమవుతూ కుటుంబం చిన్నగవడం సమాజానికి చేటని పేర్కొన్నారు. ఉన్నత ఉద్యోగాలు చేస్తూ కూడా తల్లిదండ్రులను వృాఎద్ధాశ్రమాలలో చేర్పించడం పట్ల మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. కన్న తల్లిదండ్రులను సరిగా చూసుకోనప్పుడు డబ్బుకు, హోదాకు విలువ ఏం ఉంటుందని ప్రశ్నించారు. సొంత పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే తల్లిదండ్రుల బాగోగులను పట్టించుకోవాలని కోరారు. వయసు మీద పడిన పెద్దల్ని చిన్న పిల్లల వలే సాకాల్సి వచ్చినా, వారి సంరక్షణను భాద్యతగా స్వీకరించాలన్నారు. ఆస్తుల కోసం కొందరు కన్న తల్లిదండ్రుల హత్యలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృాఎద్ధాశ్రమాలు ఏర్పాటు చేయడం తమ ప్రభుత్వ విధానం కానప్పటికీ కన్న పిల్లలు గాలికి వదిలేస్తున్న వయోవృాఎద్ధుల సంరక్షణ, సంక్షేమం కోసం గత్యంతరం లేని పరిస్థితుల్లో ఓల్డ్ ఏజ్ హోమ్ లను పెంచాల్సి వస్తుందని చెప్పారు.
పిల్లలు వదిలేసిన వయోవృాఎద్ధులను తమ ప్రజా ప్రభుత్వం అక్కున చేర్చుకుంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి జిల్లాలో ఓల్డ్ ఏజ్ హోమ్ లతో పాటు డే కేర్ సెంటర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. వయవృాఎద్ధుల సంరక్షణ కోసం 2007లో నాటి యూపీఏ ప్రభుత్వం వయోవృాఎద్ధుల పోషణ, సంరక్షణ చట్టాన్ని తీసుకొచ్చిందని గుర్తు చేసారు. ఆ చట్టాన్ని ఉల్లఘింస్తే శిక్షలు తప్పవని మంత్రి సీతక్క హెచ్చరించారు. ఆస్తులు అంతస్తులు కాదు, పెద్దలపై ఆప్యాయత అనురాగాలు ముఖ్యమన్న సీతక్క, వయోవృాఎద్ధుల ఆలోచనలు, ఆనుభవాల ఆదారంగా వారి సంరక్షణ కోసం మరిన్ని పథకాలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు. వయోవృాఎద్దులు ఆరోగ్యంగా ఆనందంగా ఉండే విధంగా రేవంత్ రెడ్డి నేతృాఎత్వంలోని ప్రజా ప్రభుత్వం, తమ సాధికారత శాఖ ఎల్లప్పుడు తోడుగా ఉంటుందని మంత్రి సీతక్క భరోసా కల్పించారు. వికలాంగులు, వయవృాఎద్ధులు, ట్రాన్స్ జెండర్ల సాధికారత శాఖ చేపట్టిన అవగాహన ర్యాలీలో ఆ శాఖ డైరెక్టర్ శైలజా, వికలాంగుల కార్పోరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య తో పాటు పెద్ద సంఖ్యలో సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

## హైదరాబాద్ మెట్రో రెండో దశకు తుది మెరుగులు

- ఎయిర్‌పోర్ట్ అన్‌లైన్‌మెంట్‌లో మార్పు
- ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో.. కారిడార్లు, రూట్స్

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ డీపీఆర్‌కు రాష్ట్ర ప్రభుత్వం తుది మెరుగులు దిద్దుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవలే మెట్రో రైలు రెండో దశ డీపీఆర్లపై సమీక్షించారు. మెట్రో రెండో దశలో మొత్తం దాదావు 116.2 కి.మీ నిర్మాణం జరగనుంది. రూ. 32,237 కోట్ల అంచనా వ్యయంతో మెట్రో రైలు రెండో దశ చేపట్టనున్నారు. హైదరాబాద్ మెట్రో రెండో దశలో భాగంగా కొత్తగా ఏర్పాటు కానున్న ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో రైలు అందుబాటులోకి తీసుకురానున్నట్టుగా మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఎయిర్పోర్టు నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు 40 కి.మీ. మేర మెట్రో మార్గాన్ని నిర్మించనున్నామని చెప్పారు.
ఆదివారం రోజున హైదరాబాద్ మెట్రో రెండో దశ కారిడార్ల అలైన్ మెంట్, రాబోయేస్టేషన్లు తదితర అంశాలపై ఎన్వీఎస్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు. అన్ని కారిడార్లకు సంబంధించిన డీపీఆర్లకు తుది మెరుగులు దిద్దుతున్నట్లు తెలిపారు.
అయితే ఎయిర్పోర్టు మెట్రో అలైన్మెంట్లో మార్పులు చేశారు. ఆరాంఘర్, కొత్త హైకోర్టు మీదుగా ఎయిర్పోర్టుకు మెట్రో రైలు రూట్ ఖరారు చేశారు. ఇది కారిడార్ -4 (నాగోల్ -శంషాబాద్)లో భాగంగా ఉంది.
హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశలో మూడు కారిడార్లలో మొత్తం 69 కి.మీ నిర్మాణం చేయడం జరిగింది. కారిడార్ 1 (రెడ్ లైన్) మియాపూర్ నుంచి ఎల్బీ నగర్ వరకు 29 కి.మీ.. కారిడార్ 3 (బ్లూ లైన్) నాగోల్ నుంచి రాయదుర్గ్ వరకు 29 కి.మీ.. కారిడార్ 2 (గ్రీన్ లైన్) జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు 11 కి.మీ మెట్రో రైలు పరుగులు తీస్తుంది అని ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. గ్రీన్ లైన్ను తదుపరి ఫలక్నుమా వరకు, అక్కడి నుంచి చాంద్రాయణగుట్ట వరకు మొత్తంగా 7.5 కి.మీ నిర్మించి.. కొత్త ఎయిర్పోర్టు లైన్కు అనుసంధానించనున్నట్టుగా చెప్పారు.
ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో మూడు కారిడార్లలో 69 కి.మీ మేర మెట్రో సేవలు అందిస్తుండగా.. రెండో దశ పూర్తతే 9 కారిడార్లలో 185 కి.మీ మెట్రోమార్గం అందుబాటులోకి వస్తుంది.

'సూర్య' సాహిత్య సాంస్కృతిక వేదిక
# అక్షరం
4 సోమవారం 30 సెప్టెంబర్ 2024
suryaeditpage@gmail.com

## నవ్వుల పువ్వులు పూస్తాయి



పలికే చిలుకలు
మౌనం పాటిస్తే
తీగన ఉండే మల్లెలు
తీయని శబ్దాలు చేస్తే!
సెలయేరులోని నీరు
జల జల పారే
జల పుష్పాలయితే
అన్నీ పూల వర్షాలే!
మాటలు మూగపోయి
మౌనం భాషిస్తే
కొండల్లోని బండలకు
గుండెలు మొలుస్తాయి

కోనలోని కొమ్మలు
కొమ్మలపై కోయిలలు
కమ్మని రాగాలు తీస్తే
ఆమని ఏమని
అడుగుతుంది!

మొగ్గలు సిగ్గులు వొదిలి
నవ్వుల పువ్వులు పూస్తాయి!

**జగ్గయ్య.జి**
**9849525802**

## సంసార బండి



సంసార బండి సాగడానికి..
కావాలి జోడెడ్ల ఆలుమగలు !
సంతోషంగా సాగే తా(కా)రు రోడ్లు
సంసార చిటపటల కంకర బాట
కష్టనష్టాల గుంతల మట్టి దారి
మార్గం ఏదైనా జోడెడ్లు ఒడుపుగా..
బండిని లాగి తీరం చేర్చాల్సిందే !
సంసార బండి చక్రాలకు..
అవసర కందెనలు అద్దుతూ..
కుదుపుల్లేని సాఫీ ప్రయాణం
సంతోష పాటలు పాడుతూ..
అలసటను ఆమెడ దూరం..
తరుముతూ జోడెడ్ల బండి సాగాలె !
చప్పట్లకు జంట చేతులు
కాలి నడకకు రెండు కాళ్లు
రోజుకు చీకటి వెలుతురు ఉన్నట్లే..
భవసాగరం ఈదడానికి కావాలి..
మేడ్ ఫర్ ఈచ్ అదర్ కపుల్ !

**మధుపాళీ**
**9949700037**

## వృద్ధాప్యం శాపం కా(రా)దు..!



చతుర్విధ దశల జీవన రూపకంలో
వృద్ధాప్యం ఆఖరి ప్రకరణం
బాల్యం, కౌమారం, యవ్వనాలు
ఇష్టంగా ఇట్టే గడిచిపోయే మనిషికి
జీవితపు మలిసంజె మాత్రం
అయిష్టంగా, భారంగా
భయం భయంగా
దిగులు దిగులుగా గడుస్తుంది!
వృద్ధాప్యం అసహజమేమీ కాదు..
ప్రతివ్యక్తీ తప్పనిసరిగా చేరుకునే
జీవితపు చివరి మజిలీ!
వార్ధక్యం శేష జీవితం కాదు..
అశేష అనుభూతుల నిధి!
వృద్ధుడు నిరర్థక వ్యక్తి కాదు..
కుటుంబానికి మార్గదర్శియైన పెద్దదిక్కు!
వృద్ధుడు ఆషామాషీ మనిషి కాదు..
అవస్థలన్నింటినీ అనుభవించి
కాచివడబోసిన అనుభవాల సారాన్ని
భావి తరాలకు అందించే
వారసత్వ విలువల ప్రదాత!
అయితే..
ఎందరికో దారిచూపిన పెద్దరికానికి
నేడు అడుగడుగునా భయాల గాయాలే..!
క్షణక్షణం దిగులు మేఘాలే..!
వేధించే శారీరక రుగ్మతలు
వెంటాడే మానసికాందోళనలు
అయినవాళ్ళ నిరాదరణలు, ఈసడింపులు
ముదిమి బతుకులకు శాపాలై
నలుగుతూ మూలుగుతుంది వృద్ధాప్యం..!
సుదీర్ఘ జీవన యానంలో
బరువు బాధ్యతలు మోసీ మోసీ
కడగండ్ల సంద్రాన్ని ఈదీ ఈదీ
మనసూ దేహమూ అలసిసొలసి
కాలాన్ని భారంగా కొలుస్తూ
మలి సంధ్యా సమయాన
కుంగిపోతున్న పండుటాకులు
కోలుకొని కుదుటపడటానికి
బిడ్డలు కావాలి ఊతకర్రలు
అందించాలి ఆత్మీయతానురాగాలు
తల్లిదండ్రుల సంరక్షణ బరువుగా కాకుండా
బాధ్యతగా, విధిగా భావించి అందించే
పిల్లల ఆలంబన, సాంత్వనలే
వివర్ణమౌతున్న మలి వెలుగులకు
ఉద్దీపనాలై సరికొత్త కాంతినందిస్తాయి!
వృద్ధాప్యం శాపం కాదు
ఈ చరాచర జగత్తులో
సకల జీవరాశులూ అనుభవించే
సృష్టిధర్మం అది...!

**పి.వి.ప్రసాద్**
**9440176824**

## సీతారాం ఏచూరి నాయకత్వం



మన దేశ సమగ్రతను
రక్షించాల్సిన అవసరముందని
చాటిచెప్పే సామర్థ్యం
స్నేహపూర్వక వ్యక్తిత్వం
ఆకర్షణీయమైన తేజస్సు
హేతుబద్ధమైన నాయకత్వం
భారతీయ గుర్తింపు యొక్క సమ్మిళిత,
సమకాలీన స్వభావాన్ని
సమయోచితంగా
బహుళ సాంస్కృతికంగా
అరుదైన రీతిలో చెప్పే తీరు
సంభాషణలలో మృదుత్వం
జాతీయ ఐక్యత
కాంక్షించే రాజనీతిజ్ఞత
వీటన్నింటి కలయిక
మన ప్రియతమ
సీతారాం ఏచూరి

**-మండా వెంకట అప్పారావు**
**9347589272**

## జీవితం నిజానికి ఒక పుస్తకం అయితే



జీవితం నిజానికి ఒక పుస్తకం అయితే
ఎంత బాగుంటుంది
ముందు జరగబోయేది
చదవగలిగితే ఎంత బాగుంటుంది
ఏమి సాధించగలను
మనసు ఏమి కోల్పోబోతోంది
తెలుసుకోగలిగితే ఎంత బాగుంటుంది
జీవితం నిజానికి ఒక పుస్తకం అయితే
కొన్ని పేజీలు చించిపారవేస్తాను
అవి నాకు దుఃఖం భాధ కనీళ్ల మిగిలించాయి
జీవితం నిజానికి ఒక పుస్తకం అయితే
కొన్ని పేజీలు అతికిస్తాను
అవి నాకు సంతోషాన్ని చిరునవ్వు కలిగించాయి
జీవితం నిజానికి ఒక పుస్తకం అయితే
ఏమి పొందగలిగాను
ఏమి పోగొట్టుకున్నాను
ఒక అంచనా ఉండేది

జీవితం నిజానికి ఒక పుస్తకం అయితే
నేను కాలం కళ్లు దొంగిలించి
వెనుకకు పరుగెడతా
కూలిపోయిన స్వప్న సౌధాలను
తిరిగి కట్టుకుంటా
తెగిపోయిన బంధాలు
తిరిగి అతికించుకుంటా
కొన్ని క్షణాలు ఆనందంగా గడిపేస్తా
జీవితం నిజానికి ఒక పుస్తకం అయితే......
ఎంత బాగుంటుంది

**అరుణ డేనియల్**
**9000606889**

# పాండవుల స్వర్గారోహణ, పరీక్షిత్తు పాలన



**వనం జ్వాలా నరసింహారావు**
**80081 37012**

## శ్రీ మహాభాగవత కథ-4

**కం. చదివెడిది భాగవతమిది,**
**చదివించును కృష్ణు, దమృతఝరి పోతనయున్**
**చదివినను ముక్తి కలుగును,**
**చదివెద నిర్విఘ్నరీతి 'జ్వాలా' మతినై**

ఒకనాడు ధర్మరాజు భీముడితో ఇలా అన్నాడు: "కాలం పోకడ చాలా వింతగా ఉన్నది. శ్రీకృష్ణుడిని చూడడానికి అర్జునుడు వెళ్లి ఏడు నెలలు దాటింది. ఇంకా తిరిగి రాలేదు. మురారి క్షేమంగా ఉన్నదీ, లేనిదీ అర్థం కావడం లేదు. నా మనస్సు విచారంగా ఉన్నది. దుశ్శకునాలు కనపడుతున్నాయి. మాధవుడు అవతారాన్ని ఉపసంహరించుకుందామని అనుకుంటున్నాడేమో? శ్రీకృష్ణుడి వృత్తాంతం తెలియడం లేదు" అని ధర్మరాజు భీముడితో విచారించసాగాడు.

అదే సమయంలో అర్జునుడు దుఃఖ భారంతో యాదవపురి నుండి తిరిగి వచ్చాడు. తన పాదాలమీద వాలిపోయిన తమ్ముడు అర్జునిడిని చూసి ధర్మరాజు, యాదవపురిలో అంతా క్షేమమే కదా అని పేరు పేరున అందరి గురించి అడిగాడు. ముఖ్యంగా శ్రీకృష్ణుడిని గురించి మరీ-మరీ అడిగాడు. ఇలా అడిగిన అన్న గారితో అర్జునుడు, గద్గత స్వరంతో, శ్రీకృష్ణుడు అందర్నీ విడిచి పెట్టి వెళ్లిపోయిన విషయం బయట పెట్టాడు. వివిధ సందర్భాలలో ఆ మహానుభావుడు శ్రీకృష్ణుడు తమకు చేసిన సహాయాన్ని గుర్తు చేసుకుంటూ ఆ మాటలు బాధాకరంగా చెప్పాడు అర్జునుడు.

నిండు సభలో ద్రౌపదిని ఆదుకున్న సందర్భం, దుర్వాసుడి కోపాగ్ని నుండి తమను కాపాడిన సందర్భాన్ని, పాశుపతాస్త్రాన్ని ఆయన దయతో పొందిన సందర్భాన్నీ, గోగ్రహణ విజయ సందర్భాన్నీ, కురుక్షేత్రంలో తనకు సారథిగా ప్రోత్సహించిన సందర్భాన్నీ, తనను యుద్ధంలో భీష్మ, కృపాచార్య, అశ్వత్థామ, కర్ణ, ద్రోణ మహావీరుల నుండి కాపాడిన సందర్భాలనూ, సైంధవ వధనాడు అండగా ఉండడాన్నీ అన్నగారితో పంచుకున్నాడు అర్జునుడు. శ్రీకృష్ణుడు శరీరాన్ని విడిచిన తరువాత, ఆయన పదహారువేల మంది శుద్ధాంత స్త్రీలను తీసుకొస్తున్నప్పుడు బోయలు చుట్టుముట్టి అల్లరి చేస్తుంటే, చక్రిలేని కారణంగా తాను ప్రయోగించిన అస్త్రాలు వ్యర్థమైపోయిన సంగతి కూడా ధర్మరాజుకు చెప్పాడు. హరి వచనాలను తలచుకుంటూ, తన మనస్సు పరమేశ్వరుడి మీదనే ఉన్నాడని చెప్పి మౌనంగా ఉండి పోయాడు అర్జునుడు.



ధర్మరాజు భగవంతుడైన శ్రీకృష్ణుడు వెళ్లిన మార్గాన్ని తెలుసుకుని, యాదవులు నాశనమైన విషయాన్ని కూడా విని, నిశ్చలమైన చిత్తంతో లోకాన్ని విడిచి పెట్టడానికి సిద్ధపడ్డాడు. మాధవుడి స్వర్గారోహణం విన్న కుంతీదేవి భక్తితో ఈ లోకాన్ని విడిచి పెట్టింది. ఏ రోజునైతే శ్రీకృష్ణుడు ఈ భూమ్మీద తన శరీరాన్ని విడిచి పెట్టేశాడో ఆ రోజు నుండి అశుభమైన కలియుగం ప్రారంభమైంది. ధర్మరాజు హస్తినాపురంలో మనుమడైన పరీక్షిత్తును రాజుగా దీవించి అభిషేకం చేశాడు. అనిరుద్ధుడి కుమారుడైన వ్రజుడిని మధురకు రాజుగా పట్టం కట్టాడు.

ఆ తరువాత ధర్మరాజు వైరాగ్య మార్గాన్ని ఆశ్రయించాడు. ప్రాజాపత్యం అనే ఇష్టిని చేసి, అన్ని బంధాలను తెగతెంపులు చేసుకున్నాడు. నార చీరెలు ధరించి, మౌనిగా, నిరాహారుడై, దేనిమీదా ఆసక్తిలేకుండా, ఉత్తర దిక్కుగా ప్రయాణం సాగించాడు. ఆయన తమ్ములు అర్జున, భీమసేనాదులు ఆయన్ను అనుసరించారు. నారాయణ స్థానానికి చేరుకున్నారు. తదనంతరం, విదురుడు శరీరాన్ని విడిచి పెట్టాడు. ద్రౌపదీ దేవి కూడా వాసుదేవుడి మీద మనస్సు నిలిపి ఆ లోకాన్ని చేరుకుంది.

పట్టాభిషిక్తుడైన పరీక్షిత్తు సమస్త విద్యలను నేర్చుకున్నాడు. మహాభాగవత శేఖరుడై రాజ్య పాలన చేస్తూ, ఉత్తరుడి కూతురు ఇరావతిని పెళ్లి చేసుకుని జనమేజయుడుతో సహా నలుగురు కుమారులను కన్నాడు. మూడు అశ్వమేధ యాగాలను చేశాడు. కలిని శిక్షించాడు.

ఆ వివరాల్లోకి పోతే: పరీక్షిన్మహారాజు తన రక్షణలో ఉన్న కురుజాంగల దేశంలోకి కలి ప్రవేశించాడని విన్నాడు. యుద్ధం చేయాలన్న సంకల్పంతో ద్విగ్విజయ యాత్రకు బయల్దేరి తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణంలో ఉన్న కురుభూములను జయించాడు. ఈ నేపథ్యంలో, ఒకనాడు, వృషభ రూపాన్ని ధరించి ఒంటికాలితో సంచరిస్తున్న ధర్మదేవుడు, తన సమీపంలో ఆవు రూపంలో కన్నీరు కారుస్తూ ఉన్న భూదేవితో ఎందుకు అలా ఉన్నావని అడిగాడు. ఆమెకు వచ్చిన ఆపద ఏమిటని ప్రశ్నించాడు. జవాబుగా భూదేవి, 'ఈ లోకంలో పూర్వం నాలుగు పాదాలతో నడిచే నువ్వు ఈనాడు శ్రీవల్లభుడు లేని కారణంగా ఒంటికాలి మీద నడుస్తున్నావు కదా! అలాగే, చక్రి అవతారం చాలించగానే పాప సమూహంతో నిండిన జనాలను చూసి నేను దుఃఖిస్తున్నాను. దేవతలకు, ఋషులకు, పితృదేవతలకు, నాకు, నీకు, ధీరులకు, నానా వర్ణాశ్రమాల వారికి, గోవులకు బాధలు కలుగుతున్నందు వల్ల నేను దుఃఖిస్తున్నాను' అన్నది. ఇలా వారిద్దరూ తూర్పు దిక్కుగా ప్రవహించే సరస్వతీ నదీతీరంలో వృషభ, గోవు రూపాలలో మాట్లాడుకుంటున్నప్పుడు అక్కడికి పరీక్షిత్తు వెళ్లాడు.

అప్పుడు ఆ వృషభాన్ని, రాజు వేషంలో ఉన్న ఒక క్రూరుడు, రాక్షసుడులాగా నేలమీద పడేట్లు తన్నాడు. అది అప్పుడు మూత్ర విసర్జన చేస్తూ నేలమీద పడిపోయింది. ఆ తరువాత పరమ పవిత్రమైన గోవును కూడా బలంగా తన్నాడు. ఇలా ఆ రెంటినీ దుర్మార్గంగా తన్నుతున్న రాజలక్షణాలతో ఉన్న పురుషుడిని చూశాడు. వెంటనే తన కోదండాన్ని ఎక్కు పెట్టాడు. వాడిని దండిస్తానన్నాడు. తన బాణంతో వాడిని చంపుతానని వృషభంతో, గోవుతో అన్నాడు. అలా భూదేవిని, ధర్మదేవతను బుజ్జగించి పరీక్షిత్తు తన ఖడ్గంతో 'కలి' ని రూపుమాపాలని ప్రయత్నించాడు. అప్పుడు వాడు తన రాజవేశాన్ని విడిచి వాడిపోయిన ముఖంతో భయపడి, పరీక్షిత్తు పాదాలమీద పడ్డాడు. శరణు వేడాడు. తనను చంపవద్దని ప్రాధేయపడ్డాడు.

పరీక్షిత్తు అప్పుడు వాడిని మందలించి, తన దుర్జన భావాన్ని విడిచిపెట్టి వెళ్లమని చెప్పాడు. పాపులకు బంధువైన వాడు తాను పాలిస్తున్న భూమ్మీద నిలవడానికి వీల్లేదన్నాడు. ఇక్కడ ఉండవద్దు అన్నాడు. తాను ఎక్కడికి పోవాలో చెప్పమని అడిగాడు కలి. జవాబుగా రాజు, ప్రాణివధ, స్త్రీ, జూదం, మద్యపానం అనే నాలుగు స్థానాలను ఇచ్చాడు కలికి. అవి తనకు సరిపోవని చెప్పేసరికి, సువర్ణం మూలంగా కలిగే అసత్యం, మదం, కామం, హింస, వైరం అనే అయిదు ప్రదేశాలను ఇచ్చాడు. మిగతా ప్రదేశాలను స్పృశించకూడదు అని గట్టిగా చెప్పాడు. ఇలా కలిని నిగ్రహించి, వృషభ మూర్తి అయిన ధర్మదేవుడికి ఆయన పోగొట్టుకున్న తపస్సు, శుచిత్వం, దయ అనే మూడు పాదాలను ఇచ్చాడు. అప్పుడు భూదేవి అపరిమితమైన ఆనందాన్ని పొందింది.

ఆ తరువాత పరీక్షిత్తు హస్తినాపురంలో కౌరవ సామ్రాజ్య లక్ష్మిని పాలించాడు.

శ్రీహరి నిర్యాణం అనంతరం భూలోకం అంతా వ్యాపించిన కలి, పరీక్షిత్తు కాలంలో మాత్రం అణిగి, మణగి ఉన్నాడు. అలా కలిప్రభావం తన రాజ్యంలో లేకుండా చేసినప్పటికీ, కలిని మాత్రం ప్రాణాలతో విడిచి పెట్టాడు.

**(బమ్మెర పోతన శ్రీమహాభాగవతం, రామకృష్ణ మఠం ప్రచురణ ఆధారంగా)**

# "కడలి" కథా సంకలనం సమీక్ష



కడలి తెలుగు సాహితీవనం కథల సంకలనం, సంపాదకులు శాంతి కృష్ణ గారు. 25 కథలు 25 మంది రచయితలతో తెలుగు సాహితీవనం ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత శ్రీ యండమూరి వీరేంద్రనాథ్ గారి చేతుల మీదుగా జూలై 28వ తేదీన హైదరాబాద్, రవీంద్రభారతి వేదికగా ఆవిష్కరింపబడినది. ఈ కథల సంకలనంలో ప్రముఖ కథకులు చక్కటి కథలను అందించడం విశేషం అన్ని కథలు కూడావైవిధ్యభరితమైనవి. భిన్నఅంశాలతో పాఠకుల హృదయాలకు చేరువైనది. ప్రముఖ కథా రచయిత సాహిత్య విమర్శకులు శ్రీ ఆడెపు లక్ష్మీపతి గారు "కమనీయ కథా కెరటాలు కడలి" అంటూ పేర్కొంటూ ప్రశంసిస్తూ ముందు మాటను అందించారు.

తెలుగు సాహితీ వనం వ్యవస్థాపకులు, సంపాదకులు శ్రీమతి శాంతి కృష్ణ తన సంపాదక పుట యందు జీవితానుభావాల కూడలి అంటూ, కడలి గురించి తన అభిప్రాయము వ్యక్తపరిచారు. అంతరంగంలో ఆవిష్కరింపబడిన భావాలను కూర్చి, వాస్తవాలను అనుభవాలను ఆచరణలో ఒకచోట పేర్చి మనోతరంగంలో ఆటుపోటులను ఎదుర్కొంటూ, పుట్టుకొచ్చిన కెరటాలు ఈ కడలిలో ఎన్నో, అనంతమై సామాజికపరమైన అనేక వ్యక్తిత్వాలు సమాహా సమ్మిళితం. సాగర గర్భం సమస్త జీవరాసులకు నిలయమైనట్లు ముత్యపు చిప్పలు కొలువైనట్లు, రంగురాళ్లు మదిని దోచినట్లు, ఈ కడలి కథా సంకలనం కూడా అద్భుతమై ఆహ్లాదపరుస్తూ పాఠకులను చదివింప చేస్తుంది. ఈ సంకలనంలో చక్కటి సందేశాత్మక కథలు ఎన్నో ఉన్నాయి. అందులో కొన్నిటిని మనం చూద్దాం...

సీనియర్ జర్నలిస్ట్ సత్యాజీ కథ "ఆనందమే జీవితం". వివిధ కారణాల వలన దాంపత్యంలో ఆనందం లేక నిరాశలో ఉన్న ఒక సంపన్నుడు బహుశా ఆత్మహత్య చేసుకోవాలనే తలంపుతో నది ఒడ్డుకు వస్తాడు. జోరుగా కురుస్తున్న వర్షంలో ఆ ప్రాంతంలో తాను చూసిన కొన్ని జీవిత అనుభవాలు అతని ఆలోచనలను మార్చి వేస్తాయి. డబ్బు లేకపోయినా భార్య భర్తల మధ్య ఉండవలసింది ప్రేమ అనురాగం గురించి అతను తెలుసుకుంటాడు. జీవిత సత్యాల స్ఫూర్తితో మారిన మనసుతో ఇంటికి చేరుకుంటాడు. కథనం ఆసక్తికరంగా సాగుతుంది.

"ఇప్పటికైనా మారాలి" జీ.వి శ్రీనివాస్ గారి రచన ఈ కథ. ఇందులో విద్యార్థులు ఉద్యోగాలంటూ రోడ్డున పడకుండా, వ్యవసాయంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది అంటూ తెలియచేయడం ప్రధానం. ఈ దేశానికి అవసరం కూడా... ప్రజల్లో వ్యవసాయం పట్ల అవగాహన కలుగ చేసి దేశం అన్నపూర్ణగా మార్చాలని రచయిత తన అమూల్యమైన సందేశాన్ని అందించారు.

ఆధ్యాత్మికతల సంక్లిష్ట మేళవింపు అనిపించే, కొండమీది నక్షత్రాలను ప్రముఖ కవి "యండమూరి వీరేంద్రనాథ్" గారు రచించారు. ఇందులో ఒక కుటుంబంలో విభిన్న మనస్తత్వాల మధ్య సాగిన చమత్కార సంభాషణ, ఆధ్యాత్మిక పట్ల అవగాహన, జీవితంలో స్నేహం ఆరాధన మొదలైన సంబంధాల గురించి చక్కగా వివరించారు.

అంతేకాక అమూల్యమైన సందేశాత్మక వాక్యాలు ఎన్నో ఈ కథలో రచింపబడ్డాయి. అందులో భగవంతుడు నీకు డబ్బు కాస్త ఎక్కువ ఇచ్చాడంటే వాటిని నీ సహచరులకు పంచమని, జ్ఞానమిచ్చాడంటే కాస్త ఆలోచించమని ఇన్ని విధాలుగా భగవంతునికి స్నేహితుడిగా ఆరాధకుడిగా సఖుడిగా వాత్సల్యముతో ఉంటాడు అనే అద్భుతమైన విషయాలను లిఖించారు.

కొండ మీద లక్ష దీపాలు వెలుగుతున్నాయి అలాగే అంధకారం అలుముకున్న చీకటి కళ్ళకు వెలుగును తీసుకు రావడంను నక్షత్రాలతో పోల్చడంతో ఆనందంగా కథ ముగుస్తుంది. ఈ కథ చక్కటి పదాల కూర్పుతో పాఠకులను అలరిస్తుంది. ఇంకా మరొక ప్రముఖ కవి అంపశయ్య నవీన్ గారు "వ్యామోహం" అనే కథను రచించారు. ఇందులో ప్రేమకు అర్థం తెలియక పిచ్చి వ్యామోహంలో పడి తప్పుడు దోవలో వెళ్తున్న నేటి యువతలోని వ్యామోహాన్ని కథలో చూపించడం జరిగింది. సమాజంలో జరుగుతున్న విషయాలను చక్కగా వివరించారు.

"లెఫిబో" ప్రముఖ కథా రచయిత సలీమ్ గారు రచించారు . సైన్స్ ఫిక్షన్ కు సంబంధించిన కథ ఇది. రాబోవు తరం లో ఏవిధంగా అమ్మాయిల రూపంలో రోబోలు ప్రపంచం లో, అవసరమై మానవ అవసరాలు తీరుస్తాయో వాటి మెదడు మనిషిలా ఎలా మారుతుంది, ఎలా ఆలోచిస్తుంది అని. ఎప్పటికీ వాటికి మానసిక భావోద్వేగాలు మచ్చుకైనా కనిపించవు అని. తమదనే సాంకేతిక గుర్తింపు మాత్రమే ఉంటాయని ఈ కథ ముందుచూపుతో రచయిత రాసారు.

కుటుంబ బంధాల నేపథ్యంలో తెలంగాణ మాండలికంలో వాస్తవ దృశ్యాలకు ప్రతీకగా"గుట్టు" అనే కథ మనకు చాలా విషయాలు తెలుపుతుంది. వివాహ కార్యక్రమంలో రక్తసంబంధీకుల మధ్య వచ్చిన ఆస్తి తగాదాలు అక్క తమ్ముళ్ల మధ్య ఏ విధంగా గొడవలకు దారి తీశాయి అనేది ఈ కథలో చూస్తాము. "గుట్టు" కథను చక్కటి శైలితో ఆసక్తిగా లిఖించారు ప్రముఖ కవి డా. ఏనుగు నరసింహారెడ్డి. ఈ కథ నేడు రక్త సంబంధాలు డబ్బు కోసం ఏ విధంగా దూరమవుతాయో పాఠకులకు వివరిస్తుంది.

"మనసుతో రాయబారం" కథను శాంతి కృష్ణ రచించారు. ఈ కథలో చక్కటి కవిత్వాన్ని పోలిన భావుకత్వపు శైలి మనల్ని అలరిస్తుంది.

ఈ ప్రేమ కథలో అనుకోని పరిస్థితుల్లో పరిచయం అయిన ఒక జంట ఒకరినొకరు చూసుకోకపోయినా మొబైల్ ద్వారా పరిచయం తో ఎంతో ప్రేమను పెంచుకోవడం, చివరికి అనుకోని అవాంతరాలతో విడిపోవడం. తిరిగి పది సంవత్సరాల తర్వాత అతను ఆమెను వెతుక్కుంటూ రావడం తో కథానాయిక ఆలోచనలను పాఠకులకు వదిలేయడంతో కథ ముగుస్తుంది. చక్కటి సంభాషణలతో ఆసక్తికరంగా ఒక మగువ హృదయాన్ని చక్కగా ఆవిష్కరించారు. "ఒకే ఒక జీవితం" కథను రచయిత్రి శ్రీమతి సుమన ప్రణవ్ రచించారు. పెళ్లి విషయంలో కుటుంబం ఒత్తిడికి దూరంగా స్వేచ్ఛగా నిర్ణయం తీసుకోగలిగిన ఒక యువతి వృత్తాంతం, ఆసక్తికరంగా మలచడంలో సఫలీకృతమైనారని చెప్పవచ్చును.

యాసిడ్ దాడిని ఎదుర్కొన్న యువతి ధైర్యంగా కేరీర్ లో ముందుకు అడుగు వేయడం, ఆమెకు మరో బాధితురాలు అశాస్త్రీయ కారణాలతో కుటుంబీకులు గెంటివేయడంతో జీవితంలో ఒంటరిగా నిలబడ్డ స్త్రీకి తోడుగా నిలిచిన వైనాన్ని"స్పర్శ"అనేకలో చక్కటి కథనముతో డా.ఎం సుగుణారావు పాఠకులకు అందించారు.

సాటి మనుషుల పట్ల అనాథల పట్ల మనం చూపాల్సిన ప్రేమ కరుణ గురించి డాటర్ ఆఫ్ కృష్ణమూర్తి కథలో వెంకట కంచిపాటి చక్కటి సందేశాన్ని అందించారు.

తరాల నడుమ మారుతున్న అంతరంగాలు, కుటుంబ మానవీయ విలువలను, గత జ్ఞాపకాలను నెమరు వేతలా ఒక ఆత్మ స్వగతం లాగా చెప్పిన "బెంచి "కథను శ్రీధర్ రెడ్డి బిల్లా రచించారు.

జీవితంలో తను సాధించాలి అనుకున్నవి సాధించలేక ముసలి ప్రాయంలో తన కళ అందరికీ చూపాలని ఆరాటంతో సాధన, అర్థం చేసుకొని నేటి తరం నానమ్మ కోరికను తీర్చాలని మనవరాలు సహాయపడటం కథ సారాంశం మగువ మనసును తెలిపే "నెరవేరిన కోరిక" ఈ కథను అరుణ సందడి రచించారు. ప్రేమ ద్వేషం నడుమ పెనుగులాటలా ఒక యువతి మనసు సంఘర్షణను "తుషీమా" కథలో మంగు కృష్ణకుమారి రచించారు.

ఇలా కడలిలో మరెందరో ప్రముఖులు రచించిన రచనలు "అందమైన అబద్ధం"కథ సుబ్రహ్మణ్యం వల్లూరి,"చేరాల్సిన చోటు"కథ రాములపల్లి నర్సిరెడ్డి,"జనులారా పుత్రుని పొగడగ"కథ ఆచంట సుధా కళ్యాణి,"పాఠ్యాంశం" అట్టడ అప్పలనాయుడు,"పంచప్రాణాలు" సూర్య ప్రసాద్ రావు, "మనసెరిగిన అత్తగారు" సీత గాయత్రి, "మరో బాటసారి' 'కృపాకర్ పోతుల, "రీఛార్జి" సీతా రాంబాబు, "వాళ్లంతే" తన్నీరు శశికళ, "వాసన లేని పువ్వు" తిరుమలశ్రీ, "సాగనీ ఈ పయనం"స్వాతి శ్రీపాద మొదలైన వారు చక్కటి కథలను అందించారు. ఇందులో ప్రముఖ నుండి వర్తమాన వరకు అందరు రాసిన కథలు ఉన్నాయి. శాంతి కృష్ణ ఇంకా ఇలాంటి సంకలనాలు మరెన్నో తీసుకుని రావాలని ఆమెకు అభినందనలు తెలుపుతున్నాను.

**పుస్తకం వెల: 150సంప్రదించుటకు : 9502236670**
**సమీక్షకురాలు అరుణ సందడి, నెల్లూరు 99498 05100**

# పుస్తకాల తోటలో...9

**డా:అమ్మిన@77298 83223**

పరిశోధక రచయిత్రి ప్రామాణిక రచనల చిరునామా దారు డాక్టర్ అమరవాది నీరజ గారి రచనా శైలి ఎలా ఆసక్తిదాయకంగా ఉంటుందో ఆమె ఎంచుకునే కథావస్తువులు, కథన పద్ధతులు అంతే భిన్నంగా ఉంటాయి, కథ పేరు మొదలు కథ ముగింపు దాకా నీరజశైలి నిభిడీకృతం అయి వుంటాయి,

అలాంటి భిన్నమైన బాల కథా సంపుటి "ఏడు రంగుల జెండా" , "ఆటల్లో అరటిపండు" కథ మొదలు "గొప్ప విజయం" వరకు సాగినకి 28 కథల పయనంలో ప్రతికథ ఒక మధురమైన అనుభూతిని అందిస్తుంది.

సృష్టిలో ప్రతి వస్తువు ప్రాధాన్యతను కలిగి ఉంటుంది అంతేకానీ కొన్ని మాత్రమే ముఖ్యమైనవి అనే మూఢత్వం మంచిది కాదు అనే భావనా పూరిత సందేశాన్ని పంచిన "ఆటల్లో అరటిపండు" కథనుండి, ఎవరి గొప్ప వారు చెప్పుకోవడం గొప్పతనం కాదు మన గురించి ఇతరులు చెప్పుకోవడమే నిజమైన గొప్ప వారి లక్షణం అనే విలువైన విషయాన్ని చాటిన 'గొప్ప నిజం' కథ వరకు ప్రతి కథ ముచ్చటైన బొమ్మలతో ముస్తాబు చేయబడ్డాయి.

బడిలో కేవలం చదువేకాక విద్యార్థుల జీవితాలకు అవసరమైన అతి ముఖ్యమైన పనులు కూడా నేర్పటం అతి ప్రధానం అనే అంశంతో ఆద్యంతం ఉత్కంఠంగా సాగిన బుల్లి కథ "సెలవు చీ టి",

ఆనాటి గొప్ప కథ "కుందేలు సింహం" ను, నేటి తరానికి ఆసక్తిని కలిగిస్తూ మంచి నూతన ముగింపుతో వ్రాసిన "కుందేలు పంజా" కథ ద్వారా రచయిత్రి ఆత్మ రక్షణ అవసరం గురించి చక్కగా యుక్తిదయకంగా చెప్పారు.

నైపుణ్యం ప్రతి పనికి అత్యవసరం, అది ఉన్న వారే భవిష్యత్తులో అందరికన్నా ముందు వరుసలో నిలిచి ఉన్నతంగా ఎదగగలరు, అనే విలువైన సత్యాన్ని చాటిన మంచి కథ "నేర్పు",

ఇతరుల గెలుపుకి చప్పట్లు కొట్టడంతో పాటు మనం గెలిచి ఇతరుల చేత చప్పట్లు కొట్టించుకునే స్థాయికి ఎదగాలి అనే ఉత్తమోత్తమ సందేశం రంగరించి అందించిన మంచి కథ "గెలుపు చెప్పట్లు"

పిల్లల మనసుల్లోని భావాలు ఎంత విశాలంగా ఉంటాయో తెలుసుకుని వాటిని అమలు చేయడానికి పెద్దలు చేయూత ఎలా ఉండాలో చక్కగా విడమర్చి చెప్పిన కథ "బహుమతి" తాతయ్య ఒంటరితనం పోగొట్టడానికి మనవడు సుమంత్ చేసిన ఉపాయం ఏంటో తెలియాలి అంటే బహుమతి కథ చదివి తీరాల్సిందే!!



ఎల్లలు లేని స్నేహం విలువ చాటి చెబుతూ నిస్వార్థంగా చేసే ప్రతి స్నేహం వల్ల ఎంతో ప్రయోజనం ఇరుపక్షాలకు దక్కుతుంది అని ఎంతో హృద్యంగా చాటిన బుల్లి కథ "నలుపు తెలుపు"

ఇక పుస్తక పతాకథ "ఏడు రంగుల జెండా" వరుసలో ద్వితీయం అయినా అద్వితీయంగా వుంది, పిల్లాడి ఆత్మకథ ప్రక్రియలో విభిన్న శైలిలో నడిచిన ఈ కథ ద్వారా పిల్లలకు కష్టాలు పడితే వచ్చే సుఖాల గురించి వర్షం సాక్షిగా వివరించారు రచయిత్రి నీరజ.

ఎక్కువ కథలు వర్షం ద్వారా పాత్రల్లో పశ్చాత్తాపం కలిగించే విధంగా జాగ్రత్తలు తీసుకుని వర్షం ప్రాముఖ్యతను చాటడం రచయిత్రిలోని ప్రత్యేకతల్లో ఒకటి అనిపిస్తుంది.

బుల్లి బుల్లి కథలకు పెద్ద పెద్ద ముచ్చటైన బొమ్మలు అద్దీ అందంగా అలంకరించిన ఈ కథల పుస్తకం చూస్తుంటేనే ఆబగా ఆసాంతం చదివేయాలి అనిపిస్తుంది.

**ఏడు రంగుల జెండా (బాల కథా సాహిత్యం), పేజీలు: 70, ధర: 120/- రూ, ప్రతులకు: డాక్టర్ అమరవాది నీరజ సెల్: 98491 60055.**

## రక్షకుడినే భక్షకుడిని చేసే మద్యం మత్తు




రక్షకుడే భక్షకుడైనట్టుగా...
కుటుంబ పెద్దే కుటుంబాన్ని
చంపుకునేలా చేసే
దుష్టశక్తే...ఈ మద్యం మత్తు

కంచే చేను మేసినట్టుగా...
తండ్రే బిడ్డలను హతమార్చేలా చేసే
దుష్టశక్తే...ఈ మద్యం మత్తు

కాపలా వాడే కడతేర్చినట్టుగా...
తాళి కట్టిన మగడే ఆలిని కడతేర్చేలా చేసే
దుష్టశక్తే...ఈ మద్యం మత్తు

మంచే చెడు చేసినట్టుగా...
మానవత్వమే
అమానుషత్వంగా మారేలా చేసే
దుష్టశక్తే...ఈ మద్యం మత్తు

దీవించే వాడే శపించినట్టుగా...
దివ్యత్వమే క్రూరత్వంగా మారేలా చేసే
దుష్టశక్తే...ఈ మద్యం మత్తు

పాలకుడే రాజ్యాన్ని కూల్చుకున్నట్టుగా...
మార్గదర్శకుడే తప్పుదోవలో నడిచేలా చేసే
దుష్టశక్తే...ఈ మద్యం మత్తు
ఇంతటి దుష్ట మద్యాన్ని తరిమి కొట్టాలి...
సమాజపు పొలిమేర్లుదాటి
ఇంతటి దుష్ట మద్యాన్ని పెకలించాలి...
సమాజపు కూకటివేళ్ల నుంచి

ఇంతటి దుష్ట మద్యాన్ని నశింప చేయాలి...
సమాజపు కట్టుబాటుతో
ఇంతటి దుష్ట మద్యం పై పోరాడాలి...
సాహిత్య సమరాయుధంతో

**ననుబోలు రాజశేఖర్,**
**8330969808**

## నామాలవాడికే ఎగనామం



అరాచకపువికృతపోకడలతో,
అహంకారసునిశితభీషణదంష్ట్రలతో,
అతికుటిలచేష్టాసహస్రదారుణాలతో
విర్రవీగే అపరశిశుపాలురు
అశేషాజనావళి భక్తితో
అమృతప్రాయంగా భావించే
సప్తగిరులవాని నైవేద్యాన్నీ వదల్లేదటగా.
ఈ మనుషులు ఏం మనుషులో?
అధికారం మేల్కొన్న క్షణంనుంచీ
సుషుప్తిలోకి జారేవరకు అన్నీ అరాచకాలే.
దేవనగరాన్నేజి
చెరచయత్నించినవారికి,
పశుపతిసతి కొలువైన ప్రదేశాన్నీ
జలసమాధిసేయ యత్నించడం,
వారి మూర త్వానికి పరాకాష్ఠేగా.
తాము చేసిన తప్పిదానికి
హృదయాంతరాళాల్లో
ఆవేదనాబడబాగ్నులు దహించగా
దుస్సహమైనా,
కుసుమశాయక శరవసంతాలు
మౌనంగా భరించిన జనత,
ఇకనైనా
ఆలపించాలి ప్రాభాతహిందోళరాగాన్ని,
తరిమికొట్టాలిజి
ఆ అరాచకపు పోకడలను శాశ్వతంగా.
స్వాగతించాలి హిమకరుని
శీతలఆలోచనావీచికలను.

**వేమూరి శ్రీనివాస్**
**9912128967**

## ప్రేమ వెన్నెల !

చెలి చూపులో కొస మెరుపు
చిరునవ్వుల మేఘమాల
అందమైన నీలి నీలి
ఆకాశం కనిపిస్తోంది
కవ్విస్తోంది

మబ్బుల్లో సిగ్గు దొంతరలు
రాతిరి వేళ చందమామతో
సవ్వడి చేసే ప్రేమ వెన్నెల
చెలి కౌగిట్లో కలకాలం
బంధీ...పరవం
ఈ ప్రేమ వాకిట్లో
తోరణాలు కట్టిన
ఈ ప్రేమ వెన్నెల
చిగురించిన తొలి ప్రేమకు
స్వాగతం పలికే శుభోదయం
ప్రేమకు మహోదయం
అంతా ప్రేమ మయం
ఈ జగమంతా ప్రేమ మయం
ప్రేమ ప్రేమ ని ప్రేమిస్తుంది
ప్రేమ ప్రేమ లో జీవిస్తుంది
అదే అదే నా చెలి ప్రేమ సందేశం
ఇదే ఇదే నా తొలి సంకేతం
ప్రేమ వెన్నెల సందేశం!

**ఎల్. ప్రఫుల్ల చంద్ర**
**6300546700**

# బిజినెస్

## యాక్సెంచర్‌లో భారీ నియామకాలు : కంపెనీ సీఈవో జూలీ స్వీట్ వెల్లడి

ముంబై: నాల్గవ త్రైమాసికంలో ఊహించిన దానికంటే మెరుగ్గా 16.4 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించిన ఐటీ సేవల సంస్థ యాక్సెంచర్ భారతదేశంలో నియామకాలను వేగవంతం చేయనుంది. యాక్సెంచర్ సీఈవో జూలీ స్వీట్ మాట్లాడుతూ.. ప్రాథమికంగా భారతదేశంలో నియామకం చేస్తున్నట్లు తెలిపారు. నియామకం చాలా వరకు భారతదేశంలో సాంకేతికత, మరియు ఈ సమయంలో ఇది మా పిరమిడ్‌ను రిఫష్ చేయడం గురించి తెలియజేస్తు దన్నారు. ప్రధానంగా ఫ్రెషర్స్‌ను తీసుకోవడంపై మరింతగా దృఎష్టి పెడుతోందని చెప్పుకొచ్చారు. జెనరేటివ్ఏఐ (జెన్ఏ) మీద ఫోకస్‌తో తమ సర్వీసులను ఎప్పటికప్పుడు సరికొత్తగా తీర్చిదిద్దుకుంటున్నట్లు ఇన్వెస్టర్లతో సమావేశంలో ఆమె వివరించారు. 2024 ఆర్థిక సంవత్సరంలో తమ వ్యాపార వృఎద్ధికి ఇదే దోహదపడిందని పేర్కొన్నారు. జెన్ఏఐ సాంకేతికతను ఉపయోగించడంలో సిబ్బందికి విస్తృఎతంగా శిక్షణ నిస్తున్నట్లు జూలీ చెప్పారు. ఐర్లాండ్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న యాక్సెంచర్‌కి భారత్‌లో 3,00,000కు పైగా సిబ్బంది ఉన్నారు. అంతర్జాతీయంగా 7,74,000 మంది పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు. 2024 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ 64.90 బిలియన్ డాలర్ల ఆదాయం నమోదు చేసింది.




## బ్లాక్ టికెట్ల వ్యవహారంలో సంబంధంలేదు

### వివరణ ఇచ్చిన బుక్మై షో




బ్రిటిష్ రాక్ బ్యాండ్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించి బ్లాక్లో టికెట్లు విక్రయించినట్లు ఆరోపణలు రావడంతో బుక్ మై షో సీఈఓ, సహ వ్యవస్థాపకుడు అశీష్ హేమరాజని కి ముంబయి పోలీసులు శనివారం సమన్లు జారీ చేశారు. ఈ వ్యవహారంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. దీనిపై తాజాగా బుక్మై షో స్పందించింది. అనధికారంగా టికెట్లు విక్రయించిన వారితో తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది.ఈ వ్యవహారంపై బుక్మై షో అధికారిక ప్రతినిధి మాట్లాడుతూ.. "కోల్డ్ ప్లే కన్సర్ట్ కోసం సెప్టెంబర్ 22న బుక్మైషోలో టికెట్ విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఆ రోజు ఏకంగా 1.2 మిలియన్ల మంది టికెట్ బుకింగ్ కోసం లాగిన్ అయ్యారు. ప్రతి అభిమానికి టికెట్లు అందాలనే ఉద్దేశంతో ఒక్కో వినియోగదారుడు 4 టికెట్లు మాత్రమే కొనుగోలు చేసేందుకు పరిమితి విధించాం" అని ఆయన అన్నారు. అభిమానుల కోరిక మేరకు మూడో షోను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.వచ్చే ఏడాది జనవరిలో 19 నుంచి 21 వరకు నవీ ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియంలో కోల్డ్ ప్లే కార్యక్రమం జరగనుంది. బ్రిటిష్ రాక్బ్యాండ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కన్సర్టు అనూహ్య స్పందన వస్తోంది. దీంతో బ్లాక్లో ఈ ప్రోగ్రామ్ టికెట్ల విక్రయం జరిగినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ అంశంపై న్యాయవాది అమిత్ వ్యాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోల్డ్ప్లే టికెట్ ధర వాస్తవానికి రూ.2,500 ఉందని, కానీ థర్డ్ పార్టీ ద్వారా రూ.3 లక్షలకు విక్రయిస్తున్నారని అందులో ఆరోపించారు. కోల్డ్ప్లే అభిమానులను బుక్మై షో మోసం చేసిందని, అందుకుగానూ వీరిపై కేసు నమోదు చేయాలని ఆయన కోరారు. దీంతో ముంబయి పోలీస్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ బుక్మై షో కంపెనీ సీఈఓతో పాటు కంపెనీ టెక్నికల్ హెడ్కు కూడా సమన్లు పంపిన విషయం తెలిసిందే.

## "బిగ్ ఫాంటసీస్"ని ప్రారంభించిన

### ఐటిసి సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ




బిగ్ ఫాంటసీస్ గివ్ వింగ్స్ టు యువర్ ఇమాజినేషన్ (పెద్ద కలలు: మీ ఊహలకు రెక్కలు తొడగండి)" అనే కార్యక్రమాన్ని ఐటిసి సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ నిర్వహించింది. కార్యక్రమంలో మందిరా బేడి, ప్రకాశ రావు (మాజీ ఇస్రో డైరెక్టర్), డాక్టర్ మేఘా మహాజన్ (డిఎం - నిమ్హాన్స్), రెవ. రోహన్ డి అల్మేడా (ప్రిన్సిపాల్, సెయింట్ జోసెఫ్ పాఠశాల) హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఐటిసి లిమిటెడ్, బిస్కెట్స్ అండ్ కేక్స్ క్లస్టర్, ఫుడ్స్ డివిజన్ హెడ్ అలీ హారిస్ షేర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంతో, సాంకేతికతతో కళను మిళితం చేయడం ద్వారా పిల్లలలో సృజనాత్మకత ఊహాశక్తిని పెంపొందించటం బ్రాండ్ యొక్క లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతరిక్ష పరిశోధన, విద్యారంగం, మనస్తత్వశాస్త్రం సృజనాత్మక కళల రంగాలకు చెందిన ప్రముఖులతో "ఇంపార్టెన్స్ ఆఫ్ ఇగ్నైటింగ్ ఏ చైల్డ్స్ ఇమాజినేషన్" (పిల్లల ఊహను ప్రేరేపించడం యొక్క ప్రాముఖ్యత) అనే అంశంపై వివరణాత్మక ప్యానెల్ చర్చ జరిగిందన్నారు.పిల్లల సమగ్ర వికాసానికి కల్పన అనేది ప్రాథమిక అంశంగా ఎలా నిలుస్తుంది , అది సృజనాత్మకత%డ%సమస్య పరిష్కార నైపుణ్యాలను ఎలా పెంపొందిస్తుంది, కొత్త ఆలోచనలను రేకెత్తించడంలో సవాళ్లను అధిగమించడంలో వారికి ఏ విధంగా సహాయపడుతుందనే అంశాలను ప్యానెల్ చర్చించింది.

### కీర్తిలాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్‌కి

## ఐకాన్ ఆఫ్ ది జ్యువెలరీ ఇండస్ట్రీ 2024 అవార్డు




హైదరాబాద్:కీర్తిలాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ కి ఐకాన్ ఆఫ్ ది జ్యువెలరీ ఇండస్ట్రీ 2024 అవార్డు లభించింది. నేషనల్ జ్యువెలరీ అవార్డ్స్ 2024లో ఆల్ ఇండియా జెమ్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జిజెసి) ఈ అవార్డును ప్రధానం చేసింది. ఈ మేరకు ఇండియా జెమ్ అండ్ జ్యువెలరీ షో (జీజెఎస్) దిగ్గజ వేడుక ప్రతిష్టాత్మక జిజెఎస్ నైట్ కార్యక్రమంలో కీర్తి లాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ ఈ అవార్డు అందుకున్నారు. ఆభరణాల పరిశ్రమకు అందించిన విశేషమైన సేవలకు గుర్తింపుగా, డిజైన్, నవ్యావిష్కరణ, వ్యాపార నాయకత్వాల్లో శ్రేష్టమైన నైపుణ్యాలకు ఈ పురస్కారం అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు. దీంతో పాటు స్టోర్ ఆఫ్ ది ఇయర్ (సౌత్), రింగ్ ఆఫ్ ది ఇయర్, థీమ్ బేస్డ్ జ్యువెలరీ, బ్రైడల్ జ్యువెలరీ ఆఫ్ ది ఇయర్ (కలర్ స్టోన్) నాలుగు విభాగాల్లో కూడా కీర్తిలాల్స్ పురస్కారాలను పొందింది. ఈ కార్యక్రమంలో జీజేసీ డైరెక్టర్లు అశోక్ కుమార్ జైన్, సమర్ కుమార్ డి ఈ, సాహిల్ మెహరా, ఆసీస్ కొహరీ తో పాటు జ్యువెల్ ట్రెండ్స్ డైరెక్టర్ గోవింద్ వెర్మ పాల్గొన్నారు.

## రోల్స్ రాయిస్ కల్లినన్ సిరీస్2 ను విడుదల



"భారతదేశంలో కల్లినన్ సిరీస్ 2 ప్రవేశం, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో రోల్స్ రాయిస్కు ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. 2018లో మొదటిసారిగా రోడ్డుమీదకు వచ్చినప్పటి నుండి , ఈ అద్భుతమైన మోటారు కారు యువ మరియు విభిన్న క్లయింట్లను ఆకర్షించింది. నేడు మార్క్యూ యొక్క పోర్ట్ఫోలియోలో ఎక్కువగా అభ్యర్థించిన రోల్స్ రాయిస్ గా కల్లినన్ నిలిచింది. కొత్త సాంకేతికతలు, కొత్త మెటీరియల్లు, నిశితంగా పరిగణించబడే డిజైన్ నవీకరణలు మరియు బెస్పోక్ ద్వారా స్వీయ-వ్యక్తీకరణ కోసం వినూత్న అవకాశాలను అనుసంధానిస్తుంది" అని ఐరీన్ నిక్కిన్, రీజినల్ డైరెక్టర్ ఆసియా-పసిఫిక్, రోల్స్ రాయిస్ మోటార్ కార్స్ అన్నారు.మోటారు కారు యొక్క అసాధారణ విజయం మరియు ప్రపంచంలోని ప్రతి ప్రాంతంలోని క్లయింట్ల నుండి అసాధారణ రీతిలో సానుకూల ఆదరణను దృష్టిలో ఉంచుకుని, 'రోల్స్-రాయిస్ ఆఫ్ ఎస్ యు వి లు 'యొక్క కొత్త వ్యక్తీకరణను రూపొందించడంను ఖచ్చితమైన రీతిలో జాగ్రత్తగా చేపట్టడం జరిగింది. మార్క్యూ యొక్క రూపకర్తలు, ఇంజనీర్లు మరియు హస్తకళాకారులు అర్ధ దశాబ్దం పాటు వివరణాత్మక క్లయింట్ ఫీడ్బ్యాక్, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మా ప్రైవేట్ కార్యాలయాలతో సహా బ్రాండ్ యొక్క స్వంత ఇంటెలిజెన్స్ కలెక్షన్ పరిగణలోకి తీసుకుని కల్లినన్ను ముందుకు తీసుకెళ్లడానికి కొత్త సాంకేతికతల ను పొందారు. రోల్స్ రాయిస్ చరిత్రలో అత్యంత విస్తృతమైన సిరీస్ %××% అభివృద్ధికి ప్రాతినిధ్యం వహిస్తుంది. కల్లినాన్ యొక్క అపూర్వమైన జనాదరణకు ఆధారమైన ముఖ్యమైన లక్షణాలకు కట్టుబడి ఉండగా, విలాసవంతమైన మరియు అభివృద్ధి చెందుతున్న వినియోగ విధానాలను మార్చడానికి ప్రతిస్పందిస్తుంది.

## కోర్నింగ్ రేబిస్‌పై సీరం అవగాహన కేంపెయిన్

న్యూ డిల్లీ - గ్లాస్, సిరామిక్, మెటీరియల్స్ సైన్స్ ప్రపంచంలోని ప్రముఖ ఆవిష్కర్తలలో ఒకటైన కార్నింగ్ ఇన్కార్పొరేటెడ్ య ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా భారతదేశంలో దేశవ్యాప్త అవగాహన ప్రచారాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ కేంపెయిన్ ప్రపంచ ఆరోగ్య సంస్థ( డబల్యు హెచ్ ఓ) యొక్క "30 కి సున్నా" కి గమ్యానికి మద్దతు ఇస్తూ 2030 కి రేబిస్ మరణాలను నివారించాలి అనే గమ్యం తో ఉంది . ఇండియా యొక్క సీరం సంస్థ మరియు స్వీయ ఉద్యోగ మహిళల సంఘం( ఎస్ ఈ డబ్ల్యు ఏ) కార్నింగ్ తో కేంపెయిన్ ని ముందుకు నడపడానికి సహాయం చేస్తుంది. "కార్నింగ్ వద్ద మేము సంఘం యొక్క కలయిక మరియు విద్య ని నమ్ముతాము. 30 చొరవ ద్వారా డబలాయు హెచ్ ఓ యొక్క సున్నా చొరవ కి మద్దతు ని అందిస్తుంది మరియు మేము రేబిస్ కేసులను తగ్గించడంలో మారియు దాని నివారణ మరియు అవగాహన ని అందించడంలో ముఖ్య పాత్ర ని పోషిస్తుంది," అని కార్నింగ్ ఇండియా యొక్క మేనేజింగ్ డైరెక్టర్ సుధీర్ పిళ్లై అన్నారు. "సీరం సంస్థ మరియు ఎస్ ఈ దబల్యు ఏ కలయిక తో, మనం చాలా ప్రభావితం చెయ్యవచ్చు."అన్నారు.



## పీఎన్‌బీ మెట్ లైఫ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2024

హైదరాబాద్ : హైదరాబాద్ స్టేడియంలో8వ ఎడిషన్ పీఎన్బీ మెట్లైఫ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ (జేబీసీ) గ్రాండ్ ఫినాలేకు చేరుకుని, దేశంలోని యువ బ్యాడ్మింటన్ ప్రతిభావంతులు సాధించిన విజయాలను వేడుక చేసుకుంటోంది. వరుసగా మూడవ ఏడాది "బహుళ నగరాలలో అత్యధిక చిన్నారులు పాల్గొనే బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్"గా ఈ ఈవెంట్ చారిత్రక మైలురాయిగా నిలిచిపోనుంది. వరల్డ్ రికార్డ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ (డబ్ల్యూఆర్సీఏ) ద్వారా వరుసగా మూడు సంవత్సరాలు ప్రపంచ రికార్డును మంజూరు చేయబడడం ద్వారా, జూనియర్ బ్యాడ్మింటన్ ప్రపంచంలో ఈ ఛాంపియన్షిప్కు ఉన్న ప్రాముఖ్యతను చాటుతోందో ముగింపు సంరంభానికి ఏషియన్ గేమ్స్ స్వర్ణ పతక విజేత మరియు జేబీసీ మెంటార్లు అయిన చిరాగ్ షెట్టి, సాత్విక్ రాంకిరెడ్డిలతో పాటుగా, చిరాగ్ శెట్టి %డ% సాత్విక్ రాంకిరెడ్డి, ముఖ్య అతిథి వెంకట్ చంగవల్లి, సీఈఓ ఇన్సూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆఫ్ ఇండియా, సమీర్ బన్సల్, సీఈఓ %డ% ఎం. డి , పీఎన్బీ మెట్లైఫ్ %డ% సౌరభ్ లోహ్టియా, సి ఎం సి ఓ , పీఎన్బీ మెట్లైఫ్ లు ప్రాతినిధ్యం వహించారు. విజేతలుగా నిలిచిన యువ అథ్లెట్లకు, వారి అసామాన్యమైన విజయానికి గుర్తుగా ప్రతిష్టాత్మక జేబీసీ ట్రోఫీని అందజేశారు. ఈ ఈవెంట్లో చిరాగ్, సాత్విక్లతో ప్రత్యేక మెంటారింగ్ సెషన్ను నిర్వహించగా, వాళ్లు దానిలో గేమ్స్, క్రీడలతో విద్యాభ్యాసంపై సమతుల్యం పాటించడం, ఒత్తిడిని నిర్వహించడం, అలాగే మానసిక ధృఢత్వాన్ని నిర్మించుకోవడంపై యువ షట్లర్లు మరియు వారి తల్లిదండ్రులతో అనేక విలువైన అంతర్గత అంశాలను పంచుకున్నారు. టోర్నమెంట్ విజయం సాధించడం పట్ల పీఎన్బీ మెట్లైఫ్ ఎండీ మరియు సీఈఓ సమీర్ బన్సల్ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. "పీఎన్బీ మెట్లైఫ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్లో మరో విజయవంతమైన ఎడిషన్ను పూర్తి చేసుకోనుండడంతో, వరుసగా మూడవ ఏడాది సాధించిన ప్రపంచ రికార్డును మాత్రమే కాకుండా, దేశం నలుమూలల నుండి అద్భుతమైన ప్రతిభ ఉద్భవించడాన్ని కూడా మేము వేడుక చేసుకుంటున్నాము. ఈ విజయం యువ అథ్లెట్లకు తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి, అలాగే వారు రాణించడం కోసం మెరుగైన అవకాశాలను అందించడం పట్ల ప్రాముఖ్యతను చాటి చెబుతోంది. విజేతలు అందరికీ, అలాగే వారి కుటుంబాలు మరియు కోచ్లకు అభినందనలు. పీఎన్బీ మెట్లైఫ్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం కోసం, అలాగే పిల్లల మానసిక, శారీరక సామర్థ్యాల సమగ్ర అభివృద్ధికి మద్దతును అందించే విషయంలో క్రీడలకు ఉన్న అపారమైన శక్తిని మేము విశ్వసిస్తున్నాము. వర్ధమాన ప్రతిభను పెంపొందించడంలో, ఇంకా భవిష్యత్ సవాళ్లకు వారిని సిద్ధం చేయడంలో జేబీసీ ఒక ముఖ్యమైన వేదికగా కొనసాగుతుంది," అని ఆయన అన్నారు.




## 'ఈక్వల్ ఎట్ సీ' 2027 లక్ష్యంకు చేరువైన మెర్స్క్

లాజిస్టిక్స్ గ్లోబల్ ఇంటిగ్రేటర్ ఏ.పి. మోల్లెర్ - మెర్స్క్(మెర్స్క్), దేశంలో తమ 'ఈక్వల్ ఎట్ సీ' కార్యక్రమం కింద ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నట్టు వెల్లడించింది. 2024 వ సంవత్సరంలో నాటికల్ మరియు ఇంజినీరింగ్ క్యాడెట్లలో 45% మంది మహిళలు ఉండటంతో, కంపెనీ తమ ఉద్యోగుల నియామకం లో 2027 నాటికి సమాన లింగ ప్రాతినిధ్యం చేరుకోవాలనుకునే లక్ష్యానికి మరింత చేరువైంది. భారతీయ సముద్రయాన రంగంలో లింగ సమానత్వం దిశగా పురోగతిని వేగవంతం చేయడం 2022లో ప్రారంభించబడిన 'ఈక్వల్ ఎట్ సీ' కార్యక్రమం, భారతదేశంలో అద్భుతమైన విజయంతో మూడవ సంవత్సరంలోకి ప్రవేశించింది. మెర్స్క్ నావికులలో లింగ సమానత్వాన్ని సాధించడం, నావికా రంగంలో చారిత్రాత్మకంగా మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం అనే సమస్యను పరిష్కరించడం మరియు లింగ వైవిధ్యాన్ని మెరుగుపరచడానికి మొత్తం భారతీయ సముద్రయాన రంగం కోసం అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను సృష్టించడం ఈ కార్యక్రమం యొక్క ప్రాథమిక లక్ష్యం. ఈ కార్యక్రమం పరిశ్రమలోని విభిన్న వాటాదారులను ఉమ్మడి వేదిక పైకి తీసుకువస్తుంది, ఇది ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి, పరిశ్రమ సవాళ్లను అర్థం చేసుకోవడానికి, ఒకరి నుండి ఒకరు నేర్చుకోవడానికి మరియు ఉత్తమ పద్ధతులను అమలు చేయడానికి కేంద్రంగా పనిచేస్తుంది. షిప్పింగ్ ఇండియా డైరెక్టర్ జనరల్ శ్యామ్ జగన్నాథన్ మాట్లాడుతూ, "సముద్రయాన రంగం ఆవిష్కరణలతో అభివృద్ధి చెందుతోంది. సముద్రయానంలో లింగ వైవిధ్యాన్ని ప్రోత్సహించడానికి మెర్స్క్ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం, మరింత సమగ్రమైన మరియు డైనమిక్ షిప్పింగ్ రంగం దిశగా ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుంది. మేము నౌకాయాన కార్యక్రమాల భవిష్యత్ ను అన్వేషిస్తున్నప్పుడు, మేము లింగంతో సంబంధం లేకుండా వ్యక్తుల ప్రతిభ మరియు ఆలోచనా ధోరణిని కూడా పరిశీలించాల్సి వుంది" అని అన్నారు. "నౌకాయాన కెరీర్లలో మహిళలకు మరిన్ని అవకాశాలను కల్పించడానికి ఈ పరిశ్రమ-వ్యాప్త ప్రయత్నం నిస్సందేహంగా మన గ్లోబల్ షిప్పింగ్ కమ్యూనిటీని బలోపేతం చేస్తుంది




మరియు రాబోయే సంవత్సరాల్లో పురోగతిని పెంచుతుంది" అని అన్నారు. మెర్స్క్- ఆసియా లో మెరైన్ పీపుల్, హెడ్ కరణ్ కొచ్చార్ మాట్లాడుతూ, "మా నిరంతర ప్రయత్నాలు మరియు పరిశ్రమ నుండి లభిస్తున్న అపారమైన మద్దతు, మహిళలు అభివృద్ధి చెందడానికి సముద్రంలో సమానమైన వాతావరణాన్ని సృష్టించే భవిష్యత్తును చూడటం ప్రారంభించింది. మా కార్యక్రమాల ద్వారా, భారతదేశంలో ఎక్కువ మంది మహిళలు సముద్రయానాన్ని వృత్తిగా ఎంచుకునేందుకు మేము విజయవంతంగా ప్రేరణ అందిస్తున్నాము " అని అన్నారు." మహిళలు 45%కి చేరుకోవడం అనేది మెర్స్క్ మరియు పరిశ్రమ అంతటా ఒక గొప్ప జట్టు ప్రయత్నంగా ఉంది. ఇప్పుడు ఈ వేగం కొనసాగించటంతో పాటుగా రిక్రూట్ చేయబడిన మహిళలు కూడా ఫ్లీట్లో ఉండేలా కృషి చేయాల్సిన సమయం వచ్చింది" అని అన్నారు.

## తమిళనాడులో టాటా మోటార్స్ తయారీ కేంద్రానికి శంకుస్థాపన

పనపాక్కం : స్వదేశీ ("మేక్ ఇన్ ఇండియా, వరల్డ్ ఫర్ ది వరల్డ్") తయారీని ప్రోత్సహించే దిశగా ఒక ముఖ్యమైన అడుగులో, వాణిజ్య మరియు ప్రయాణీకుల వాహనాల ఉత్పత్తిలో భారతదేశంలోని ప్రముఖ నిర్మాత టాటా మోటార్స్ గ్రూప్ ఈరోజు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించింది. తమిళనాడులోని రాణిపేట్ జిల్లాలోని పనపాక్కంలో కార్లు మరియు ఎస్‌యువి లను తయారు చేయడానికి దాని కొత్త, ప్రపంచ స్థాయి ఉత్పత్తి కేంద్రం. ఈ తయారీ కేంద్రం టాటా మోటార్స్ మరియు జెఎల్ఆర్ కోసం తదుపరి తరం వాహనాలను ఉత్పత్తి చేస్తుంది. అంతర్జాతీయంగా బెంచ్మార్క్ ఉన్న ప్లాంట్ భారతీయ మరియు అంతర్జాతీయ మార్కెట్ల అవసరాలను తీరుస్తుంది ఈ శంకుస్థాపన కార్యక్రమానికి తమిళనాడు ముఖ్యమంత్రి తిరు ఎం.కె. స్టాలిన్ మరియు టాటా సన్స్ %డ% టాటా మోటార్స్ చైర్మన్ శ్రీ ఎన్. చంద్రశేఖరన్, పలువురు ప్రముఖ మంత్రులు, ప్రజా ప్రతినిధులు, సీనియర్ అధికారులు, ప్రభుత్వ అధికారులు మరియు టాటా గ్రూప్ సీనియర్ ప్రతినిధుల సమక్షంలో. ఈ సందర్భంగా తిరు ఎం.కె. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ, "దేశ నిర్మాణానికి టాటా గ్రూప్ తన సేవలకు ప్రసిద్ధి చెందింది. గత కొన్ని సంవత్సరాలుగా మన రాష్ట్రంలో విజయవంతంగా పనిచేస్తున్న అనేక ఉత్పాదక ప్లాంట్లతో తమిళనాడుతో ఇది లోతైన, చారిత్రాత్మక సంబంధాన్ని కలిగి ఉంది. గ్లోబల్ స్కేల్ ఆటో తయారీదారు అయిన టాటా మోటార్స్ తన సరికొత్త తయారీ కేంద్రాన్ని రాణిపేటలోని పనపాక్కంలో ఏర్పాటు చేసినందుకు మేము స్వాగతిస్తున్నామన్నారు.ఈ అధునాతన, అత్యాధునిక తయారీ సౌకర్యం 5,000 ఉపాధి అవకాశాలను (ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా) సృష్టించగల సామర్థ్యాన్ని కలిగి ఉంది మరియు ప్లాంట్లోని మరియు చుట్టుపక్కల ఉన్న స్థానిక కమ్యూనిటీలలో భవిష్యత్తులో సిద్ధంగా ఉన్న నైపుణ్యాలను పెంపొందించడానికి దోహదం చేస్తుంది. అదనంగా, ప్లాంట్ స్థిరత్వం యొక్క సూత్రాల ద్వారా మార్గనిర్దేశం చేయబడుతుంది మరియు రన్నింగ్ కార్యకలాపాలకు 100% పునరుత్పాదక శక్తిని ఉపయోగిస్తుంది. ఈ సందర్భంగా టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ, ఎలక్ట్రిక్, లగ్జరీ వాహనాలతో సహా మా తర్వాతి తరం కార్లు, ఎస్యూవీలకు పనపాక్కాన్ని నిలయంగా



మార్చడం సంతోషంగా ఉందన్నారు. తమిళనాడు ప్రగతిశీల విధానాలతో ప్రముఖ పారిశ్రామిక రాష్ట్రంగా ఉంది మరియు అర్హత కలిగిన మరియు ప్రతిభావంతులైన శ్రామికశక్తితో ఏర్పాటు చేయబడిన ఆటోమోటివ్ హబ్. అనేక టాటా గ్రూప్ కంపెనీలు ఇక్కడ నుండి విజయవంతంగా పనిచేస్తున్నాయి. మేము ఇప్పుడు అత్యాధునిక తయారీ సాంకేతికత మరియు ప్రపంచ-తరగతి సుస్థిరత పద్ధతులను ఉపయోగించి ఇక్కడ మా అధునాతన వాహనాల తయారీ ప్లాంట్ను నిర్మించాలనుకుంటున్నాము. మహిళా సాధికారత దిశగా మా దృష్టికి అనుగుణంగా, స్థాయిల్లో మహిళా ఉద్యోగుల్లో అధిక వాటాను కలిగి ఉండటమే మా ప్రయత్నం అన్నారు.

## న్యూ ఏజ్ కెరీర్స్ ఫర్ న్యూ ఇండియా

దేశంలోని ప్రముఖ యానిమేషన్ ఇన్స్టిట్యూట్లో ఒకటైన అరేనా యానిమేషన్, హైదరాబాద్లో యువత కోసం "న్యూ ఏజ్ కెరీర్స్ ఫర్ న్యూ ఇండియా: పెర్స్పెక్టివ్ టూర్ 2024" ను విజయవంతంగా నిర్వహించింది. సెప్టెంబర్ 23, 2024న హైదరాబాద్లోని కె.ఎల్.ఎన్. ప్రసాద్ ఆడిటోరియంలో ఈ సెమినార్ జరిగింది. ఈ సృజనాత్మక రంగంలో నేర్చుకునేందుకు, ఎదగడానికి ఆసక్తిగా ఉన్న 400o మందికి పైగా యువతీ యువకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నిపుణులతో తమ ఆలోచనలను పంచుకున్నారు. 'పెర్స్పెక్టివ్స్' అనేది పరిశ్రమ గురించి లోపలి విషయాల గురించి తెలుసుకోవాలనుకునే వారికి ఒక ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుంది. ఇది ఔత్సాహిక విద్యార్థులకు కీలకమైన సందర్భాన్ని సూచిస్తుంది. ఏటా ఈ కార్య క్రమం జరుగుతుంది. ఈ రంగంలో పాల్గొనేవారిని ఆకర్షించడానికి ఈ కార్యక్రమం ప్రసిద్ధి చెందింది. యాని మేషన్, వీఎఫ్ఎక్స్, మల్టీమీడియా, గేమింగ్, వెబ్ డిజైన్లో కెరీర్లను అన్వేషించడానికి ఆసక్తి ఉన్న అనేక మంది విద్యార్థుల కోసం ఈ సంవత్సరం కూడా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. హాజరైన వారికి పరి శ్రమకు చెందిన పలువురు ప్రముఖులచే ఆలోచనలను రేకెత్తించే సెషన్లు అందించబడ్డాయి. అలాగే అగ్రశ్రేణి యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, ఫిల్మ్ మేకింగ్ వెనుక ఉన్న క్లిష్టమైన ప్రక్రియల గురించి ఎన్నో విషయాలను విద్యార్థులు తెలుసుకోగలిగారు. హార్నిబల్ స్టూడియోస్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ రవి కొత్తపల్లి, గ్రీన్గోల్డ్ యానిమేషన్ నుండి శ్రీ కె. రామకృష్ణ ( వీ ఎఫ్ఎక్స్ సూపర్వైజర్), శ్రీ జి. లక్ష్మణ్ %డ% శ్రీ జె. మెహర్ ప్రసాద్ తో సహా ప్రముఖ పరిశ్రమ నిపుణులు తమ అమూల్యమైన దృక్పథాలు, సాంకేతిక పరిజ్ఞానంపై లోతైన విషయాలతో ఈ కార్యక్రమానికి హాజరైన వారిని ప్రేరేపించారు. హార్నిబల్ స్టూడియోస్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ రవి కొత్తపల్లి "మేకింగ్ ఆస్పిరెంట్స్ ఇండస్ట్రీ-రెడీ ఇన్ ది వరల్డ్ ఆఫ్ విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్, గేమింగ్" అనే అంశంపై అద్భుతమైన సెషన్ను అందించారు. గ్రీన్గోల్డ్ యానిమేషన్ నుండి కె. రామకృష్ణ (వీఎఫ్ఎక్స్ సూపర్వైజర్), జి. లక్ష్మణ్, జె. మెహర్ ప్రసాద్ ఛోటా భీమ్ మరియు కర్స్ ఆఫ్ దామ్ యాన్ వీఎఫ్ఎక్స్ లైవ్ యాక్షన్ మూవీ మేకింగ్ గురించి ఒక ఆసక్తికరమైన దృక్కోణాన్ని అందించారు.ఈ కార్యక్రమానికి హాజరైన వారి నుండి అధిక స్పందన లభించింది. వక్తల ప్రజంటేషన్స్ గాఢత, తీరుతెన్ను లను ప్రశంసించారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల పరివర్తన ప్రభావాన్ని చర్చలు చాటిచెప్పాయి. విద్యార్థులు, యువ నిపుణుల కోసం విలువైన దృక్పథాలను అందించాయి.ఆప్టెక్ లిమిటెడ్ రిటైల్ బిజినెస్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సందీప్ వెలింగ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ "న్యూ ఏజ్ కెరీర్స్ ఫర్ న్యూ ఇండియా: పెర్స్పెక్టివ్స్ టూర్ 2024' సాధించిన విజయంతో మేం ఎంతో ఆనందిస్తు న్నాం. భారతదేశంలో కెరీర్ల భవిష్యత్తు అనే అంశంపై జరిగిన ఈ కార్యక్రమం నిజంగా ఒక ప్రమాణాన్ని నిర్దేశించింది. కీలకమైన ఒపీనియన్ లీడర్స్ భాగస్వామ్యం, ఆలోచింపజేసే చర్చలు, అభిప్రాయాలు కొత్త-యుగం కెరీర్ను కొనసాగించాలనే ఆసక్తి ఉన్న ఔత్సాహికులకు ఎంతో ప్రయోజనం చేకూర్చాయని నేను విశ్వసిస్తు న్నాను. అరేనా యానిమేషన్




విద్యార్థులను నవతరం నైపుణ్యాలతో సన్నద్ధం చేయడానికి కట్టు బడి ఉంది. తమ ప్రతిభను, వారి సృజనాత్మక సామర్థ్యాన్ని ఆవిష్కరించడానికి మా కేంద్రాలకు వెళ్లాలని మేం యువతను కోరుతున్నాం" అని అన్నారు. వినియోగదారులు క్రమంగా సూపర్ హీరోలు, బలీయమైన జీవుల వైపు ఎక్కువగా ఆకర్షితులవుతున్నం దున, భారతదేశ ఏవీజీసీ రంగం ఇటీవలి సంవత్సరాలలో అసమానమైన వృద్ధి రేటును సాధించింది. పీ డబ్ల్యూసీ ద్వారా, 24వ వార్షిక గ్లోబల్ ఎంటర్టైన్మెంట్ %డ% మీడియా ఔట్లుక్ 2023-2027 ప్రకారం 53 భూభాగాల్లోని 13 రంగాలలో భారతదేశ మీడియా %డ% ఎంటర్టైన్మెంట్ పరిశ్రమ 9.7% సీఏజీఆర్ వద్ద వృద్ధి చెందుతుందని అంచనా వేయబడింది. ఇది 2027 నాటికి 73.6 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. ఈ వృద్ధి ఆఫ్షోర్ సర్వీస్ డెలివరీకి సంబంధించి భారతదేశ టాలెంట్ పూల్లోకి ప్రవేశించాలని కోరుకునే సంస్థల ను ఎంతగానో ఆకట్టుకుంది.25 సంవత్సరాలకు పైగా విస్తరించిన వారసత్వంతో, అరేనా యానిమేషన్ శ్రేష్ఠతకు నిదర్శనంగా నిలుస్తుంది. వ్యూహాత్మక భాగస్వామ్యాలు, చక్కటి ఫ్యాకల్టీ, అత్యాధునిక సాంకేతిక సాధనాలతో ఇది బలోపేతం చేయ బడింది. లక్ష్యం స్పష్టంగా ఉంది - పరిశ్రమకు సంబంధించిన నైపుణ్యాలతో యువతను సన్నద్ధం చేయడం, వారి సృజనాత్మకతను మెరుగుపరుచుకునేలా చేయడం, తట్టుకునే శక్తిని పెంపొందించడం, టీమ్ వర్క్ ని ప్రోత్సహించడం, కార్యాలయంలో విజయం సాధించేలా చేయడం గడువు సమయాలను చేరుకోవడం, ప్రెజెం టేషన్లు అందించడం, పరిశ్రమలోని సహ చరులతో నెట్వర్క్ని కలిగి ఉండడం. అరేనా యానిమేషన్ అనేది అత్యంతగా ఉపాధి పొందగల, విజయవంతమైన నిపుణుల సమూహాన్ని పెంపొందించడంలో నిబద్ధతతో ఉంది. మీడియా, వినోదం యొక్క డైనమిక్ ప్రపంచంలో తనదైన ముద్ర వేయడానికి సిద్ధంగా ఉంది. అరేనా యానిమేషన్ గురించి, అరేనా యానిమేషన్ అనేది మీడియా %డ% ఎంటర్టైన్మెంట్ ట్రైనింగ్, ఎడ్యుకేషన్లో అగ్రగామి మరియు గ్లోబల్ ట్రెండ్సెట్టర్. అరేనా విస్తృత కేంద్రాల నెట్వర్క్ను కలిగి ఉంది. ఇది 1996లో ప్రారంభమైనప్పటి నుండి ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చిందని తెలిపారు.

## బియ్యం ఎగుమతులపై పరిమితుల తగ్గింపు



ఢిల్లీ: బియ్యం ఎగుమతులపై విధించిన చాలా పరిమితులను భారత్ తొలగించింది. 2023లో ఈ ఆంక్షలు విధించారు. రుతుపవనాలు బాగా ఉండడం, ప్రభుత్వ గోదాముల్లో సరిపడా బియ్యం నిల్వ ఉండడంతో ఈ నిర్ణయం తీసుకు న్నారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఎగుమతిదారు. 2022లో, భారతదేశం ప్రపంచంలోని బియ్యంలో 40% కంటే ఎక్కువ ఎగుమతి చేసింది. మొత్తం 5.54 కోట్ల టన్నులలో ఇది 2.22 కోట్ల టన్నులు. భారతదేశం 140 కంటే ఎక్కువ దేశాలకు బియ్యం ఎగుమతి చేస్తుంది. భారత ప్రభుత్వం ఇతర దేశాలకు వారి ఆహార భద్రత అవసరాలను తీర్చడానికి మరియు వారి ప్రభుత్వాల అభ్యర్థనల ఆధారంగా ఎగుమతులను అనుమతించింది. బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగుమతిపై నిషేధాన్ని శనివారం ప్రభుత్వం ఎత్తివేసింది. అలాగే, దానిపై టన్నుకు 490 కనీస ధర నిర్ణయించబడింది. దీనికి ఎగుమతి సుంకం నుంచి కూడా మినహాయింపు ఇచ్చారు. దేశీయ సరఫరాను పెంచడానికి జూలై 20, 2023 నుంచి బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగుమతి నిషేధించబడింది. ప్రపంచంలో అతిపెద్ద ఎగుమతిదారు ప్రపంచంలోని తదుపరి నాలుగు అతిపెద్ద ఎగుమతిదారుల ఉమ్మడి ఎగుమతుల కంటే భారతదేశ ఎగుమతులు ఎక్కువగా ఉన్నాయి. వీటిలో థాయిలాండ్, వియత్నాం, పాకిస్థాన్ మరియు అమెరికా ఉన్నాయి. బెనిన్, బంగ్లాదేశ్, అంగోలా, కామెరూన్, జిబౌటి, గినియా, ఐవరీ కోస్ట్, కెన్యా, నేపాల్ భారతదేశం నుంచి బాస్మతీయేతర బియ్యాన్ని కొనుగోలు చేసే ప్రధాన దేశాలు. ఇరాన్, ఇరాక్, సౌదీ అరేబియా ప్రధానంగా బాస్మతి బియ్యాన్ని భారతదేశం నుంచి కొనుగోలు చేస్తాయి. విధించిన ఆంక్షల కారణంగా 2023లో భారతదేశ బియ్యం ఎగుమతులు 20% తగ్గి 17.8 మిలియన్ టన్నులకు చేరుకున్నాయి. 2024 మొదటి ఏడు నెలల్లో కూడా, ఎగుమతులు గత సంవత్సరం కంటే నాలుగింట ఒక వంతు తక్కువగా ఉన్నాయి.
ఈ దేశాలపై ఆధారపడటం పెరిగింది. భారతదేశం యొక్క ఎగుమతులు తగ్గిన కారణంగా.. ఆసియా, ఆఫ్రికన్ కొనుగోలుదారులు థాయిలాండ్, వియత్నాం, పాకిస్థాన్, మయన్మార్ నుంచి బియ్యాన్ని కొనుగోలు చేయవలసి వచ్చింది. పెరిగిన డిమాండ్, పరిమిత సరఫరా కారణంగా.. ఈ దేశాలలో ఎగుమతి ధరలు గత 15 సంవత్సరాలలో అత్యధిక స్థాయికి చేరుకున్నాయి. బాస్మతి కాకుండా తెల్ల బియ్యం (సెమీ మిల్లింగ్ లేదా పూర్తిగా మిల్లింగ్ చేసిన బియ్యం, పాలిష్ చేసినా, చేయకపోయినా) ఎగుమతి విధానాన్ని పరిమితం నుంచి ఉచితంగా సవరించినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డిజిఎఫ్టి) శనివారం తెలిపింది. ఇది తక్షణం అమలులో ఉంటుంది.

## ఉపాధి కల్పనలో 40 శాతం వృద్ధి



ఢిల్లీ: ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకం కింద వచ్చే పెట్టుబడుల ద్వారా ఉపాధి కల్పన 40 శాతానికి పైగా పెరుగుతుందని వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఆదివారం పీఎల్ఐ స్కీమ్‌ల సీఈఓలతో జరిపిన చర్చలో మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా కొత్త పెట్టుబడులు భారీగా వస్తున్నాయి. దేశంలో ప్రజలకు ఉపాధి అందించడానికి ఇది బాగా ఉపయోగపడుతుంది. ప్రస్తుతం 0.85 మిలియన్ల కొత్త ఉద్యోగాల సృఎష్టితో మొత్తం ఉద్యోగాల సంఖ్య 1.2 మిలియన్లకు చేరుకుంటుందని మంత్రి అన్నారు. పథకం ద్వారా వచ్చిన కంపెనీల నుంచి ఇప్పటికే సాధించిన రూ.9 లక్షల కోట్లతో పోలిస్తే ఉత్పత్తి కూడా రూ.11 లక్షల కోట్లు దాటే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా- పీఎల్ఐ రెండూ బొద్దు తాడును కలిగి ఉన్నాయి, వాటిని వేరు చేయడం అసాధ్యం అని గోయల్ అన్నారు. భారతదేశంలో మొదటిసారిగా వస్తువులను ఉత్పత్తి చేస్తున్న సంస్థలకు మద్దతును అందించడాన్ని కూడా మంత్రిత్వ శాఖ పరిశీలిస్తుందని చెప్పారు. దేశీయ ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించాలని, స్థానిక కొనుగోళ్లను మరింత పెంచాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రస్తుతం 1,300 యూనిట్లు పనిచేస్తున్న 14 రంగాల్లో పథకాలను అమలు చేస్తోంది.

## శ్రమ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలి

### ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్




ముంబై: భారత్‌లో అవసరమైన మేరకు ఉద్యోగాల కల్పన జరగడంలేదని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. దేశ జీడీపీ 7 శాతం వృఎద్ధిని సాధిస్తున్నప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో ఖాళీ పోస్టులకు దరఖాస్తుల సంఖ్యను బట్టి ఉద్యోగాల సృఎష్టి జరగడంలేదన్నారు. దీని పరిష్కారానికి ప్రభుత్వం శ్రమ-ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడంపై దృఎష్టి పెట్టాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఉన్నత స్థాయిలోని వారే అధిక ఆదాయాన్ని పొందుతునారని, దిగువ స్థాయిలో వినియోగం పెరుగుతున్నప్పటికీ కరోనా మహమ్మారి పూర్వ స్థాయి నుంచి కోలుకోలేకపోతున్నారని రాజన్ వివరించారు. భారీగా ఉపాధి కల్పన జరుగుతోందని అనుకోవచ్చు కానీ, తయారీ రంగంలో మరిన్ని అవకాశాలు ఉన్నాయని గుర్తించాలి. 7 శాతం వృఎద్ధి సాధిస్తున్న భారత ఆర్థికవ్యవస్థ తగిన్నని ఉద్యోగ అవకాశాలను అందిస్తోందా అని రాజన్ సందేహం వ్యక్తం చేశారు. ఎక్కువ పెట్టుబడితో కూడిన పరిశ్రమలు వేగంగా పెర్గుతున్నాయి. కానీ శ్రమతో కూడిన పరిశ్రమలు పెరగడంలేదని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వియత్నాం, బంగ్లాదేశ్‌లను ఉదహరించిన రఘురామ్ రాజన్.. ఆయా దేశాలు టెక్స్‌టైల్స్, లెదర్ వంటి శ్రమ ఆధారిత పరిశ్రమల నుంచి వృఎద్ధిని సాధిస్తున్నాయి. భారత్ కూడా ఈ విషయంలో అవకాశాలను వదులుకోకూడదని వెల్లడించారు.

## ఈక్విటీల్లోకి రికార్డు స్థాయిలో

### రూ.57 వేల కోట్ల ఎఫ్‌పీఐలు




ముంబై: భారత ఆర్థిక వ్యవస్థ ఇతర దేశాల కంటే వేగంగా వృఎద్ధి చెందుతున్న తరుణంలో విదేశీ పెట్టుబడిదారులు దేశీయ ఈక్విటీ మార్కెట్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. తాజాగా డిపాజిటరీల డేటా చూపించిన దాని ప్రకారం, విదేశీ పెట్టుబడిదారులు సెప్టెంబర్ 27 నాటికి భారతీయ ఈక్విటీల్లోకి రూ. 57,359 కోట్లను ఇన్వెస్ట్ చేశారు. ఇది గత తొమ్మిది నెలలతో పోలిస్తే, రికార్డు స్థాయిగా నిలిచింది. రూ. 66,135 కోట్ల పెట్టుబడులు పెట్టిన డిసెంబర్ 2023 తర్వాత ఇదే అత్యధిక నికర ఇన్‌ఫ్లో. ప్రస్తుత సెప్టెంబర్ నెలలో ఎఫ్‌పీఐలు భారీ పెట్టుబడులు పెట్టడానికి ప్రధాన కారణం అమెరికా ఫెడరల్ రిజర్వ్ తన వడ్డీ రేట్లను తగ్గించడంతో తమ డబ్బులను భారత ఈక్విటీ మార్కెట్లోకి తరలించారు. మొత్తంగా డేటాను చూసినట్లయితే, ఈక్విటీలలో ఎఫ్‌పీఐ పెట్టుబడులు 2024లో రూ. 1 లక్ష కోట్ల మార్కును అధిగమించాయి. ప్రపంచ వడ్డీ రేటు సడలింపు, బలమైన ఫండమెంటల్స్‌తో భారత్ ముందుకు సాగుతున్న తరుణంలో రాబోయే రోజుల్లో ఇన్‌ఫ్లోలు బలంగా ఉండే అవకాశం ఉంది. అయితే, ముఖ్యంగా ద్రవ్యోల్బణం నిర్వహణ, లిక్విడిటీకి సంబంధించి ఆర్‌బీఐ నిర్ణయాలు ఈ ఊపును కొనసాగించడంలో కీలకం అవుతాయని స్మాల్‌కేస్ మేనేజర్, రీసెర్చ్ అనలిస్ట్ సంస్థ గోల్ఫై వ్యవస్థాపకుడు అండ్ సీఈఓ రాబిన్ ఆర్య అన్నారు. సెప్టెంబర్ 18న అమెరికా ఫెడ్ 50 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ రేటును తగ్గించడంతో భారతీయ మార్కెట్లో లిక్విడిటీ పెరుగుతుంది.

# ఏఐసీసీ చీఫ్ ఖర్గేకు అస్వస్థత

● వేదికపై ప్రసంగిస్తూ స్పృహ తప్పిపడిపోబోయిన ఖర్గే ● అస్వస్థతకు గురైన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్
● మంచినీరు తాగిన తర్వాత ప్రసంగాన్ని కొనసాగించిన మల్లికార్జున ఖర్గే ● మోడీని గద్దె దించే వరకు చనిపోనని శపథం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్లో ఎన్నికలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కరువా జిల్లాలో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అనూహ్య సంఘటన చోటు చేసుకొంది. ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వేదికపై అస్వస్థతకు గురయ్యారు. ప్రసంగిస్తున్న సమయంలో అదుపు తప్పి పడిపోబోయారు. దీంతో అక్కడున్న నేతలు ఆయన్ను పట్టుకున్నారు. వెంటనే ఖర్గేకు నీరు తాగించారు. అయినప్పటికీ ఆయన ప్రసంగాన్ని మాత్రం ఆపలేదు. పార్టీ నేతలు ఆయనను పట్టుకుని నిలబడి ఉండగా.. ప్రసంగాన్ని కొనసాగించారు. "జమ్మూకశ్మీర్కు రాష్ట్ర హోదాను తిరిగి తీసుకువస్తాం. అందుకోసం పోరాడుతూనే ఉంటాం. ఎనిమిది పదుల వయసులో ఉన్న నేను.. అప్పుడే చనిపోను. మోడీ సర్కార్ను గద్దె దించే వరకు అలసిపోను.

అప్పటివరకు బతికే ఉంటా" అని వ్యాఖ్యానించారు.

ఆయన అస్వస్థతకు గురైన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. వెంటనే పార్టీ అగ్రనాయకత్వం జమ్మూకశ్మీర్ నేతలను అప్రమత్తంగా ఉండమని సూచించింది. అనంతరం వైద్య బృందానికి సమాచారం అందించారు. కాగా.. జమ్మూకశ్మీర్లోని ఏడు జిల్లాల పరిధిలో తొలిదశ కింద 24 శాసనసభ నియోజకవర్గాలకు జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 61 శాతం పోలింగు నమోదు అయింది. రెండోవిడత పోలింగ్ ఆరు జిల్లాల్లోని 26 నియోజకవర్గాల్లో పూర్తికాగా.. మూడో విడత పోలింగ్కు జమ్మూకశ్మీర్ సిద్ధమైంది.





# క్రియేట్ ఇన్ ఇండియాలో భాగస్వాములు కండి

● నూతన ఉత్పత్తుల తయారీదారులకు ప్రధాని మోడీ పిలుపు ● మన్కీ బాత్ 114వ ఎపిసోడ్లో మోడీ భావోద్వేగం ● ఈ కార్యక్రమం సామూహిక శక్తిని ప్రదర్శించే ప్రత్యేక వేదికగా మారింది ● భారత్ 20వేల భాషలకు పుట్టిల్లు.. పరిరక్షణకు చర్యలు: మోడీ

ఢిల్లీ: మనసులో మాట పేరుతో ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్కీ బాత్' కార్యక్రమం 114వ ఎపిసోడ్లో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రజల ప్రయత్నాలు, స్ఫూర్తిదాయకమైన కథనాలను మన్కీబాత్ చూపిస్తోందన్నారు. కార్యక్రమం ప్రారంభించి పదేళ్లు పూర్తిచేసుకోనున్న నేపథ్యంలో ఈ ఎపిసోడ్ తనకు భావోద్వేగమైనదని అన్నారు. సామూహిక శక్తిని ప్రదర్శించే ప్రత్యేక వేదికగా ఈ కార్యక్రమం మారిందన్నారు. మన్కీ బాత్ ద్వారా తన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మీడియాకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. సాధారణంగా మసాలాలేని కంటెంట్ను ప్రజలు పట్టించుకోరనే అభిప్రాయం ఉండేదని.. ఈ కార్యక్రమం ఆ అభిప్రాయాన్ని మార్చేసిందన్నారు. స్ఫూర్తిమంతమైన కథలు, ప్రేరణ పొందే వ్యక్తులకు సంబంధించిన విషయాలు తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. నీటి నిర్వహణ గురించి ప్రస్తావించిన ఆయన.. నీటి సంరక్షణ ఎంత కీలకమో వర్షాకాలం సూచిస్తుందని చెప్పారు. నీటి సంరక్షణకు అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. 20 వేల భాషలకు భారత్ పుట్టినిల్లు అని పేర్కొన్న మోదీ.. దేశంలో వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. 'తల్లి పేరిట మొక్క' కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమం పేరిట గుజరాత్లో 15 కోట్లకు పైగా, యూపీలో 26 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు తెలిపారు. క్రియేట్ ఇన్ ఇండియాలో భాగస్వామ్యం కావాలని నూతన ఉత్పత్తుల తయారీదారులకు మోదీ పిలుపునిచ్చారు. భారత్ ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న 'మేకిన్ ఇండియా' కార్యక్రమం ప్రారంభించి పదేళ్లు పూర్తయిందని ప్రధాని అన్నారు. దీంతో ప్రతి రంగంలోనూ ఎగుమతులు పెరిగాయని, విదేశీ సంస్థాగత మదుపరులను ఆకర్షించడంలో ప్రభుత్వం పురోగతి సాధించిందన్నారు. ఈ కార్యక్రమం స్థానిక తయారీదారులకు సాయపడిందన్నారు. రానున్న పండుగ సీజన్లో స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రజలకు పిలుపిచ్చారు. ఇదిలా ఉండగా.. 2014 అక్టోబర్ 3న తొలిసారి 'మన్కీ బాత్' కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.

**యువతకు 25 సవాళ్లు :** మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తిని ప్రతిబింబించేలా టస్సార్ సిల్క్ను సంరక్షించేందుకు 50కి పైగా స్వయం సహాయక బృందాలు పనిచేస్తున్నాయని మోడీ తెలిపారు. రానున్న పండుగల సీజన్లో మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రధాని ప్రజలను కోరారు. కొత్త రంగాల ఆవిర్భావంతో ఉద్యోగాల స్వభావాలు మారుతున్నాయని, యువతలో ప్రతిభను, సృజనాత్మకతను పెంపొందించేందుకు సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ 'క్రియేట్ ఇన్ ఇండియా' అనే థీమ్ కింద 25 సవాళ్లను ప్రారంభించిందని మోడీ తెలిపారు. వేవ్స్ ఇండియా.ఓఆర్జీ వెబ్ సైట్ను సందర్శించడం ద్వారా దేశంలోని యువత ఈ ఛాలెంజ్లో పాల్గొనాలని ప్రధాని కోరారు.

**స్వచ్ఛ భారత్కు పదేళ్లు :** ఈ ఏడాది అక్టోబర్ 2వ తేదీకి స్వచ్ఛ భారత్ కార్యక్రమం పదేళ్లు పూర్తి చేసుకుంటుందని మోదీ తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముందుకెళ్తోందన్నారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టించే దిశగా స్వచ్ఛ భారత్ కార్యక్రమం రూపుదిద్దుకుందని చెప్పారు. స్వచ్ఛ భారత్ మిషన్ను ప్రజా ఉద్యమంగా మార్చిన వారిని మోదీ అభినందించారు. తన జీవితాన్ని స్వచ్ఛతకు అంకితం చేసిన మహాత్మాగాంధీకి మోదీ నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం కోసం ప్రకృతికి ధన్యవాదాలు పేరుతో ఉత్తరాఖండ్లోని ఝాలా గ్రామం యువత చూపిన చొరవను ప్రధాని ప్రశంసించారు. పుదుచ్చేరిలోని మహే ప్రాంతంలో బీచ్ చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రం చేసే బృందానికి నాయకత్వం వహించిన మహిళ రమ్యను ప్రధాని అభినందించారు. కేరళలోని కోజికోడ్లో నివసిస్తున్న 74 ఏళ్ల సుబ్రమణియన్ 23 వేలకు పైగా కుర్చీలను మరమ్మతులు చేసి వాటిని మళ్లీ ఉపయోగించుకునేలా చేసిన కృషిని ప్రధాని ప్రశంసించారు. పరిశుభ్రత ప్రచారంలో పాల్గొనాలని మోదీ ప్రజలను కోరారు. మెగా ప్లాంటేషన్ డ్రైవ్లో భాగంగా ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాలు నిర్దేశించిన లక్ష్యానికి మించి మొక్కలు నాటి సరికొత్త రికార్డు సృష్టించాయని కొనియాడారు.

**తెలుగోడికి ప్రశంసలు:** పర్యావరణ పరిరక్షణ ప్రచారంలో దేశంలోని వేలాది పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఎంతో ఉత్సాహంతో పాల్గొంటున్నారని మోదీ చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కేఎన్ రాజశేఖర్ను ఉదాహరణగా చెబుతూ రాజశేఖర్ 1500కు పైగా మొక్కలు నాటారని.. పర్యావరణ పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తమిళనాడులోని మధురై నివాసి సుభాశ్రీ అరుదైన, ఉపయోగకరమైన మూలికలతో కూడిన అద్భుతమైన ఉద్యానవనాన్ని రూపొందించినందుకు ఆయన కృషిని ప్రశంసించారు. నీటి సంరక్షకోసంబుందేల?ండ్ ప్రాంతంలోని మహిళలు చేస్తున్న కృషిని ప్రశంసించారు. మహిళలు ఇసుకను బస్తాల్లో నింపి చెక్డ్యామ్ నిర్మించి వర్షపు నీరు వృథాగా పోకుండా అడ్డుకున్నారని తెలిపారు. ప్రధాన మంత్రి తన మన్ కీ బాత్లో ఇటీవల అమెరికా పర్యటనలో సుమారు 300 పురాతన కళాఖండాలను తిరిగి పొందడం గురించి ప్రస్తావించారు.

## పుణె మెట్రో సెక్షన్ను ప్రారంభించిన మోడీ

● జిల్లా కోర్టు, స్వర్గేట్ మధ్య భూగర్భ మార్గం
● అర్బన్ ట్రాన్స్పోర్టేషన్ గణనీయంగా పెరుగుతుందని అంచనా
● రూ.11,200 కోట్ల విలువ చేసే ప్రాజెక్టుల శంకుస్థాపన, జాతికి అంకింతం చేసిన మోడీ



పుణె: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారంనాడు న్యూ పుణె మెట్రో సెక్షన్ను ప్రారంభించారు. జిల్లా కోర్టు, స్వర్గేట్ మధ్య నడిచే ఈ భూగర్భ మార్గంతో పుణెలోని అర్బన్ ట్రాన్స్పోర్టేషన్ గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. దీనితో పాటు రూ.11,200 కోట్ల విలువ చేసే ప్రాజెక్టుల శంకుస్థాపన చేసి, జాతికి అంకితం చేశారు. వర్చువల్ తరహాలో వీటిని ప్రధాని ప్రారంభించారు. షెడ్యూల్ ప్రకారం ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధాని హాజరుకావాల్సి ఉన్నప్పటికీ వాతావరణ ప్రతికూలత దృష్ట్యా ఆయన పర్యటన రద్దయింది. మహాయుతి సర్కార్ విజన్ ప్రధాని వర్చువల్ తరహాలో ప్రారంభోత్సవాల సందర్భంగా మహారాష్ట్రలోని అధికార మహాయుతి ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. పుణెలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సామర్థ్యం కూడా పెంచుకుంటూపోవాలని, పుణె పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ను ఆధునీకరించినప్పుడే ఇది సాధ్యమవుతుందన్నారు. ఇందుకోసం తాము అనేక చర్యలు చేపట్టామన్నారు. సిటీ పెరుగుతున్నప్పుడు ఏరియాల మధ్య అనుసంధానం కూడా గణనీయంగా పెరగాలన్నారు. ఇదే విజన్తో మహాయుతి ప్రభుత్వం రేయింబవళ్లు శ్రమిస్తోందని చెప్పారు. మహారాష్ట్రలో ఇంతకముందు అధికారంలో ఉన్న మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ప్రభుత్వం కనీసం ఒక మెట్రో పిల్లర్ను కూడా నిర్మించలేకపోయిందన్నారు. కానీ తమ ప్రభుత్వం పుణెలో మెట్రో నెట్వర్క్ను నిర్మించిందన్నారు. సోలార్ ఎయిర్పోర్ట్ అప్గ్రేడేషన్పై మాట్లాడుతూ, ఇవాళ విఠల్ భగవానుని ఆశీస్సులతో నేరుగా షోలాపూర్కు ఎయిర్ కనెక్టివిటీ కల్పించేందుకు ఎయిర్పోర్ట్ అప్గ్రేడేషన్ పూర్తయిందని చెప్పారు.

# అమిత్ షాతో రామ్మోహన్ నాయుడు భేటీ

● విమానయాన రంగం పురోగతిపై సమీక్ష ● ఎయిర్ పోర్టుల్లో మౌలిక సదుపాయాలు కల్పనపై చర్చలు ● విమానాశ్రయాల అభివృద్ధికి ఎన్డీయే సర్కార్ కట్టుబడి ఉంది ● అన్ని రాష్ట్రాలకు కనెక్టివిటీ పెంచేందుకు కృషి చేస్తున్నాం : రామ్మోహన్ నాయుడు

ఢిల్లీ: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ఢిల్లీలో ఆదివారం భేటీ అయ్యారు. భారత విమానయాన రంగం పురోగతిపై సమీక్షించడంతోపాటు ఎయిర్ పోర్టుల్లో మౌలిక సదుపాయాలు కల్పనపై అమిత్ షాతో చర్చించారు. దేశవ్యాప్తంగా కొత్త విమానాశ్రయాలుల అభివృద్ధి, పాత వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించడంపై ఎన్డీయే సర్కార్ ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని రామ్మోహన్ అన్నారు. ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. "విమానాశ్రయాల అభివృద్ధికి ఎన్డీయే సర్కార్ కట్టుబడి ఉంది. కేంద్ర బడ్జెట్లో అందుకు తగినట్లే నిధుల కేటాయింపులు జరిపాం. అన్ని రాష్ట్రాలకు కనెక్టివిటీ పెంచేందుకు కృషి చేస్తున్నాం. అమిత్ షాతో కూడా ఇదే అంశంపై చర్చించా. ఎయిర్ పోర్టుల్లో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లా. సమస్యల పరిష్కారానికి ఆయన సానుకూలత వ్యక్తం చేశారు" అని రామ్మోహన్ పేర్కొన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి కృషి. శ్రీకాకుళంలో మత్స్యకారుల అభివృద్ధి కి కట్టుబడి ఉన్నామని రామ్మోహన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్లో ఓ పోస్ట్ చేశారు. ఏడాదిలో నిర్మించనున్న కొత్త మూలపేట ఓడరేవు స్థానికంగా ఉన్న మత్స్యకారుల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కాగా.. ఇటీవల విశాఖ రాయపూర్ (దుర్గ్ ) వందేభారత్ రైల్ను ఈరోజు(సోమవారం) విశాఖ రైల్వేస్టేషన్లో జెండా ఊపి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. సెప్టెంబర్ 20 నుంచి రెగ్యులర్ సర్వీస్గా విశాఖ - రాయ్పూర్ వందే భారత్ ట్రైన్ తిరుగుతోంది. ఈ సందర్భంగా



రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... విశాఖపట్నం మీదుగా నడిచే నాల్గో వందే భారత్ రైలు ఇదని చెప్పారు. రైల్వే ద్వారా దేశంలో అభివృద్ధి శరవేగంగా జరిగిందని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

## హెజ్బొల్లా మరో కీలక నేత హతం

### వైమానిక దాడిలో నబిల్ కౌక్ మృతి



జెరూసలేం: లెబనాన్ ఉగ్రవాద గ్రూపు హెజ్బొల్లాకు మరోసారి ఊహించని దెబ్బతగిలింది. ఇజ్రాయెల్ ఆదివారం జరిపిన వైమానిక దాడుల్లో హెజ్బొల్లా కీలక నేత నబిల్ కౌక్ హతమయ్యాడు. హెజ్బొల్లా సెంట్రల్ కౌన్సిల్లో డిప్యూటీ హెడ్గా ఉన్న నబిల్ మృతిచెందినట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. అయితే, దీనిపై హెజ్బొల్లా నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. గత కొన్ని వారాలుగా లెబనాన్పై ఇజ్రాయెల్ కొనసాగిస్తోన్న భీకరదాడుల్లో హెజ్బొల్లాకు చెందిన పలువురు సీనియర్ కమాండర్లు హతమైన విషయం తెలిసిందే. శుక్రవారం జరిగిన దాడిలో హెజ్బొల్లా అధినేత హసన్ నస్రల్లా (64) మృతి చెందడం ఆ గ్రూపునకు శరాఘతంలా మారింది. ఈ తరుణంలోనే మరో కీలక నేతను కోల్పోవడం గమనార్హం. నబిల్ 1995 నుంచి 2010 వరకు సౌత్ లెబనాన్లోని హెజ్బొల్లా మిలటరీ కమాండర్గా పనిచేశాడు. 2020లో అతడిపై అమెరికా ఆంక్షలు విధించింది.

# పాక్కు 'ఐఎంఎఫ్' కంటే పెద్ద సాయం చేసేవాళ్లం

● కశ్మీర్ లో ప్రజాస్వామ్యం నెలకొనడం పాక్ కు ఇష్టం లేదు ● అంతర్జాతీయ వేదికలపై పాకిస్తాన్ ఒంటరిగా మారింది : కేంద్రమంత్రి రాజ్నాథ్ సింగ్



శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల వేళ.. పాకిస్థాన్ పై కేంద్ర మంత్రి రాజ్నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ ఆ దేశం భారత్తో సత్సంబంధాలు కొనసాగించి ఉంటే.. అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి ఇస్లామాబాద్ కోరిన దానికంటే పెద్ద ఆర్థిక ప్యాకేజీని ఇచ్చేవాళ్లమని తెలిపారు. 'ఆర్టికల్ 370' రద్దుపై అక్కసుతో జమ్మూకశ్మీర్లో ఉగ్రవాదాన్ని పునరుద్ధరించేందుకు యత్నిస్తోందని, ఇక్కడ ప్రజాస్వామ్యం వేళ్లూనుకోవడం ఆ దేశానికి ఇష్టం లేదన్నారు."2014-15లో జమ్మూకశ్మీర్ అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. అది ఇప్పుడు రూ.90 వేల కోట్లకు చేరుకుంది. ఐఎంఎఫ్ నుంచి పాకిస్థాన్ కోరిన బెయిల్అవుట్ ప్యాకేజీ కంటే ఇది చాలా పెద్దది. ఒకవేళ ఆ దేశం స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించి ఉంటే ఐఎంఎఫ్ కంటే ఎక్కువే సాయం చేసేవాళ్లం" అని గురేజ్ నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో కేంద్రమంత్రి రాజ్నాథ్ పేర్కొన్నారు. పొరుగు దేశం చాలా కాలంగా ఆర్థిక సాయాన్ని దుర్వినియోగం చేస్తోందని, తన భూభాగంపై ఉగ్ర కార్యకలాపాల నిర్వహణకు ఇతర దేశాల నుంచి డబ్బు అడుగుతోందని ఆరోపించారు.భారత్కు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాకిస్థాన్..

ఇప్పుడు దాని మిత్రదేశాలు కూడా వదిలేయడంతో అంతర్జాతీయ వేదికలపై ఒంటరిగా మారిందన్నారు. పాక్కు మద్దతుగా నిలిచే తుర్కియే ఇటీవల యూఎన్జీఏలో కశ్మీర్ గురించి ప్రస్తావించలేదని గుర్తుచేశారు. భారత్పై ఎవరైనా దాడికి పాల్పడితే వాళ్ల భూభాగంపైనే గుణపాఠం చెబుతామన్నారు. ఇదిలా ఉండగా.. తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పాకిస్థాన్.. సాయం కోసం ఐఎంఎఫ్ వంటి సంస్థలను వేడుకుంటున్న విషయం తెలిసిందే.

## నస్రల్లా ఆచూకీ చెప్పింది ఇరాన్ గూఢచారే..!

### ఫ్రాన్స్ పత్రిక కథనం



పారిస్ : హెజ్బొల్లా చీఫ్ నస్రల్లా ఎక్కడున్నారో కచ్చితమైన లొకేషన్ను ఇరాన్కు చెందిన ఓ గూఢచారే ఇజ్రాయెల్కు ఉప్పందించాడట. ఈ విషయాన్ని ఫ్రాన్స్ పత్రిక ఫ్రాన్స్ పత్రిక ల పర్షియన్ కథనంలో పేర్కొంది. అతడు బీరుట్ శివార్లలోని దహియాలో హెజ్బొల్లా అండర్గ్రౌండ్ హెడ్ క్వార్టర్స్లో ఉన్నారని.. చాలా మంది టాప్ కమాండర్లతో భేటీ అవుతున్నట్లు సదరు వేగు పేర్కొన్నాడట. దీంతో ధ్రువీకరించుకొన్న ఇజ్రాయెల్ నేరుగా ప్రధాన స్థావరంపై దాడి చేసి మొత్తం భవనాలను పేల్చేసింది. ఇంటెలిజెన్స్లో తీవ్ర కృషి..2006లో హెజ్బొల్లా నుంచి ఎదురు దెబ్బలు తగలడంతో ఇజ్రాయెల్ నిఘా వ్యవస్థ అభివృద్ధిపై పనిచేసింది. నాడు ఐరాస చొరవతో యుద్ధం ఆపిన హెజ్బొల్లా.. ఆయుధ పరంగా బలపడటం మాత్రం ఆపలేదు. కొన్ని దశాబ్దాల్లోనే భారీ సాయుధ శక్తిగా ఎదిగింది. మరోవైపు ఇజ్రాయెల్కు చెందిన యూనిట్ 8200 సిగ్నల్ ఇంటెలిజెన్స్లో బలమైన శక్తిగా మారింది.2008లో మొస్సాద్ తొలిసారి హెజ్బొల్లా టాప్ ఆపరేటివ్ ఇమాద్ ముగ్నియాహ్ను సిరియాలో అంతం చేసింది. 2020లో ఇరానీ కమాండర్ ఖాసిం సులేమానీ సమాచారం అమెరికా దళాలకు అందిజేసింది కూడా మొస్సాదే. జులైలో హెజ్బొల్లా టాప్ కమాండర్ ఫాద్ షుక్రును అంతం చేసింది. ఇటీవల రద్వాన్ ఫోర్స్ కమాండర్ ఇబ్రహీం అకిల్ను మట్టుబెట్టింది. ఆ తర్వాత హెజ్బొల్లా కమాండ్ వ్యవస్థ మొత్తాన్ని పేకమేడ వలే కూల్చేసింది.ఇజ్రాయెల్ వైమానిక దాడిలో హెజ్బొల్లా అధినేత హసన్ నస్రల్లా శుక్రవారం జరిగిన దాడిలో మృతిచెందారు. ఈ విషయాన్ని అటు ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్), ఇటు హెజ్బొల్లా ధ్రువీకరించాయి. "హసన్ నస్రల్లా ఇక ఈ ప్రపంచాన్ని భయభ్రాంతులకు గురి చేయలేడు" అని ఐడీఎఫ్ 'ఎక్స్' వేదికగా పేర్కొంది. "మా సందేశం సుస్పష్టం. మా పౌరులను ఎవరైతే బెదిరిస్తారో.. వారిని మట్టుబెట్టడం మాకు బాగా తెలుసు. వారు ఏ దిక్కున దాక్కున్నా వదిలిపెట్టం" అని ఇజ్రాయెల్ సైన్యాధిపతి లెఫ్టినెంట్ జనరల్ హెర్జి హలెవీ తెలిపారు.

# తమిళనాడు డిప్యూటీ సీఎంగా ఉదయనిధి

● మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించిన సీఎం స్టాలిన్ ● నలుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం ● జైలు నుంచి బెయిల్ పై వచ్చి మంత్రిగా ప్రమాణం చేసిన సెంథిల్ బాలాజీ ● ఉదయనిధికి డిప్యూటీ బాధ్యతలు అప్పగించడంపై విపక్షాల విమర్శలు



చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ప్రమోట్ అయ్యారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా మొత్తం నలుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. మనీలాండరింగ్ కేసులో జైలుకు వెళ్లి, రెండు రోజుల క్రితం బెయిల్పై

విడుదలైన మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ మంత్రిగా ప్రమాణం చేసిన వారిలో ఉన్నారు. గోవి చెళియన్, ఎస్ఎం నాజర్, ఆర్.రాజేంద్రన్లు కూడా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సెంథిల్కు విద్యుత్, ఎక్సైజ్ శాఖ, చెళియన్కు విద్యాశాఖ, నాజర్కు మైనార్టీ వ్యవహారాలు,

రాజేంద్రన్కు పర్యటక శాఖలను కేటాయించారు. పునర్వ్యవస్థీకరణ సాధారణమైనదే అయినప్పటికీ.. ఈసారి ఉదయనిధికి డిప్యూటీ సీఎంగా బాధ్యతలు అప్పగించడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే రాష్ట్ర మంత్రిగా కొనసాగుతున్న ఉదయనిధి ఆదివారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మళ్లీ ప్రమాణం చేయలేదు. ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి బయలుదేరేముందు మీడియాతో మాట్లాడిన ఆయన ఉపముఖ్యమంత్రి అనేది తనకు అది పదవి కాదని, ఓ పెద్ద బాధ్యతని అన్నారు. మరోవైపు ఉదయనిధికి డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించడంపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి.

# హర్యానాలో కొత్త ట్రెండ్

● కాంగ్రెస్ సభల్లో పాకిస్థాన్ అనుకూల నినాదాలు ● బుజ్జగింపు రాజకీయాలతో కాంగ్రెస్ కు కంటిమీద కునుకులేకుండా పోయింది ● మరో మూడు తరాలు మారినా ఆర్టికల్ 370 వెనక్కి తీసుకురాలేరు ● హర్యానాలోని బాద్షాపూర్ ర్యాలీలో అమిత్ షా

చండీగఢ్: కాంగ్రెస్ సభల్లో పాకిస్థాన్ అనుకూల నినాదాలు పెరుగుతున్నాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆరోపించారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న వేళ కాంగ్రెస్ నిర్వహిస్తున్న సభల్లో ఈ నినాదాలు లేవనెత్తుతున్నారని ఆయన అన్నారు. బాద్షాపూర్ ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ పై విరుచుకుపడ్డారు. బుజ్జగింపు రాజకీయాలతో కాంగ్రెస్కు కంటిమీద కునుకులేకుండా పోయిందన్నారు. "హరియాణాలో కొత్త ట్రెండ్ చూస్తున్నాను. హతిన్ నుంచి థానేసర్ వరకు, థానేసర్ నుంచి పల్వల్ వరకు పాకిస్థాన్ అనుకూల నినాదాలు మిన్నంటుతున్నాయి. మీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇలాంటి నినాదాలు చేస్తుంటే ఎందుకు మాట్లాడకుండా ఉంటున్నారు?" అని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. ఆర్టికల్ 370కి తిరిగి తీసుకొస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీపై ఆయన విరుచుకుపడ్డారు. " కశ్మీర్ మనదా? కాదా? ఆర్టికల్ 370ని తొలగించడం సరైందా? కాదా? ఈ ఆర్టికల్ను మళ్లీ తీసుకొస్తామని ాంగ్రెస్, రాహుల్లు చెబుతున్నారు. రాహుల్ గాంధీ.. మరో మూడు తరాలు మారినా దీన్ని వెనక్కి తీసుకురాలేవు. కశ్మీర్ను రక్షించేందుకు హరియాణా యువత ఎన్నో త్యాగాలు చేశారు.




వాటిని వృథా కానివ్వం" అని అమిత్ షా అన్నారు. కాగా.. హరియాణాలో అక్టోబరు 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా.. ఫలితాలు 8న విడుదల కానున్నాయి. ఈ ఎన్నికల్లో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్, భాజపాతో సహా ఇతర పార్టీలు తీవ్రంగా యత్నిస్తున్నాయి.

## సిరియాపై అమెరికా దాడి

# 37 మంది టెర్రరిస్టులు హతం



టెల్ అవీవ్: లెబనాన్లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ వరుస దాడులు తదితర పరిణామాలతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికంగా యుద్ధ విస్తరణ భయాల నడుమ.. అటు సిరియాలో అమెరికా బలగాలు విరుచుకుపడ్డాయి. వైమానిక దాడుల్లో 37 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు అగ్రరాజ్యం ప్రకటించింది. వారంతా ఇస్లామిక్ స్టేట్ గ్రూప్, అలై?దా అనుబంధ సంస్థలకు చెందినవారేనని తెలిపింది. మృతుల్లో ఇద్దరు కీలక నేతలు కూడా ఉన్నట్లు వెల్లడించింది. అలై?దా అనుబంధ 'హుర్రాస్ అల్-దీన్ గ్రూప్'నకు చెందిన ఓ సీనియర్ ఉగ్రవాదితోపాటు మరో ఎనిమిది మందిని లక్ష్యంగా చేసుకుని వాయువ్య సిరియాపై దాడి చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఆ సీనియర్ ఉగ్రవాది స్థానికంగా సైనిక కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించింది. అంతకుముందు మధ్య సిరియాలోని ఐసిస్ శిక్షణ స్థావరంపై పెద్దఎత్తున వైమానిక దాడి నిర్వహించి.. 28 మంది ఉగ్రవాదులను అంతమొందించినట్లు చెప్పింది.తాజా దాడులతో ఐసిస్ శక్తిసామర్థ్యాలు దెబ్బతిన్నట్లు అమెరికా ప్రకటించింది.

# అక్టోబర్ 2న ప్రశాంత్ కిశోర్ కొత్త పార్టీ

● కొత్త పార్టీకి నాయకుడుని నేను కాదు ● ప్రజలే నాయకత్వ బాధ్యతలు స్వీకరించాల్సిన సమయం వచ్చింది
● రెండేళ్లు 2022 అక్టోబర్ 2న జన్ సురాజ్ పేరుతో పాదయాత్ర ప్రారంభిన ప్రశాంత్ కిశోర్
● రాజకీయాలతో సంబంధం లేకుండా యాత్ర కొనసాగుతుందన్న పీకే

ఢిల్లీ: ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కొత్తగా రాజకీయ పార్టీ స్థాపించేందుకు సిద్ధమయ్యారు. పార్టీ పేరు, నాయకత్వం సహా ఇతర వివరాలను అక్టోబర్ 2న ప్రకటిస్తామని వెల్లడించారు. అయితే, పార్టీ నాయకత్వం మాత్రం తన చేతుల్లో ఉండదన్నారు. రెండేళ్ల క్రితం తాను చేపట్టిన జన్ సురాజ్ యాత్రనే రాజకీయ పార్టీగా మలచనున్నట్లు ఇటీవల పేర్కొన్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది జరిగే బిహార్ శాసనసభ ఎన్నికల్లోనే పార్టీ తరఫున పోటీ చేస్తామని చెప్పారు. "ఆ పార్టీకి నేనెప్పుడూ నాయకుడిని కాదు. అలా ఉండాలనీ నేనెప్పుడూ అనుకోలేదు. ప్రజలే నాయకత్వ బాధ్యతలు స్వీకరించాల్సిన సమయమిది" అని ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. అక్టోబర్ 2, 2022న జన్ సురాజ్ పేరుతో ప్రారంభించిన యాత్ర రెండేళ్లు పూర్తి చేసుకోనున్న సందర్భంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన ఆయన.. కొత్త పార్టీ నాయకత్వ వివరాలను అక్టోబర్ 2న వెల్లడిస్తానని తెలిపారు.మూడు ప్రధాన ఉద్దేశాలతోనే జన్ సురాజ్ యాత్ర చేపట్టినట్లు ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు వారి చిన్నారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, తప్పుదోవ పట్టించే నాయకుల ఒత్తిడికి తలొగ్గి ఓట్లు



వేయకుండా అవగాహన కల్పించడంతోపాటు రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించే ఉద్దేశంతో ప్రతి గ్రామంలో పర్యటించాలని ఈ యాత్ర చేపట్టానన్నారు. ఇప్పటివరకు 60శాతం యాత్ర పూర్తయిందని, తదుపరి కొనసాగుతుందన్నారు. అయితే, రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ఈ యాత్ర కొనసాగుతుందన్న ఆయన.. పార్టీకి నాయకత్వ బాధ్యతలు మాత్రం తాను వహించడం లేదన్నారు.

# హైడ్రా ఆక్రందనలు

- కూల్చివేతలు తట్టుకోలేక ఆత్మహత్యలు
- సంబంధం లేదంటున్న అధికారులు











**హైడ్రా... హైడ్రా... హైదరాబాద్‌లో ఆక్రమణదారులను గడగడలాడిస్తున్న హైడ్రా పొలిటికల్ రణానికి ఇంధనమవుతుందా? ముంపు నుంచి రాజధాని నగరాన్ని కాపాడుతుందని హైడ్రాను కాంగ్రెస్ వెనకేసుకొస్తుంటే.. ప్రజల ఆస్తులను ధ్వంసం చేస్తోందని హైడ్రాపై మండిపడుతున్నాయి విపక్ష పార్టీలు బీఆర్ఎస్, బీజేపీ. ఇంతకీ ఎవరు కరెక్ట్. హైడ్రా ఎవరి పొలిటికల్ మైలేజ్ పెంచుతుంది..? ఎవరిని డేంజర్లో పడేస్తోంది. ఓవరాల్గా హైడ్రాపై ప్రజలేమనుకుంటున్నారా? తెలంగాణ రాజకీయానికి కేంద్ర బిందువుగా మారిపోయింది అభం శుభం తెలియని అమాయకులు చెరువు లోపల ఉన్నది తెలియక ఇల్లు కట్టుకొని నివాసముంటున్న పరిస్థితుల్లో హైడ్రా పేరుతో బుల్డోజర్ పేదవాడి గూడును కూల్చివేసింది. గూడు చెదిరి గుండె పగిలి రోడ్డున పడే పరిస్థితి రావడంతో అహంకారాలతో అమాయక జనం గుండెలు బాదుకుంటున్నారు. హైడ్రా పెద్దోళ్ల జోలికి వెళ్లకుండా పేదోడి గూడును కూల్చివేసి తమ గుండెపై గుణపం దించుతున్నారని ఆందోళన వ్యక్తం అవుతుంది. హైడ్రా. తెలంగాణాలోని మూడు ప్రధాన పార్టీలిప్పుడు మైలేజీ కోసం హైడ్రా చుట్టూనే పావులు కదుపుతున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్తోపాటు ప్రతిపక్షాలు బీఆర్ఎస్, బీజేపీ కూడా హైడ్రా కేంద్రంగానే పొలిటికల్ యాక్టివిటీస్‌ను పెంచుతున్నాయి. ఓవరాల్‌గా చెప్పాలంటే రాష్ట్రంలో మిగిలిన పొలిటికల్ యాక్టివిటీస్ అన్నీ హైడ్రాతో పక్కకెళ్లిపోయాయి. ఇప్పుడు రాజకీయ పార్టీలకు హైడ్రానే ఆయుధంగా మారింది.**

విపక్షాన్ని ఇబ్బంది పెట్టాలనుకున్న అధికార పార్టీ హైడ్రాను అస్త్రంగా ప్రయోగిస్తుంటే అధికార పక్షాన్ని టార్గెట్ చేసేందుకు విపక్షాలు కూడా హైడ్రానే ఆయుధంగా మల్చుకుంటున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూకుడు హైడ్రా ఆక్రమణదారుల్లో గుబులు పుట్టిస్తుండగా, కూల్చివేతలతో నష్టపోయిన వారికి అండగా నిలుస్తూ ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమవుతున్నాయి బీజేపీ, బీఆర్ఎస్. ఇందులోనూ బీజేపీ తరఫున ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్ తరఫున మాజీమంత్రి హరీశ్ దూకుడు పెంచుతూ హైడ్రాను టార్గెట్ చేస్తున్నారు. ఇలా మూడు పార్టీలు హైడ్రానే ఇప్పుడు కేంద్ర బిందువుగా మారడం చర్చనీయాంశంగా మారుతోంది.

**భవిష్యత్‌పై భరోసా కోసం :** హైదరాబాద్ నగరంలో ముంపు లేకుండా ఉండాలంటే చెరువులు, నాలాల ఆక్రమణలు తొలగించాలని భావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రాకు ప్రాణం పోశారు. తొలుత కొద్ది మంది పెద్దల ఆక్రమణలను తొలగించి ప్రజల్లో మంచి ఇమేజ్ సంపాదించుకున్న హైడ్రా%ౌ% కాలక్రమంలో బడుగులు, మధ్య తరగతి వారి ఇండ్లనూ కూల్చివేస్తుండటంతో విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది. కానీ, భవిష్యత్‌పై భరోసా కోసం హైడ్రా ఉండాల్సిందేనని భావిస్తున్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. హైడ్రా వల్ల రాజకీయంగా నష్టపోతామని మంత్రి వర్గ సహచరులు చెబుతున్నా, సీఎం వినలేదంటున్నారు. చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమించుకున్నవారు ఎంతటి వారైనా కూల్చాల్సిందే అంటూ సీఎం దూకుడు చూపుతున్నారు. ఇందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీకే చెందిన కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు కుటుంబానికి చెందిన భవనాలు సైతం నేలమట్టం చేశారు. ఇదే ఊపులో మాజీ మంత్రి కేటీఆర్ లీజుకు తీసుకున్న జన్వాడ ఫాంహౌస్‌కు కూడా నోటీసులు ఇచ్చేసింది హైడ్రా. ఐతే ప్రతిపక్షాలను లొంగదీసుకోడానికే హైడ్రా అంటూ మొదట్లో విమర్శలు చేసిన బీఆర్ఎస్, బీజేపీ ఆ తర్వాత కొంత సైలెంట్ అయిపోయాయి. అయితే ఇప్పుడు హైడ్రా దూకుడు పెంచడం.. సామాన్యులు తిరగబడుతుండటంతో మళ్లీ ప్రజల తరఫున పోరాట పంథా ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎవరు అడ్డు చెప్పినా, హైడ్రాకు అపరమిత అధికారాలు కల్పించిన సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్, బీజేపీ అస్త్రాలను ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తి రేపుతోంది. ముఖ్యంగా ఎక్కడ కూల్చివేతలు ఉంటే అక్కడ క్షణాల్లో వాలిపోతున్న ఈటల రాజేందర్ ప్రభుత్వ వ్యతిరేకత పెంచేలా చాప కింద నీరులా వ్యవహరిస్తున్నారంటున్నారు. కొన్ని రోజులుగా ఇతర రాజకీయ కార్యక్రమాలను పక్కన పెట్టిన ఈటల పూర్తిగా హైడ్రాపై యుద్ధానికే సమయం కేటాయిస్తున్నారని అంటున్నారు. ఈ ఇష్యూలో బీజేపీకి మైలేజ్ పెరుగుతుందనే అంచనాతో ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం కూడా ఈటలను ప్రోత్సహిస్తూ.. మిగిలిన నేతలు కూడా బాధితుల తరఫున పోరాడాలని పిలుపునిస్తోంది. మరోవైపు ఎంఐఎం నేతల భవనాల జోలికి ఎందుకు వెళ్లడం లేదని ప్రభుత్వాన్ని నిలదీస్తోంది.





**మూసీ నది తీరంలో? :** ఇలా ప్రభుత్వంపై బీజేపీ ఒత్తిడి పెంచుతుండగా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కూడా ప్రజల గొంతు వినిపించేందుకు భారీ ప్రణాళిక రచిస్తోంది. ముఖ్యంగా మూసీ పరివాహక ప్రాంతాన్ని ఖాళీ చేయించాలనే ప్రభుత్వ లక్ష్యానికి సవాల్ విసురుతోంది. మూసీ నది తీరంలో పర్యాటక ప్రాజెక్టు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నుంచి ప్రయత్నిస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం విదేశాల్లో పర్యటించి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలంటే మూసీని ప్రక్షాళించాలని భావిస్తున్నారు. ఐతే మూసీ తీరంలో ఎక్కువగా పేదలు ఇల్లు నిర్మించుకుని నివసిస్తుండటంతో వారిని ఖాళీ చేయించడం సవాల్గా మారిందంటున్నారు. వీరిపైకి హైడ్రా బుల్డోజర్ వెళితే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే మూసీ తీరంలో సర్వే జరుగుతుండగా, స్థానికుల తరఫున పోరాటానికి బీఆర్ఎస్ నేత హరీశ్ రావు రంగంలోకి దిగారు. అసలే హరీశ్ రావుకు క్రౌడ్ పుల్లర్ అనే పేరుంది. ఆయన ఓల్డ్ సిటీలో హైడ్రాకు వ్యతిరేకంగా పోరాడితే పరిస్థితులు ఎటుదారి తీస్తాయోననే భయం వ్యక్తమవుతోంది. అధికారం కోల్పోయిన తర్వాత ప్రభుత్వంపై పోరాడటానికి బీఆర్ఎస్కు సరైన ఆయుధంగా హైడ్రా ఉపయోగ పడే అవకాశం ఉందంటున్నారు. ఇక పాతనగరంలో హైడ్రా బాధితులతో హరీశ్రావు చేతులు కలిపితే పార్టీకి మైలేజ్ పెరుగుతుందని అంచనాలో ఉంది గులాబీ దళం. ఇలా మూడు పార్టీల నేతలు హైడ్రా చుట్టూనే రాజకీయం చేస్తున్నారు. పాజిటివ్ టాక్తో ప్రజల మనసు గెలవాలని కాంగ్రెస్%ౌ% బాధితుల బాధలను తెరపైకి తెచ్చి హైడ్రా నిర్దయగా వ్యవహరిస్తోందని నిరూపించేలా ప్రతిపక్షాలు పావులు కదుపుతున్నాయి. మరి ఈ యుద్ధంలో అంతిమ విజేత ఎవరన్నది ఉత్కంఠ రేపుతోంది. మొత్తానికి టాక్ ఆఫ్ ద స్టేట్గా మారిన హైడ్రా ముందుముందు ఎలా వ్యవహరిస్తుందనేది చూడాల్సివుంది.

*విద్య వెంకట్, తెలంగాణ బ్యూరో 9391618181*

## హైడ్రా పనితీరు అద్భుతం



తెలంగాణ రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన హైడ్రా పనితీరు అద్భుతంగా ఉందని ప్రజా ఆలోచన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల గోపాలరావు అన్నారు. సమాజానికి ఉపయోగపడే జీవ నదులైన చెరువులు, కుంటలు, కాలువలతో పాటు పార్కులు ప్రజా అవసరాలకు ఉపయోగపడే ఖాళీ స్థలాలను కబ్జా చేసుకుని అక్రమంగా నిర్మించిన నిర్మాణాల ను తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉందన్నారు. ప్రభుత్వంలో భాగంగా హైడ్రా ఏర్పడడం అభినందనీయమన్నారు. హైడ్రా లాంటి సంస్థలు తెలంగాణ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పాలకులు హైడ్రాను స్వాగతించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలకు సేవ చేస్తామని రాజకీయాల్లోకి వచ్చి గద్దెనెక్కిన తర్వాత అక్రమ సంపాదనకు తెగపడే నాయకుల కు, అక్రమ సంపాదన కు అలవాటు పడిన అధికారులకు హైడ్రా లాంటి సంస్థ కనువిప్పు అవుతుందన్నారు. హైడ్రా కేవలం అక్రమాలను తొలగించడమే కాదు రాజ్యాంగం బద్ధంగా ప్రజలకు అవసరమైన పార్కులు, ఇతర ప్రజల అవసరాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ప్రజా ఆలోచన వేదిక**
**వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల గోపాలరావు**

## హైడ్రా పేరుతో ఎవరికీ అన్యాయం చేయం



మూసీకి, దాని పరివాహక ప్రాంతాలకు పూర్వవైభవం తెచ్చేలా 2026 జూన్లోపు నదిలోకి వచ్చే నీటిని శుద్ధి చేసి మంచినీళ్లను ప్రవహింపజేయాలన్నదే సీఎం రేవంతడ్డి లక్ష్యమని పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి, మూసీ ప్రాజెక్టు ఎండీ దానకిశోర్ తెలిపారు. కొత్త ప్రాజెక్టు మూసీ సుందరీ కరణ కోసం మాత్రమే కాదని దానిని ప్రక్షాళన చేసి ప్రజలను ప్రమాదం నుంచి కాపాడేందుకేనన్నారు. నిర్వాసితులు ఎవరినీ బలవంతంగా తరలించడం లేదని ఆయన స్పష్టం చేశారు. నిర్వాసితుల్లో దాదాపు 90 శాతం మంది ఖాళీ చేసేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎవరికైనా పట్టాలు ఉంటే 2013 చట్టం మేరకు రెట్టింపు ధరతో పరిహారం ఇస్తున్నట్లు చెప్పారు. శనివారం దానకిశోర్ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్తో కలిసి సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్లో నిజాం హయాంలో 1927లో మూసీకి వచ్చిన వరదల వల్ల భారీ నష్టం జరిగింది. ఇప్పుడు చిన్న వర్షాలకే హైదరాబాద్ ముంపునకు గురవుతోంది. పరీవాహక ప్రాంతం మురికికూపంలా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వందేళ్ల క్రితమే నిజాం మూసీ నది అభివృాఎద్ధి నమూనాలను రూపొందించారు. ఇవి లండన్ థేమ్స్ నది కంటే అద్భుతంగా ఉన్నాయి. వర్షాలు, వరదల నుంచి కోటి జనాభా ఉన్న హైదరాబాద్ ప్రజలను కాపాడుకునేందుకే మూసీ పునరుద్ధరణ చేపట్టాం. నదిలోకి వస్తున్న మురుగునీటిని రూ.3,800 కోట్లతో శుద్ధి చేయనున్నాం. వారంలో టెండర్లు పిలుస్తున్నాం. మూసీ రివర్ఫ్రంట్ పక్కనే 55 కిలోమీటర్ల పొడవైన ఈస్ట్, వెస్ట్ కారిడార్లను నిర్మిస్తాం. దీంతో ట్రాఫిక్ తగ్గుతుంది. నదీ తీరం వెంట పార్కింగ్ సదుపాయాలు, పార్కులు నిర్మిస్తాం ఆధునికీకరణ వల్ల వ్యాపారాలు పెరుగుతాయి.

**దాన కిషోర్**
**పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి**

### హైడ్రాపై దుష్ప్రచారం తగదు.. ఆక్రమణ దారులపైనే చర్యలు

చెరువులను కుంటలను కబ్జా చేసి అక్రమంగా నిర్మిస్తే వారిపైనే చర్యలు ఉంటాయని హైడ్రా కమీషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో హైడ్రా చేపడుతున్న కూల్చివేతలపై ఆయన స్పష్టత ఇచ్చారు. నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను తొలగిస్తామన్నారు. ఒవైసీ ఆసుపత్రి ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నప్పటికీ, దానిని కూల్చేందుకు హైడ్రా, ప్రభుత్వం భయపడుతుందనే విమర్శలు వస్తున్నాయని, ఒవైసీకి భయపడే విద్యా సంవత్సరం వృాఎథా పేరుతో వారికి ఆరు నెలల సమయం ఇస్తున్నట్లుగా చెబుతున్నారని ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించారు. కానీ మీరు కూల్చివేతలు చేసిన చోట పేదలు, చిన్న చిన్న కుటుంబాలు ఉన్నారని, వారిని మాత్రం పట్టించుకోలేదని అడిగారు. దీనిపై స్పందించిన రంగనాథ్, ఒవైసీది కావొచ్చు, మల్లారెడ్డి కాలేజీ కావొచ్చు, పల్లా రాజేశ్వర్ రెడ్డి కాలేజీలు కావొచ్చు కాలేజీలపై ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. కానీ అందరికీ సమయం ఇస్తున్నామని తెలిపారు. పిల్లల భవిష్యత్తును దృాఎష్టిలో పెట్టుకొని సమయం ఇచ్చామన్నారు. విద్యా సంవత్సరం ముగిశాక వాటిపై చర్యలు ఉంటాయని తేల్చి చెప్పారు. హైడ్రాను, ప్రభుత్వాన్ని ఒవైసీ ఛాలెంజ్ చేస్తున్నారు కదా అని సదరు మీడియా ప్రతినిధి తిరిగి ప్రశ్నించారు. అలాంటి వాటిపై నో కామెంట్ అని రంగనాథ్ అన్నారు. తమ ప్రథమ టార్గెట్ పెద్దవాళ్లేనని స్పష్టం చేశారు. విల్లాస్లలో ఉన్నది చిన్నవాళ్లే కావొచ్చు కానీ వాటి వెనుక పెద్దవాళ్లు ఉన్నారని తెలిపారు. జన్వాడ ఫామ్ హౌస్పై కూడా రంగనాథ్ స్పందించారు. జన్వాడపై తాను మాట్లాడబోనని, ఎందుకంటే అది 111 జీవో పరిధిలో ఉందని, హైడ్రా పరిధిలోకి రాదన్నారు. తమ పరిధిలోనే మాట్లాడుతామని తెలిపారు.

**రంగనాథ్, హైడ్రా కమిషనర్**

## పేదల ఇళ్లను కూలిస్తే చూస్తూ ఊరుకోం



కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో సామాన్య ప్రజల్లో భయం సృష్టిస్తోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. ప్రభుత్వానికి పోయేకాలం దగ్గర పడిందంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. నివాసాలను కూల్చివేస్తామంటూ అధికారులు పలు కాలనీల ప్రజలకు నోటీసులు ఇవ్వడంతో ఆయన మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. మచ్చబొల్లారం డివిజన్‌లోని జొన్నబండ వడ్డెర బస్తీ, చైతన్యపురి, కొత్తపేట డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఎంపీ ఈటలకు బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని మచ్చబొల్లారం డివిజన్‌లోని జొన్నబండ వడ్డెర బస్తీలో 70 ఏళ్లుగా నివాసం ఉంటున్న ప్రజలకు తహసీల్దార్ నోటీసులు ఇవ్వడంపై ఈటల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలను ఇబ్బందులు పెడితే చూస్తూ ఊరుకోమని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భూ కబ్జాదారులకు, ల్యాండ్ మాఫియాలకు, పైరవీకారులకు అండగా ఉంటూ పేదలకు నిలువ నీడ లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరిస్తోందని, పేదల ఇళ్లు కూలగొట్టి వారి బతుకుల్లో మట్టికొట్టే దుర్మార్గానికి ఒడిగట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నిజాం కంటే దుర్మార్గమైన పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు.

**ఈటల రాజేందర్**
**మల్కాజిగిరి ఎంపీ**

## ప్రజల ఆగ్రహానికి ప్రభుత్వం కొట్టుకుపోతుంది



ప్రజల ఆగ్రహానికి ప్రభుత్వం కొట్టుకుపోతుందని రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యదర్శి చెన్నమనేని స్రవంతి స్పష్టం చేశారు. పైసా పైసా కూడగట్టుకుని అభం శుభం తెలియని అమాయకులు భూములు కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకుంటే హైడ్రా పేరుతో అక్రమం అంటూ కూల్చివేస్తే మధ్యతరగతి బతుకులు ఏమి కావాలి. ఐదేళ్లకోసారి వచ్చిన ప్రభుత్వం ఎప్పటి నుండో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉటున్న వారిని బలవంతంగా ఖాళీ చేయించి ఆ ఇళ్లను కూల్చివేస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగిన మూల్యం చెల్లించక తప్పదు. తాము భారతీయ జనతా పార్టీ పక్షాన ప్రజలకు అండగా ఉంటామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇందిరమ్మ పేరుతో ప్రగల్భాలు పలికే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ ల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వకపోగా ఉన్న ఇళ్లను సైతం కూల్చివేసి ప్రజలను ఇబ్బందులు పెడితే రాబోయే రోజుల్లో ప్రజల ఆగ్రహానికి ప్రభుత్వం కొట్టుకపోక తప్పదు.

**చెన్నమనేని స్రవంతి**
**రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యదర్శి**

### అఖిలపక్షంతో సంప్రదించాకే మూసీపై ముందుకెళ్లాలి



మూసీలో గోదావరి నీళ్లు పారిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి.. పేద, మధ్య తరగతి ప్రజల కన్నీళ్లు పారిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వానికి పేదల ఆశీర్వాదాలు ఉండాలని, వారి గోసలు కాదని చెప్పారు. పేదల కన్నీళ్లపై అభివృద్ధి చేయడం ఏంటని ప్రశ్నించారు. మీ సోదరుడికి నోటీసులు ఇచ్చి, పేదల ఇంటికి బుల్డోజర్లు పంపుతారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రతినిధులు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో హైడ్రా బాధితులతో హరీశ్ రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదల ఇండ్లు కూల్చి మూసీపై పెద్ద భవనాలకు అనుమతి ఇస్తామంటున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం బాధితుల వద్దకు వస్తుందన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలను ఇబ్బంది పెట్టలేదని చెప్పారు. హైదరాబాద్ ఖ్యాతిని సీఎం రేవంత్ దెబ్బ తీస్తున్నారని చెప్పారు. అఖిలపక్ష సమావేశం నిర్వహించిన తర్వాతే మూసీపై ముందుకు వెళ్లాలని డిమాండ్ చేశారు. కూకటపల్లిలో హైడ్రా బాధితురాలు బుచ్చమ్మది ఆత్మహత్య కాదని, అది రేవంత్ రెడ్డి చేసిన హత్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముగ్గురు బిడ్డలకు ఇల్లు కట్టించి పెండ్లిళ్లు చేసిందని, ఆ ఇల్లు కూలగొడితే తన బిడ్డల భవిష్యత్తు ఏం అవుతుందని బాధతో ఆత్మహత్య చేసుకుందని వాపోయారు.

**టీ. హరీశ్ రావు**
**మాజీ మంత్రి**



## ముంబయి ఇండియన్స్ టీంపై క్లారిటీ

ముంబై: ఐపీఎల్ 2025 సీజన్ మెగా వేలం నేపథ్యంలో ఫ్రాంచైజీలు ఎంతమందిని రిటైన్ చేసుకోవచ్చనే అంశంపై స్పష్టత వచ్చింది. ఒక్కో ఫ్రాంచైజీ ఆరుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి ఐపీఎల్ పాలకవర్గం అనుమతినిచ్చింది. ఇందులో ఒక రైట్ టు మ్యాచ్ కలిసి ఉంటుంది. ఎంత మందిని రిటైన్ చేసుకోవచ్చనే దానిపై స్పష్టత రావడంతో ఏ ఫ్రాంచైజీ ఎవరెవరిని అట్టిపెట్టుకుంటుందనే దాని గురించి చర్చ మొదలైంది. ఐపీఎల్ అభిమానులు, మాజీ క్రికెటర్లు తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. భారత మాజీ క్రికెటర్ అజయ్ జడేజా ముంబయి ఇండియన్స్ ఎవరిని రిటైన్ చేసుకుంటే జట్టు ఎక్కువ ప్రయోజనం పొందుతుందో తెలిపాడు. ఇన్నాళ్లు జట్టుకు మూలస్తంభాలుగా ఉన్న స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రాలను ముంబయి కచ్చితంగా రిటైన్ చేసుకోవాలని సూచించాడు. వేలంలోకి వెళితే వారిని తిరిగి దక్కించుకోవడం అసాధ్యమని పేర్కొన్నాడు. "రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రాలను ముంబయి ఇండియన్స్ నిస్సందేహంగా రిటైన్ చేసుకుంటుందని చెప్పగలను. ఒకవేళ వేలంలోకి వెళ్తే ఈ ఆటగాళ్లను తిరిగి పొందడం అసాధ్యం. హార్దిక్ పాండ్య కోసం ముంబయి తమ రైట్ టు మ్యాచ్ (ఆర్టీఎం) కార్డును ఉపయోగించవచ్చని భావిస్తున్నా. హార్దిక్ లాంటి ప్రతిభావంతుడైన ఆటగాడిని వేలంలో దక్కించుకోవడం కష్టం. కానీ, అతడు తరచూ గాయాల బారినపడతాడు. దీంతో పాండ్య కోసం ఇతర ఫ్రాంచైజీలు భారీ మొత్తంలో వెచ్చించడానికి వెనకడుగు వేసే అవకాశముంది. అంతేకాని ఇది ఆటగాడి సామర్థ్యం లేదా శక్తిని నిర్ణయిస్తుందని నేను చెప్పడం లేదు" అని అజయ్ జడేజా వివరించాడు. మెగా వేలాన్ని దుబాయ్ లేదా సౌదీ అరేబియాలో నవంబర్లో నిర్వహించే అవకాశముంది.

### భారత్ - బంగ్లాదేశ్ రెండో టెస్టు..

# మూడో రోజూ అదే తంతు



కాన్పూర్: భారత్ - బంగ్లాదేశ్ రెండో టెస్టు మూడో రోజు ఆట కూడా రద్దైంది. నిన్నటి మాదిరిగానే ఒక్క బంతి కూడా పడకుండానే ఆటను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. ఇవాళ వర్షం లేకపోయినా.. మైదానం చిత్తడిగా ఉండటంతో ఆట నిర్వహణకు సాధ్యపడలేదు. తొలి రోజు కేవలం 35 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైన సంగతి తెలిసిందే. తొలుత బ్యాటింగ్ చేస్తున్న బంగ్లాదేశ్ 107/3 స్కోరుతో ఉంది.

రెండు సార్లు పరిశీలించినా..

వర్షం లేకపోవడంతో మూడో రోజు ఆట సాధ్యమవుతుందని అభిమానులు ఆశగా ఎదురు చూశారు. కానీ, అవుట్ ఫీల్డ్లో నీటిశాతం ఎక్కువగా ఉండటంతో ఆటగాళ్లు జారిపడే ప్రమాదం ఉంది.

దీంతో ఆట నిర్వహించడం ప్రమాదకరమని అంపైర్లు భావించారు. తొలుత ఉదయం 10 గంటలకు పిచ్, మైదానాన్ని పరిశీలించారు. మళ్లీ 12 గంటలకు, 2 గంటలకు మైదానమంతా కలియదిరిగి చూశారు. కాస్త ఎండ వచ్చినా.. ఆడేందుకు సరిగ్గా లేదనే ఉద్దేశంతో మూడో రోజు ఆట ముగిసినట్లు ప్రకటించారు.

సోమవారం కూడా ఇదే పరిస్థితి ఉంటే మ్యాచ్ దాదాపు డ్రా కావడం ఖాయమని.. అప్పుడు భారత డబ్ల్యూటీసీ పాయింట్లపై ప్రభావం పడే అవకాశం ఉంటుందని క్రికెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

### 2 గంటలకోసారి పిచ్ చెకింగ్



కాన్పూర్: భారత్ - బంగ్లాదేశ్ జట్ల మధ్య రెండో టెస్టుకు వరుణుడు తీవ్రం అంతరాయం కలిగిస్తున్నాడు. కాన్పూర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్లో తొలి రోజు కేవలం 35 ఓవర్ల ఆట కొనసాగగా.. రెండో రోజు ఒక్క బంతి పడకుండానే రద్దైంది. ఇక మూడో రోజైనా ఆదివారం కూడా పరిస్థితి అనుకూలంగా లేదు. ఉదయం నుంచి వర్షం లేకపోయినా మైదానం చిత్తడిగా ఉండటంతో మ్యాచ్ నిర్వహణకు అనుకూలంగా లేదని అంపైర్లు భావించారు. ఉదయం 10 గంటలకు ఒకసారి పరీక్షించినా.. అక్కడక్కడ మైదానం సిద్ధంగా లేకపోవడంతో ఆటను మళ్లీ వాయిదా వేశారు. మరోసారి 12 గంటలకు పిచ్, మైదానాన్ని పరిశీలించారు. అవుట్ ఫీల్డ్ ఆట నిర్వహణకు అనుకూలంగా లేకపోవడంతో ప్రారంభించలేదు. మళ్లీ మధ్యాహ్నం 2 గంటలకు పరిశీలించారు. దీంతో రెండు సెషన్ల ఆట ముగిసినట్లే. అప్పుడైనా మైదానం సిద్ధంగా ఉంటే మూడో సెషన్లో కొన్ని ఓవర్ల ఆటైనా ప్రారంభమవుతుంది. ప్రస్తుతం బంగ్లాదేశ్ తన తొలి ఇన్నింగ్స్లో 107/3 స్కోరుతో కొనసాగుతోంది.

### ఐపీఎల్ వేలంలో విదేశీ ఆటగాళ్లకు చెక్

## భారీ సొమ్ములు లేనట్టే



ముంబై: 2024 ఐపీఎల్ మినీ వేలంలో మిచెల్ స్టార్క్ను రూ.24.75 కోట్లు వెచ్చించి తీసుకోవడం సంచలనం సృష్టించింది. మరోసారి ఈ పరిస్థితి పునరావృతం అయ్యే అవకాశం లేకుండా బీసీసీఐ నిబంధనలు మార్చింది. రిటైన్ అయిన, మెగా వేలంలో ఎక్కువ మొత్తానికి కొనుగోలు చేసిన ఆటగాళ్ల కంటే ఎక్కువ సొమ్ము లభించకుండా నిబంధనలు మార్చింది.

2024లో స్టార్క్ ఐపీఎల్కు అందుబాటులోకి వచ్చాడు. మినీ వేలంలో కోల్కతా నైట్ రైడర్స్ రికార్డు ధరకు అతడిని కొనుగోలు చేసింది. ఇది విమర్శలకు దారితీసింది. విదేశీ ఆటగాళ్లు మినీవేలానికి మాత్రమే అందుబాటులో ఉండటంతో అత్యధిక ధరలు పొందుతున్నారనే ఆరోపణలు ఎదురయ్యాయి. 2025 సీజన్ నుంచి ఇది సాధ్యం కాదు. విదేశీ ఆటగాళ్లు 2026, 2027 సీజన్లో పాల్గొనాలంటే 2025 మెగా వేలంలో రిజిస్టర్ కావాలి. ఒక వేళ సదరు ఆటగాడు.. గాయపడినా, అనారోగ్యానికి గురైనా.. తమ సొంత దేశం బోర్డు ద్వారా ధ్రువీకరణ సమర్పించాలి.

ఇక 2026 మినీ వేలంలో విదేశీ ఆటగాళ్లు పొందే మొత్తంపై కూడా నియంత్రణ ఉంది. వారి ఫీజును జట్టులో అత్యధిక మొత్తానికి రిటెన్షన్ అయిన ఆటగాడు లేదా మెగా వేలంలో ఆటగాడి ఫీజు ఆధారంగా నిర్ణయిస్తారు. వారి ఇద్దరిలో తక్కువ ఫీజును పరిగణనలోకి తీసుకుంటారు. ఉదాహరణకు ముంబయి జట్టు రోహిత్ను రూ.18 కోట్లకు రిటైన్ చేసుకొని.. ఇషాన్ కిషన్ను అత్యధికంగా రూ.15 కోట్లకు 2025 మెగా వేలంలో కొనుగోలు చేస్తే.. ఇక మినీవేలం నుంచి వచ్చే విదేశీ ఆటగాడికి రూ.15 కోట్లకు మించి చెల్లించరు.

ఒక వేళ ఇషాన్ కిషన్ మెగా వేలంలో రూ.20 కోట్లకు సంతకం చేస్తే.. మినీ వేలంలో వచ్చే విదేశీ ఆటగాడికి రిటెన్ అయిన రోహిత్ ఫీజు రూ.18 కోట్ల కంటే ఎక్కువ ఇవ్వరు. ఇక ఫ్రాంచైజీలు వేలంలో ఎంతకైనా బిడ్లు వేయవచ్చు. కానీ, అదనపు మొత్తం ఆటగాళ్లకు వెళ్లదు. బీసీసీఐ బ్యాంక్ ఖతాలో అది జమ అవుతుంది.

### బెంగళూరులో కొత్త జాతీయ క్రికెట్ అకాడమీ



బెంగళూరు: బెంగళూరులో కొత్త జాతీయ క్రికెట్ అకాడమీని బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఆదివారం ప్రారంభించారు. ఆధునాతన హంగులతో, ప్రపంచ స్థాయి సదుపాయాలతో దీన్ని నిర్మించారు. 2000 సంవత్సరంలో ప్రారంభించిన ఈ ఎన్సీఏ అప్పటి నుంచి చిన్నస్వామి స్టేడియంలోని ప్రాంగణంలో నడుస్తోంది. కాగా ప్రస్తుతం బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉన్న 40 ఎకరాల్లో కొత్త ఎన్సీఏని నిర్మించారు. దీంట్లో మూడు ప్రపంచ స్థాయి మైదానాలు, ఇండోర్, అవుట్డోర్ సహా మొత్తం 86 పిచ్లు ఉన్నాయి. ఒలింపిక్ ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్, పెద్ద జిమ్, రీహాబిలిటేషన్ సెంటర్లు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన మైదానాలు విదేశీ కౌంటీ గ్రౌండ్లను తలపిస్తున్నాయి. ఆ మూడు మైదానాల్లో ప్రధానమైనది.. గ్రౌండ్ ఏ. ముంబయి ఎర్ర మట్టి పిచ్లతో ఆధునాతన సౌకర్యాలతో నిర్మించారు. ఫ్లడ్ లైట్ల కింద కూడా మ్యాచ్ నిర్వహించేలా, అత్యాధునిక ప్రసార సౌకర్యాలతో తీర్చిదిద్దారు. అలాగే గ్రౌండ్ బీ, సీ మైదానాలను 75 గజాల స్థలంలో ఆటగాళ్లు ప్రాక్టీస్ చేసేందుకు అణువుగా నిర్మించారు. ఇందులో 11 మాండ్యా మట్టి పిచ్లు, ఒడిశా నుంచి తెచ్చిన తొమ్మిది నల్ల కాటన్ మట్టి పిచ్లు ఉన్నాయి. అంతేకాకుండా కొత్త టెక్నాలజీతో కూడిన డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. వర్షం పడినప్పుడు ఆటకి అంతరాయం కలగకుండా ఈ పిచ్లు త్వరగా సిద్ధమవ్వడం వీటి ప్రత్యేకత. దాంతోపాటు 45 అవుట్డోర్ నెట్ ప్రాక్టీస్ పిచ్లను కూడా నిర్మించారు. యూకే, ఆస్ట్రేలియా నుంచి ప్రీమియం టర్ఫ్తో ఎనిమిది పిచ్లను సిద్ధం చేశారు. ఇంటిగ్రేటెడ్ కెమెరాలు, సహజ కాంతి కోసం గాజు పలకలు, అతి పెద్ద జిమ్, 3వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అతి పెద్ద డ్రెస్సింగ్ రూం.. ఇలా అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించారు.

### డబ్ల్యూటీసీ ర్యాకింగ్‌లో... శ్రీలంకకు మూడో ప్లేస్

#### కివీస్‌ను చిత్తు చేసి సిరీస్‌ను సొంతం చేసుకున్న శ్రీలంక



కొలంబో: న్యూజిలాండ్తో స్వదేశంలో జరిగిన రెండు టెస్టుల సిరీస్ను శ్రీలంక కైవసం చేసుకుంది. రెండో టెస్టులో కివీస్ను ఇన్నింగ్స్ 154 పరుగుల తేడాతో చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక మొదటి ఇన్నింగ్స్లో 602/5 స్కోరు వద్ద డిక్లేర్డ్ చేసింది. అనంతరం కివీస్ తొలి ఇన్నింగ్స్లో 88 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఫాలోఆన్లో పడిన కివీస్.. రెండో ఇన్నింగ్స్లో మెరుగైన ప్రదర్శన చేసింది. కానీ, ఇన్నింగ్స్ ఓటమి నుంచి మాత్రం తప్పించుకోలేకపోయింది. రెండో ఇన్నింగ్స్లో 360 పరుగులకు ఆలౌటైంది. గ్లెన్ ఫిలిప్స్ (78), మిచెల్ శాంట్నర్ (67), టామ్ బ్లండెల్ (60), డేవన్ కాన్వే (61) హాఫ్ సెంచరీలు సాధించారు. మొదటి ఇన్నింగ్స్లో 6, రెండో ఇన్నింగ్స్లో 3 వికెట్లు తీసిన ప్రభాత్ జయసూర్య లంక విజయంలో కీలక పాత్ర పోషించాడు. నిషాన్ పీరిస్ (6/170) అదరగొట్టగా.. ధనంజయ డిసిల్వా (1/28) ఫర్వాలేదనిపించాడు.

దిగజారిన న్యూజిలాండ్ పరిస్థితి

ఘోర ఓటమితో ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్ పాయింట్ల పట్టికలో న్యూజిలాండ్ (37.50 శాతం) ఏడో స్థానానికి పడిపోయింది. అద్భుతంగా టెస్టు సిరీస్ను సొంతం చేసుకున్న శ్రీలంక ఏకంగా మూడో ప్లేస్కు దూసుకొచ్చింది. ప్రస్తుతం లంక 55.56 శాతంతో మూడో స్థానంలో ఉంది. ఈ జాబితాలో భారత్ (71.67 శాతం), ఆస్ట్రేలియా (62.50 శాతం) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. న్యూజిలాండ్ వచ్చ నెలలో భారత్ పర్యటనకు రానుంది. మూడు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఇప్పటికే డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు నుంచి దాదాపు నిష్క్రమించిన కివీస్కు ఇక్కడా ఓటమి ఎదురైతే మాత్రం టెస్టు ర్యాంకింగ్స్పైనా ప్రభావం పడటం ఖాయం.

## టీమ్ ఇండియా రెండో ఓపెనర్ ఎవరు?



ముంబై: బంగ్లాదేశ్తో అక్టోబరు ఆరు నుంచి మూడు టీ20ల సిరీస్ ప్రారంభమవుతుంది. ఈ సిరీస్ కోసం భారత జట్టు ను ఎంపిక చేశారు. ఎప్పటిలానే 2o1 కాన్సెప్ట్తో ముగ్గురు ఓపెనర్లను ఎంపిక చేయాల్సిన టీమ్ ఇండియా సెలక్షన్ కమిటీ ఈసారి కేవలం ఒక్క ఓపెనర్నే సెలక్ట్ చేసింది. దీంతో అభిషేక్ శర్మ రూపంలో ఏకైక స్పెషలిస్ట్ ఓపెనర్తో జట్టు బరిలోకి దిగనుంది. ఈ నేపథ్యంలో మరో ఓపెనర్ ఎవరు అవ్వొచ్చు అనే చర్చ క్రికెట్ ఫ్యాన్స్లో జరుగుతోంది.

ప్రస్తుతం ఉన్న ఆప్షన్స్ చూస్తే.. సంజు శాంసన్కు టీ20ల్లో ఓపెనర్గా వచ్చిన అనుభవం ఉంది. సూర్యకుమార్ యాదవ్ కూడా గతంలో ఓసారి ప్రయత్నించాడు. ఇక నితీశ్ కుమార్ రెడ్డి కి దేశవాళీలో ఓపెనింగ్ చేసిన అనుభవం ఉంది. ఈ నేపథ్యంలో అభిషేక్ శర్మ తో కలసి మరో ఓపెనర్గా ఎవరు బరిలోకి దిగొచ్చు అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

**టీ20 సిరీస్కు భారత జట్టు ఇదే :** సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్, రింకు సింగ్, హార్దిక్ పాండ్య, రియాన్ పరాగ్, నితీశ్ కుమార్ రెడ్డి, శివమ్ దూబె, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, జితేశ్ శర్మ, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, మయాంక్ యాదవ్. అక్టోబరు 6, 9, 12 తేదీల్లో మూడు టీ20లు జరగనున్న విషయం తెలిసిందే.

### గాయత్రి-ట్రీసా జోడీ పరాజయం



మకావు: మకావు ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ జోడీ పోరాటం ముగిసింది. శనివారం మహిళల డబుల్స్ సెమీఫైనల్లో భారత జంట 17-21, 21-16, 10-21తో సియ్ పెయ్-హంగ్ జు (చైనీస్ తైపీ) జోడీ చేతిలో ఓడి కాంస్య పతకంతో సరిపెట్టుకుంది.

**గుల్వీర్ జాతీయ రికార్డుతో.. :** జపాన్లో జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్లో భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ సత్తా చాటాడు. అతడు 5 వేల మీటర్ల పరుగులో జాతీయ రికార్డు సృష్టిస్తూ స్వర్ణం గెలుచుకున్నాడు. గుల్వీర్ 13 నిమిషాల 11.82 సెకన్లలో లక్ష్యాన్ని చేరి పసిడి కైవసం చేసుకున్నాడు. ఈ క్రమంలో తన పేరిటే ఉన్న జాతీయ రికార్డు (13 నిమిషాల 18.92 సె)ను సవరించాడు. ఈ మార్చిలో గుల్వీర్ కాలిఫోర్నియాలో జరిగిన టెన్ ట్రాక్ మీట్లో 27 నిమిషాల 41.81 సెకన్లలో లక్ష్యాన్ని చేరి 10 వేల మీటర్ల జాతీయ రికార్డును కూడా బద్దలుకొట్టాడు. 2008లో సురేందర్ సింగ్ (28 నిమిషాల 02.89 సె) పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు.

**శిరీషకు కాంస్యం :** పట్నా: జాతీయ అండర్-23 అథ్లెటిక్ ఛాంపియన్షిప్లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి ముగడ శిరీష సత్తా చాటింది. మహిళల 400 మీటర్ల పరుగులో ఆమె 54.63 సెకన్లలో లక్ష్యాన్ని చేరి కాంస్యం గెలుచుకుంది. దివ్యానిబా (గుజరాత్, 53.53 సె) స్వర్ణం.. రస్దీప్ కౌర్ (పంజాబ్, 54.29 సె) రజతం సాధించారు. 1500 మీటర్లలో తోట సంకీర్తన (చత్తీస్గఢ్) పసిడి సొంతం చేసుకుంది. ఆమె 4 నిమిషాల 33.53 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచింది. లక్ష్మీప్రియ (ఒడిశా, 4 నిమిషాల 34.01 సె), అమన్దీప్ (పంజాబ్, 4 నిమిషాల 34.24 సె) రజత, కాంస్యాలు సాధించారు. తన్యా (హ్యామర్త్రో, యూపీ), పూర్వ (ట్రిపుల్జంప్, మహారాష్ట్ర) మీట్ రికార్డులు సృష్టిస్తూ పసిడి పతకాలను కైవసం చేసుకున్నారు.

**ఫైనల్లో యువ భారత్ :** థింపు (భూటాన్): శాఫ్ అండర్-17 ఫుట్బాల్ టోర్నమెంట్లో భారత్ ఫైనల్కు దూసుకెళ్లింది. శనివారం సెమీఫైనల్లో 4-2తో నేపాల్ను ఓడించింది. పాకిస్థాన్-బంగ్లాదేశ్ మధ్య సెమీస్ విజేతతో భారత్ టైటిల్ పోరులో తలపడనుంది.

# గంభీర్ ఎవరికీ తలవంచే రకం కాదు



ఢిల్లీ: భారత కెప్టెన్ రోహిత్ శర్మ గతంలో రాహుల్ ద్రవిడ్తో కలిసి పనిచేశాడు. ఇప్పుడు గౌతమ్ గంభీర్తో కలిసి జట్టును నడిపిస్తున్నాడు. భారత మాజీ క్రికెటర్ గంభీర్ ముక్కుసూటిగా వ్యవహరించే మనిషి. అతడు బాధ్యతలు అందుకొన్న తొలి పర్యటనలో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. ఇప్పుడు బంగ్లాదేశ్తో టీమ్ఇండియా టెస్టు సిరీస్ ఆడుతోంది. ఈ క్రమంలో జియో సినిమా ఇంటర్వ్యూలో గంభీర్ గురించి రోహిత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

"భారత జట్టుకు కోచ్గా గతంలో రాహుల్ భాయ్ పనిచేశాడు. ఇప్పుడు గౌతమ్ గంభీర్ వచ్చాడు. అతడు ఎవరికీ తలవంచే రకం కాదు. చివరి వరకూ పోరాడాలనే బలంగా భావిస్తాడు. దేశం కోసం ఎన్నో కీలకమైన ఇన్నింగ్స్ను ఆడాడు. ఇప్పుడు అతడితో కలిసి పని చేస్తున్నా. నేనాడుతూ జట్టును ముందుకు నడిపించడమే కెప్టెన్గా నా బాధ్యత. సహచరుల నుంచి అత్యుత్తమ ప్రదర్శన బయటకు తెప్పించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం భారత క్రికెట్ డ్రెస్సింగ్ రూమ్లో వాతావరణం చాలా బాగుంది. ఒకరికొకరం స్ఫూర్తి నింపుకోవడంపై దృష్టిసారించాం. టీ20లకు వీడ్కోలు పలికేందుకు సరైన సమయం అదేనని భావించి నిర్ణయం తీసుకున్నా. ఇప్పటికీ అన్ని ఫార్మాట్ల క్రికెట్ ఆడగలను. గత 17 ఏళ్లుగా టీ20లు ఆడుతూనే ఉన్నా. మనకు చాలా మంచి ప్లేయర్లు ఉన్నారు. వారికి అవకాశం రావాల్సి ఉంది" అని రోహిత్ వెల్లడించాడు.

ఎవరినీ వదులుకోం: గంభీర్

ఇంగ్లండ్తో టెస్టు సిరీస్లో రాణించిన సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ వంటి కుర్రాళ్లకు బంగ్లాతో టెస్టుల్లో అవకాశం ఇవ్వకపోవడంపై గంభీర్పై విమర్శలు వచ్చాయి. సీనియర్లు విరాట్ కోహ్లి, రిషభ్ పంత్, కేఎల్ రాహుల్ రావడంతో యువ క్రికెటర్లకు చోటు దక్కలేదు. దీనిపై గంభీర్ ఓ పాడ్కాస్ట్లో మాట్లాడుతూ.. "భారత క్రికెట్లో ప్లేయర్లకు కొదవేంలేదు. తుది జట్టు ఎంపిక అత్యంత కఠినమైన సవాల్. మేం కావాలని ఎవరినీ డ్రాప్ చేయం. ప్రతి ఒక్కరినీ ఎంపిక చేసేందుకు చూస్తాం. కొన్ని అంశాల వల్ల కొందరికే అవకాశం దక్కుతుంది. అంత మాత్రాన మిగతావారిలో టాలెంట్ లేదని కాదు" అని గంభీర్ వ్యాఖ్యానించాడు. సర్ఫరాజ్ను టెస్టు సిరీస్ కోసం ఎంపిక చేసినప్పటికీ.. తుది జట్టులో అవకాశం దొరకలేదు. కేఎల్ రాహుల్ను మేనేజ్మెంట్ బరిలోకి దింపింది.

# సూర్య సినిమా

# మెగాస్టార్ చేతుల మీదుగా బ్రహ్మానందంకు ఐఫా అవార్డ్



క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ దర్శకత్వంలో రాజ్యశ్యామల ఎంటర్టైన్మెంట్స్ హౌస్ ఫుల్ మూవీస్ బ్యానర్ పై గత ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం రంగమార్తాండ. విమర్శకుల ప్రసంశలు పొందిన ఈ చిత్రంలో రమ్యకృష్ణ, ప్రకాష్ రాజ్, బ్రహ్మానందం పోటీపడి నటించారు. దర్శకుడు కృష్ణవంశీ ఈ సినిమాను తీర్చి దిద్దిన తీరు అద్భుతం. ఇళయ రాజా సంగీతం, సిరివెన్నెల సీతారామశాస్త్రి సాహిత్యం ఇలా సినిమాకు ప్రతీది ఒక హైలెట్‌గా నిలిచాయి. ముఖ్యంగా బ్రహ్మానందం, ప్రకాష్ రాజ్ హాస్పిటల్ ఎపిసోడ్ సినిమా చూసిన పతి ఒక్కరిని కంటతడి పెట్టించాయి. అలా చక్ర పాణి, రాఘవరావు పాత్రలు కొంతకాలం ప్రేక్షకుల మనసులో చారగని ముద్ర వేసుకున్నాయి. తాజాగా దుబాయ్‌లో జరిగిన ఐఫా అవార్డ్స్ కార్యక్రమంలో లెజండరీ నటుడు బ్రహ్మానందంకు ఉత్తమ సపోర్టింగ్ కేటగిరీలో అవార్డ్ రావడం విశేషం. ఈ అవార్డ్‌ను మెగాస్టార్ చిరంజీవి చేతులమీదుగా బ్రహ్మానందం అందుకున్నారు. "ఈ అవార్డ్ రావడం తనకు సంతోషాన్ని ఇచ్చిందని, ఈ క్రెడిట్ మొత్తం డైరెక్టర్ కృష్ణవంశీకి చెందుతుందని తెలిపారు.

## చిన్నారి గుండెలకు సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ భరోసా




మరోసారి తన మంచి మనసు చాటుకున్నారు సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్. చిన్నారి గుండెలకు తన వంతు భరోసా కల్పించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా 'ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్' హైదరాబాద్ బంజారాహిల్స్ రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు సాయి దుర్గ తేజ్. చిన్నారుల్లో హృదయ సంబంధ సమస్యలకు చికిత్స అందించేందుకు 'ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్' చేస్తున్న ప్రయత్నాన్ని సాయి దుర్గ తేజ్ అభినందించారు. ఈ సంస్థకు తన వంతుగా 5 లక్షల రూపాయల విరాళాన్ని అందించారు. మనమంతా కలిసి పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తును సృష్టిద్దామంటూ పిలుపునిచ్చారు సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్. ఆయన మంచి మనసును రెయిన్ బో చిల్డ్రన్ హాస్పిటల్ వైద్యులు, ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్ నిర్వాహకులు ప్రశంసించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండే సాయి దుర్గతేజ్.. ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదలతో ఇబ్బంది పడిన తెలుగు ప్రజలను ఆదుకునేందుకు తన వంతుగా 20 లక్షల రూపాయల విరాళాన్ని అందించారు.

## 'జిగ్రా'ని తెలుగులో విడుదల చేస్తున్న రానా దగ్గుబాట



సినిమాకు భాషతో, హద్దులతో సంబంధం లేదు. అందుకు ఉదాహరణగా నిలుస్తోంది 'జిగ్రా' మూవీ. ఆలియా భట్, వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న ఈ చిత్రంపై బాలీవుడ్‌లో మంచి అంచనాలున్నాయి. ఇప్పుడు ఈ అంచనాలు దక్షిణాదికి వ్యాపించనున్నాయి. మంచి సినిమాలకు తన వంతు ఆదరణను ఎప్పుడూ తెలియజేసే హీరో రానా దగ్గుబాటి ఈ సినిమాను తెలుగులో విడుదల చేయటానికి సిద్ధమయ్యారు. 'జిగ్రా' చిత్రాన్ని తెలుగులో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా రానా విడుదల చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా హిందీ ట్రైలర్ విడుదలై అంచనాలను పెంచిన సంగతి తెలిసిందే. కాగా జిగ్రా తెలుగు ట్రైలర్‌ను గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా... రానా దగ్గుబాటి మాట్లాడుతూ "జిగ్రా కథలో మంచి సోల్ ఉంది. భాషతో సంబంధం లేకుండా ఎవరికైనా ఇది కనెక్ట్ అవుతుంది. ఇలాంటి వైవిధ్యమైన కథతో రూపొందిన ఈ సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందించాలని భావించాం. అందుకనే ధర్మ ప్రొడక్షన్స్‌తో కలిసి నేను, ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్ ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నామని గర్వంగా తెలియజేస్తున్నాం. జిగ్రా అనేది కేవలం యాక్షన్ చిత్రం మాత్రమే కాదు.. మా కుటుంబంలోని అనుబంధాలను తెలియజేసే చిత్రం. మనం ఎంతగానో ప్రేమించే వ్యక్తులను మనం ఎలా కాపాడుకోవాలో తెలియజెప్పే సినిమా. ఆలియా భట్, వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం భాష, సరిహద్దులతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు అద్భుతమైన అనుభవాన్ని అందిస్తుందనటంలో సందేహం లేదు" అన్నారు.

## "స్వాగ్" లో మహారాణి రుక్మిణీదేవిగా రీతు వర్మ



అందం, ప్రతిభ గల అతి తక్కువ మంది తెలుగు హీరోయిన్స్‌లో ఒకరు రీతు వర్మ. పెళ్లి చూపులు, టక్ జగదీశ్, వరుడు కావలెను, కనులు కనులను దోచాయంటే వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకుంది రీతువర్మ. ఫిలింమేకర్స్‌లో ప్రామిసింగ్ యంగ్ యాక్ట్రెస్‌గా పేరు సంపాదించుకుంది. తెలుగుతో పాటు తమిళంలోనూ పలు క్రేజీ ప్రాజెక్ట్స్ చేస్తోంది రీతు వర్మ. ఆమె అప్ కమింగ్ రిలీజ్ స్వాగ్ తో మరోసారి ప్రేక్షకుల్ని అలరించబోతోంది. స్వాగ్ సినిమాలో వింజామర వంశ మహారాణి రుక్మిణీ దేవి పాత్రలో రీతువర్మ కనిపించనుంది. మహా రాణి రుక్మిణీ దేవి పాత్రతో ఆమె అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. స్వాగ్‌లో రీతు వర్మ క్యారెక్టర్ హైలైట్ కానుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి. ఛాలెంజింగ్ క్యారెక్టర్స్ చేసేందుకు ఇష్టపడే రీతు వర్మ..మహారాణి రుక్మిణీ దేవి పాత్ర కోసం ప్రత్యేకంగా సన్నద్ధమైంది. ఆమె ఎఫర్ట్ స్క్రీన్ మీద కనిపించబోతోంది. ప్రస్తుతం రీతు వర్మ తెలుగుతో పాటు తమిళంలోనూ పలు ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్ చేస్తోంది.

## 'రహస్యం ఇదం జగత్' టీజర్



కొత్తదనంతో కూడిన చిత్రాలను, వైవిధ్యమైన కథలను మన తెలుగు ప్రేక్షకులు ఆదరించడానికి ఎప్పుడూ సిద్ధంగా వుంటారు. ఇక వాళ్లతో ఆసక్తిని కలిగించే సైన్స్ ఫిక్షన్ అండ్ మైథాలాజికల్ థ్రిల్లర్స్ అంటే.. అందునా మన పురాణాలు, ఇతిహాసాల గురించి ఏదైనా అంశంతో రూపొందిన చిత్రమంటే ఎంతో ఆసక్తితో చూస్తారు. సరిగ్గా అలాంటి జానర్‌లోనే రాబోతున్న చిత్రం రహస్యం ఇదం జగత్. రాకేష్ గలేబి, స్రవంతి పత్తిపాటి, మానస వీణ, భార్గవ్ గోపీనాథం ముఖ్యతారలుగా రూపొందుతున్న చిత్రం రహస్యం ఇదం జగత్. సింగిల్ సెల్ యూనివర్స్ ప్రొడక్షన్ పతాకంపై కోమల్ ఆర్ భరద్వాజ్ దర్శకత్వంలో పద్మ రావినూతుల, హిరణ్య రావినూతుల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సైన్స్ ఫిక్షన్ అండ్ మైథలాజికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రూపొందుతుంది. నవంబరు 8న చిత్రం విడుదల కానుంది. ఇటీవల ఈ చిత్రం నుంచి విడుదల చేసిన ప్రమోషన్‌ల్ కంటెంట్ డేట్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా ఈ చిత్రం టీజర్‌ను అమెరికాలోని డల్లాస్‌లో విడుదల చేశారు మేకర్స్. తొలిసారిగా ఓ తెలుగు చిత్రం అమెరికాలో టీజర్ విడుదల చేయడం ఇదే తొలిసారి. డల్లాస్‌లోని యూనివర్శిటి ఆఫ్ టెక్సాస్ డల్లాస్‌లో జరిగింది. అక్కడ వున్న క్యాంపస్ మూవీ థియేటర్‌లో టీజర్ ఆవిష్కరణ జరిగింది. ఈ వేడుకలో యూనివర్శిటి స్టూడెంట్స్‌తో పాటు అమెరికాలోని సినీ ప్రేమికులు, తానా నాటా అసోసియేషన్ ప్రతినిథులతో పాటు ఇతర తెలుగు అసోసియేషన్ సభ్యులు కూడా హాజరయ్యారు. ఇప్పటి వరకు యూఎస్‌లో ఇలాంటి ఫంక్షన్ జరగడం ఇదే తొలిసారి కావడంతో భారీ ఎత్తున్న ఆడియన్స్ హాజరయ్యారు. ఇక టీజర్‌ను గమనిస్తే సైన్స్ ఫిక్షన్‌కు మైథాలాజికల్ అంశాలతో పాటు థ్రిల్లింగ్ అడ్వెంచరస్‌ను ఇండియన్ హిస్టారికల్ అంశాలను వెలికితీసే టీమ్‌కు ఎదురైన పరిస్థితులతో ఈ చిత్రం రూపొందుతున్నట్లుగా అనిపిస్తుంది. టీజర్ చూస్తుంటే అందరిలో సినిమాపై మంచి బజ్, ఇంట్రెస్ట్ కలుగుతుందనటంలో ఎటువంటి సందేహం లేదు. తప్పకుండా ఇలాంటి విభిన్నమైన, కొత్త కాన్సెప్ట్ చిత్రాలనే నేడు ప్రేక్షకులు ఆదరిస్తున్నారు అన్నారు.

## మాధవ్ ఎనర్జిటిక్ గా పర్ ఫార్మ్ చేశాడు

### - డైరెక్టర్ ప్రశాంత్ వర్మ



మాస్ మహరాజ్ రవితేజ తమ్ముడు రఘు కొడుకు మాధవ్ హీరోగా నటిస్తోన్న సినిమా "మిస్టర్ ఇడియట్". ఈ చిత్రంలో సిమ్రాన్ శర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. జేజేఆర్ ఎంటర్ టైన్ మెంట్స్ ఎల్ఎల్ పీ పతాకంపై శ్రీమతి యలమంచి రాణి సమర్పణలో నిర్మాత జె జే ఆర్ రవిచంద్ "మిస్టర్ ఇడియట్" సినిమాను నిర్మిస్తున్నారు. పెళ్లి సందడి చిత్రంతో కమర్షియల్ హిట్ అందుకున్న దర్శకురాలు గౌరీ రోణంకి డైరెక్ట్ చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. హైదరాబాద్ లో "మిస్టర్ ఇడియట్" సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిటర్ విప్లవ్ నైషధం మాట్లాడుతూ – "మిస్టర్ ఇడియట్" కంటెంట్ ఉన్న మంచి కమర్షియల్ మూవీ. ఈ చిత్రంతో మాధవ్, సిమ్రాన్ పరిచయం అవుతున్నా, వాళ్ల నటన ఎక్కడా కొత్తవాళ్లు చేసినట్లు అనిపించదు. ఈ చిత్రానికి వర్క్ చేసే అవకాశం ఇచ్చిన డైరెక్టర్ గౌరి గారికి, ప్రొడ్యూసర్ రవిచంద్ గారికి థ్యాంక్స్ అన్నారు. అతిథిగా వచ్చిన డైరెక్టర్ ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ – రవితేజ గారు ఇండస్ట్రీలో ఎంతోమందిని ఎంకరేజ్ చేశారు. నన్ను కూడా ఆయన ఎంకరేజ్ చేశారు. ఈ ఫంక్షన్ కు పిలిచినప్పుడు మాధవ్ ను సపోర్ట్ చేయడం నా బాధ్యతగా భావించి వచ్చాను. నేనే కాదు ఇండస్ట్రీలో చాలా మంది మాధవ్ ను సపోర్ట్ చేస్తారు. సీసీఎల్ కు వెళ్లినప్పుడు రఘు గారు ఒక సాంగ్ చూపించారు. అది "మిస్టర్ ఇడియట్" లో మాధవ్ చేసిన సాంగ్. చాలా బాగుంది ఎవరు హీరో అని అడిగితే మా అబ్బాయి అని చెప్పారు. టైటిల్ మిస్టర్ ఇడియట్ అని చెప్పగానే నాకు ఇడియట్ సినిమా చూసిన రోజులు గుర్తొచ్చాయి. నేను కూడా చంటిగాడిలా ఫీలయ్యేవాడిని. ఆ సినిమాలో హీరోయిజం కొత్త ట్రెండ్ క్రియేట్ చేసింది. మాధవ్ సినిమాకు మిస్టర్ ఇడియట్ అనే పేరు పెట్టడం బాగుంది. చాలా ఎనర్జిటిక్ గా నటించాడు మాధవ్. రవితేజ గారి స్థాయికి మాధవ్ చేరుకోవాలని కోరుకుంటున్నా. మా సినిమా బాగుందని అనుకోవడం వేరు. చిన్న చిన్న మిస్టేక్స్ ఉన్నాయి వాటిని సరిచేసుకున్నాం అని చెప్పడం గొప్ప విషయం అన్నారు.

## 'మా' సభ్యులందరికీ ఫ్రీ హెల్త్ చెకప్ క్యాంప్

మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ సభ్యులందరికీ కూడా ఫ్రీ మాస్టర్ హెల్త్ చెకప్ క్యాంప్‌ను ఆదివారం నిర్వహించారు. 'మా' ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ విష్ణు మంచు, వైస్ ప్రెసిడెంట్ మాదాల రవి ఈ హెల్త్ క్యాంప్‌ను జీవీకే హెల్త్ హబ్ ద్వారా ఏర్పాటు చేశారు. ఈ ఫ్రీ హెల్త్ చెకప్‌లో 'మా' సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం మీడియాతో విష్ణు మంచు మాట్లాడుతూ.. 'డా.శాస్త్రి గారికి, జీవీకే హెల్త్ హబ్‌కు థాంక్స్. 'మా' సభ్యులందరికీ ఫ్రీ హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి హెల్త్ క్యాంప్ ప్రారంభమైంది. వేల ఖర్చుతో కూడుకున్న ఈ హెల్త్ చెకప్‌ను ఫ్రీగా అందిస్తున్నందుకు థాంక్స్. ఇది ఇకపై ఇలా కొనసాగాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.
మాదాల రవి మాట్లాడుతూ.. 'జీవీకే హెల్త్ హబ్‌తో కలిసి మాస్టర్ హెల్త్ చెకప్‌ను గ్రాండ్‌గా నిర్వహిస్తున్నాం. 'మా' అధ్యక్షుడు విష్ణు మంచు మా సభ్యుల ఆరోగ్యానికి ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తుంటారు. ఇది మా ఆధ్వర్యంలో నాలుగో హెల్త్ క్యాంప్. మా సభ్యుల ఆరోగ్యం, సంక్షేమం కోసం హెల్త్ కార్డ్‌లను జారీ చేశాం. వాటిని అందరూ వినియోగించుకోవాలి. దేశంలో అత్యవసర సేవల విషయంలో జీవీకే సంస్థ చేస్తున్న కృషి అందరికీ తెలిసిందే. మా సభ్యుల కోసం ఇలా హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేసేందుకు సాయం చేసిన జీవీకే రెడ్డి గారికి థాంక్స్' అని అన్నారు.




## హీరోయిన్ హేమలత రెడ్డికి గ్లామన్ మిసెస్ ఇండియా 2024 అవార్డు




జెమినీ టీవీ యాంకర్ గా చేసి, నిన్ను చూస్తూ సినిమాతో హీరోయిన్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన హేమలత రెడ్డి నేడు గ్లామన్ మిసెస్ ఇండియా 2024 అవార్డు - బెస్ట్ టాలెంట్ మరియు బెస్ట్ ఫోటోజెనిక్ ఉప శీర్షికలు మీద అవార్డు అందుకున్నారు. కిరీటం గెలిచిన తర్వాత హేమలత రెడ్డి తన గ్లోరీ కిరీటంతో అంతర్జాతీయ షూట్ చేసారు మరియు గ్లామన్ డైరెక్టర్ శ్రీమతి మన్ దువా కూడా అక్కడ ఉత్సాహంగా తమ ఆనందాన్ని పంచుకున్నారు. తర్వాత హేమలత రెడ్డి మన్ దువా మేడమ్‌తో కలిసి బటుకేశవరా ఆలయాన్ని సందర్శించారు. ఈ నెల 28న హైదరాబాద్ కి తిరిగి వచ్చిన తర్వాత గచ్చిబౌలి లోని డెక్కన్ సరై గ్రాండ్ లో గ్రాండ్ సెలబ్రేషన్స్ చేశారు.
ఈ సందర్భంగా హీరోయిన్ హేమలత రెడ్డి మాట్లాడుతూ : నేను ఎప్పటి నుండో ఇండస్ట్రీ లో ఉన్నాను. జెమిని టివి లో ఒక యాంకర్ గా మొదలుపెట్టి సీరియల్స్ చేశాను, ఆ తరువాత ప్రొడక్షన్ మీద ఇంట్రెస్ట్ తో ప్రొడ్యూసర్ కావాలి అనుకుని ఒక సినిమా తీశాను. ఆ తర్వాత కోవిడ్ టైంలో ఫ్యాషన్ సైడ్ ట్రై చేశాను. సెలెక్ట్ అయ్యి రౌండ్స్ అన్ని వర్చువల్ గా కంప్లీట్ చేశాను. ఫైనల్ సెలక్షన్స్ కి మలేషియా వెళ్లాను. అక్కడ కాంపిటీషన్ చాలా టఫ్ గా నడిచింది. దక్షిణాది నుండి నేను మాత్రమే వెళ్లగలిగాను. చివరిగా గెలిచాను. మన మాతృ భాష తెలుగులోనే నేను అక్కడ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాను. నేను గెలుస్తను అని అనుకోలేదు. అక్కడ నార్త్ %ఽ% సౌత్ అనే పార్షియలిటీ లేదు. అటు నటన, అలాగే ఇటు గ్లామర్ రెండు కష్టమైన పనులే. నేను ప్రొడ్యూసర్ గా హీరోయిన్ గా చేసిన సినిమా నిన్ను చూస్తూ. ఆ సినిమాలో సుహాసిని , సుమన్ , సయాజి షిండే లాంటి సీనియర్ నటులతో నటించాను. వాళ్ల దగ్గర నుంచి ఎంతో నేర్చుకున్నాను అన్నారు.

**PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD**, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. **PRINTED AT SPR PRINTING PRESS,** SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081**, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD,** SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. **EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232** RNI Registration No. APTEL/2007/22044